
శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180



నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

జైళ్ల పరిస్థితులపై
సమగ్ర వివరాలు పంపండి
రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు 'సుప్రీం' ఆదేశాలు

న్యాయ వ్యవస్థ బలోపేతానికే ఎఐ
భర్తీ చేయడానికి కాదు...
సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ 05

సంపుటి 09, సంచిక: 112 | సోమవారం | 23-03-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# ఎన్నికలప్పుడే రాజకీయాలు

## సంక్షేమం.. అభివృద్ధే లక్ష్యాలు



● సిద్దిపేట ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇస్తాం ● రైతును రాజు చేయటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం ● ఎటిసి సెంటర్లలో శిక్షణ పొందిన వారికి ఉద్యోగం ● రైతు సంక్షేమం కోసం ప్రతి నెలా రూ.5,500 కోట్లు వెచ్చిస్తున్నాం ● రైతు భరోసా తొలివిడుత రూ.3,600 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/ సిద్దిపేట

ఎన్నికలప్పుడే రాజకీయాలని.. తర్వాత అభివృద్ధి.. ప్రజాసంక్షేమమే తమ ధ్యేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను సమదృష్టితో చూస్తున్నామని.. ఏ ప్రాంతంపై వివక్ష చూపటం లేదని అన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు నిధులు ఇవ్వటం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారని.. అన్ని నియోజక వర్గాలకు ఇచ్చినట్లుగానే సిద్దిపేట, గజ్వేల్, సిరిసిల్లా నియోజకవర్గాలకు నిధులు ఇచ్చానని. ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చినట్లు సిఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. సిద్దిపేట అభివృద్ధి ఉంటే వివక్ష ఉంటే 300 కోట్లతో నర్మేట్టలో నిర్మించిన అయిల్ పామ్ ప్యాక్టరీని కొడంగల్‌కు తరలించేవారినన్నారు. బిఆర్‌ఎస్ అధికారంలో నున్నప్పుడు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలను విస్మరించి సిద్దిపేట, సిరిసిల్లా, గజ్వేల్ నియోజక వర్గాలకు పెద్దపీట వేశారన్నారు. బిఆర్‌ఎస్ పాలనలో కొడంగల్ నియోజక వర్గాని ఎన్ని నిధులు కేటాయించారో లెక్కలు చూసుకోవచ్చనని. సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో గత 40 ఏళ్లుగా ఒకే కుటుంబం పాలిస్తుందని.. ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. 2029లో బిఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని కొందరు నాయకులు కలలు కంటున్నారని. 2029లోను మళ్లీ తామే వస్తామని సిఎం సంపూర్ణ విశ్వాసం వ్యక్తం చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలోను విజయం సాధిస్తామని... గెలిచిన ఎమ్మెల్యేకు తప్పక మంత్రి పదవి ఇస్తామని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. సిద్దిపేటలో ఎమ్మెల్యే కోసం ఫ్యాక్టరీ కట్టలేదని, ప్రజల కోసం ఫ్యాక్టరీని నిర్మించినట్లు తెలిపారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో రైతుఉత్సవాల్లో భాగంగా 300 కోట్లతో నిర్మించిన అయిల్‌పామ్ ఫ్యాక్టరీని సిఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నంప్రభాకర్, దామోదర రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామిలతో కలసి తరువాయి 2లో



ఆరుట్ల వెంకట లక్ష్మీనరసింహారెడ్డి

## కన్నుమూత

సిపిఐ నాయకుల ఘన నివాళి

ప్రజాపక్షం/హయత్ నగర్

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సిపిఐ సీనియర్ నాయకుడు కామ్రేడ్ ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి (ఆరుట్ల రామచంద్రారెడ్డి సోదరుడు) మనవడు ఆరుట్ల వెంకట లక్ష్మీనరసింహ రెడ్డి శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆదివారం మన్సూరాబాద్‌లోని ఆయన స్వగృహంలో ఉన్న పార్థివ దేహానికి సిపిఐ రాష్ట్ర, జాతీయ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరై ఆరుట్ల కుటుంబం ఎర్రజెండాకు, బడుగు బలహీన వర్గాలకు చేసిన సేవలను గుర్తుచేసుకుని, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమం సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ నర్సింహా, సీనియర్ నాయకులు ఉజ్జయిని రత్నాకర్,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి, సమితి సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్, సిపిఐ అబ్దుల్లాపూర్‌మెట్ కార్యదర్శి అజ్మీరా హార్సింగ్ నాయక్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి సామిడి వంశి వర్ధన్ రెడ్డి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బొంగు అరుణ్ కుమార్ గౌడ్, సిపిఐ హయత్ నగర్ సహాయ కార్యదర్శి మర్రి శోభన్, డిహెచ్‌పిఎస్ నియోజకవర్గ కార్యదర్శి పాల్వాయి సురేందర్, ఏఐటియుసి హయత్ నగర్ కార్యదర్శి గోల్కొండ నాగరాజు తో పాటు తదితరులు పెద్ద ఎత్తున హాజరై ఘనంగా నివాళులు అర్పించారు.

వ్యవసాయ రంగం పణంగా

## వాణిజ్య ఒప్పందం

'ది గ్రేట్ బిట్రేయల్' పుస్తకావిష్కరణలో డి.రాజా

**న్యూఢిల్లీ:** దేశ ప్రయోజనాలు, సార్వభౌమాధికారంతో ప్రధాని మోదీ రాజీ పడుతున్నారని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. యావత్ రైతాంగాన్ని, వ్యవసాయ రంగాన్ని పణంగా పెట్టేసి అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకున్నారని దుయ్యబట్టారు. న్యూఢిల్లీలోని సిపిఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో అఖిలభారత కిసాన్ సభ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్ రచించిన 'ది గ్రేట్ బిట్రేయల్: మోదీ గవర్నమెంట్స్ ట్రేడ్ డీల్ విత్ అమెరికా ఏ కంప్లీట్ సరెండర్'ను డి.రాజా ఆవిష్కరించారు. రైతాంగానికి వెన్నుపోటు పొడిచి, వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టి, అమెరికాకు మోదీ ప్రభుత్వం దాసోహమైనట్లు రాజా విమర్శించారు. మోదీ ప్రభుత్వ రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక, కార్మికకర్షక వ్యతిరేక చర్యలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రాజన్ క్షీరసాగర్ రాసిన ఈ పుస్తకం భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం వెనుక వాస్తవికలు, రైతాంగంపై ప్రభావాన్ని సూచిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్థిక వేత్త డాక్టర్ అరున్ కుమార్, సిపిఐ కార్యదర్శులు బికె కాంగో, గిరీశ్ శర్మ, ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య పాల్గొన్నారు.

## 'ఎగ్జిక్యూటివ్' చెప్పుచేతల్లో సిఇసి

జ్ఞానేష్‌కుమార్ తొలగింపునకు ఇచ్చిన నోటీసులో విపక్షాల ఆరోపణలు

**న్యూఢిల్లీ :** ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్‌కుమార్‌పై ప్రతిపక్షపార్టీ ఎంపీలు ప్రవేశపెట్టిన నోటీసులో తీవ్రస్థాయి ఆరోపణాస్త్రాలు సంధించారు. ఆయన 'కార్యనిర్వాహకవర్గం' (ఎగ్జిక్యూటివ్) చెప్పు చేతల్లో నడుచుకుంటున్నారని విమర్శించారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ద్వారా ఆయన ఓటు హక్కు హరణకు కారణమవుతున్నారని ఆక్షేపించారు. అంతేకాకుండా ఆయన నియామకంపై అనేక ప్రశ్నలను లేవనెత్తారు. మార్చి 12న పార్లమెంట్ ఉభయ సభలలో సమర్పించిన నోటీసులలో



ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై 'నిరూపితమైన దుష్ప్రవర్తన' ఆధారంగా ఏడు అభియోగాలనే ప్రస్తావించారు. ఆయనను తరువాయి 2లో



## ఇది ఉద్యమ నామ సంవత్సరం

ఈ ఏడాదంతా ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటం కొనసాగించేందుకు సిపిఐ సిద్ధం

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/సూర్యాపేట

ఇది ఉద్యమ నామ సంవత్సరం అని, ఈ ఏడాదంతా ప్రజా సమస్యల పైన సిపిఐ రాజీలేని పోరాటం కొనసాగించేందుకు సిద్ధంగా ఉండాలని సిపిఐ జాతీయ కార్యదర్శి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి సిపిఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయం బొమ్మగాని ధర్మబిక్షం భవన్‌లో జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి 10వ తేదీ వరకు గడప గడపకు సిపిఐ పేరుతో తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సిపిఐ కార్యకర్తలు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ముఖ్యంగా స్థానిక సమస్యలపై దృష్టి సారించాలని, పంటలు ఎండిపోకుండా రైతులకు నీరు అందేలా అధికారులతో మాట్లాడి వారి ఇబ్బందులను తొలగించాలని, ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకై ప్రజలను సమీకరించి సంబంధిత అధికారులకు వినతిపత్రాలు ఇప్పించాలని, కొత్తగా రెండు లక్షల రేషన్‌కార్డులు, మరో రెండు లక్షల మందికి పెన్షన్లు తరువాయి 12లో

భవన నిర్మాణ నిబంధనల్లో

## భారీ మార్పులు

టిడిఆర్ వినియోగం ఇక మరింత సరళం !



ప్రజాపక్షం/హైదరాబాద్

భవన నిర్మాణ నిబంధనలలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేసింది. తెలంగాణలో నిర్మాణ రంగాన్ని మరింత క్రమబద్ధీకరించేందుకు, రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిచ్చేలా ప్రభుత్వం మార్పులు చేసింది. బదిలీ చేయగల అభివృద్ధి హక్కులు(ట్రాన్స్‌ఫర్ డెవప్‌మెంట్ రైట్స్ టిడిఆర్) వినియోగంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. 'తెలంగాణ బిల్డింగ్ రూల్స్ 2012'కు కీలక సవరణలు చేస్తూ జి.ఓ 95ను విడుదల చేసింది. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ పేరుతో వెలువడిన ఈ జి.ఓలో టిడిఆర్ వినియోగం, హైరైజ్ భవనాల గుర్తింపు, సెట్‌బ్యాక్ సడలింపులపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఈ కొత్త నిబంధనలు తక్షణమే అమలులోకి రానున్నాయి. 10 అంతస్తులకు పైగా నిర్మించే భవనాల్లో టిడిఆర్ వినియోగాన్ని తప్పనిసరి చేసింది. 20 అంతస్తులకుపైగా ఉన్న భవనాలకు తరువాయి 2లో

ప్రజలకు భరోసా కల్పించేలా

## బడ్జెట్ రూపకల్పన

విద్య, వైద్యం, గృహ నిర్మాణానికి ప్రాధాన్యం
ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్

ప్రజలకు భరోసా కల్పించేలా బడ్జెట్ రూపకల్పన చేసినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. పుట్టిన బిడ్డ నుంచి చివరి వ్యక్తి వరకు ఏదో ఒక పథకాన్ని అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ తాను ప్రజా ప్రతినిధిగా గ్రామాల్లో పర్యటించినప్పుడు, పాదయాత్ర చేసిన సమయంలో, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలను గుర్తించి వాటికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. ముఖ్యంగా విద్య, వైద్య, గృహ నిర్మాణానికి ప్రాధాన్యత కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలో నివసించే 1.15 కోట్ల కుటుంబాలకు ఐదు లక్షల బీమా సౌకర్యాన్ని కల్పిస్తూ పథకాన్ని రూపొందించామన్నారు. కుటుంబ పెద్ద మరణిస్తే సామాజికంగా, ఆర్థికంగా ఆ కుటుంబాన్ని ఆదుకునేలా ఈ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యను అభ్యసించే విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను తరువాయి 2లో

## హైదరాబాద్‌పై ఎన్ఐఎ చూపు

అమెరికా, ఉక్రేన్ ఉగ్రవాదులతో
బర్మా యువకుల లింక్‌పై ఆరా



ప్రజాపక్షం/హైదరాబాద్

జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవల ఢిల్లీ, కోల్‌కత్త, లక్నోలలో అమెరికా, ఉక్రేన్‌కు చెందిన ఏడుగురు ఉగ్రవాదులు పట్టుబడడమే ప్రధాన కారణం. హైదరాబాద్‌లో దశాబ్దకాలంగా శరణార్థులుగా జీవిస్తున్న మయన్మార్ (బర్మా) యువకులతో వీరికి ఏదైనా లింక్ ఉందా అనే విషయంపై ఎన్ఐఎ ఆరా తీస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. అమెరికా, ఉక్రేన్ నుంచి వచ్చిన 14 మంది ఉగ్రవాదుల్లో ఏడుగురు మాత్రమే పట్టుబడగా మిలిగిన ఏడుగురు ఎక్కడికి వెళ్లారనే విషయంపై ఎన్ఐఎ జల్లెడ పడుతుంది. ఈ మేరకు కేంద్ర నిఘా సంస్థలు అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈ క్రమంలోనే హైదరాబాద్‌పై ఎన్ఐఎ ప్రత్యేక దృష్టి పెట్టింది. దేశ భద్రతకు ముప్పుగా మారే అంతర్జాతీయ కుట్రను బహిర్గతం చేస్తూ జాతీయ దర్యాప్తు సంస్థ కీలక చర్యలు తరువాయి 2లో

## 48 గంటలే గడువు

ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

● హోర్ముజ్‌ను తెరవకపోతే ఇరాన్ విద్యుత్ కేంద్రాలు నేలమట్టం ● పశ్చిమాసియాలో ఇంధన కేంద్రాల ధ్వంసానికి ఇరాన్ ప్రతిహెచ్చరిక ● ఇజ్రాయెల్ అరద్ నగరంలో విధ్వంసం సృష్టించిన ఇరాన్ క్షిపణులు ● యుద్ధంలో చేరాలని ప్రపంచనాయకులకు నెతన్యాహూ పిలుపు ● క్లస్టర్ బాంబులతో కసిదీరా ఇజ్రాయెల్ పట్టణాలపై దాడులు ● ఐడిఎఫ్ ఎఫ్–16 జెట్‌ను ధ్వంసం చేసిన ఐఆర్‌జిసి



**దుబాయ్ :** హోర్ముజ్ జలసంధిని 48 గంటల్లో తెరవాలని ఇరాన్ ప్రభుత్వానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అల్టిమేటం జారీ చేశారు. హోర్ముజ్ జలసంధిని తాను పెట్టిన గడువులోపు వాణిజ్య నౌకల రాకపోకల కోసం తెరవకపోతే ఇరాన్‌లో ఉన్న విద్యుత్ కేంద్రాలన్నింటినీ నేలమట్టం చేస్తామని తరువాయి 12లో



అడవుల సంరక్షణతో

## సుస్థిర భవిష్యత్తు

స్వచ్ఛమైన ప్రాణవాయువుకు అడవులే మూలాధారం
ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలి : మంత్రి సీతక్క

ప్రజాపక్షం/ములుగు

అడవుల సంరక్షణతోనే సుస్థిర భవిష్యత్తుకు బలమైన పునాది లభిస్తుందని, స్వచ్ఛమైన ప్రాణవాయువుకు అడవులే మూలాధారంగా ఉంటాయని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలను నాటాలని, అడవుల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క తరువాయి 12లో

అసెంబ్లీ సమావేశాల్లో

## బిసి సబ్ ప్లాన్ చట్టం చేయాల్సిందే

బిసి సంఘాలు, అఖిలపక్ష నేతల డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్



రాష్ట్ర బడ్జెట్‌లో బిసిలకు బిక్షంగా కాకుండా, ఒక హక్కుగా వాటా దక్కాలంటే ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ మాదిరిగా బిసిలకు కూడా చట్టబద్ధమైన సబ్ ప్లాన్ తీసుకురావడానికి తక్షణమే రాష్ట్ర అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించాలని బిసి సంఘాల నేతలు, అఖిలపక్ష పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం 'రాష్ట్ర బడ్జెట్‌లో బిసిల వాటా' అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ, కాంగ్రెస్ నేత వి.హనుమంతరావు, బిజెపి ఓబిసి మోర్చా అధ్యక్షులు జి. ఆనంద్ గౌడ్, బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణలు పాల్గొని మాట్లాడారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసిల సంక్షేమానికి రూ. 20 వేల కోట్లు కేటాయించాలని, చట్టబద్ధమైన బిసి సబ్ ప్లాన్ తీసుకురావాలని, బిసి విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించడం కోసం రూ. పదివేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎల్.రమణ మాట్లాడుతూ 60 శాతం ఉన్న తరువాయి 12లో



# క్యూబాకు అంతర్జాతీయ సోషలిస్టుల విరాళాలు

3 నెలలుగా చమురు బంద్

కుప్పకూలిన విద్యుత్ వ్యవస్థ.. గాఢాంధకారంలో ప్రజలు

**హవానా:** అమెరికా విధించిన తీవ్ర చమురు ఆంక్షల ఫలితంగా క్యూబాలో ఒక్క వారం రోజుల్లోనే రెండోసారి కూడా పవర్‌గ్రిడ్‌లు విఫలమయ్యాయి. దీంతో రాజధాని హవానా నగరం సహా అనేక ప్రాంతాలలో రాత్రివేళ ప్రజలు గాఢాంధకారంలో గడుపుతున్నారు. దాదాపు కోటి మంది ప్రజలు, ఇళ్ళు, వ్యాపార కేంద్రాలు, కార్యాలయాలలో విద్యుత్ లేకుండా ఉండిపోయారు. రాత్రివేళ ప్రజలు ఉన్నచోటనే సెల్‌ఫోన్‌లను లేదా లాంతర్లను వెలిగించుకుని గడుపుతున్నారు. మూడు నెలలుగా క్యూబాకు చమురు సరఫరా నిలిచిపోయింది. 'జాతీయ విద్యుత్ వ్యవస్థ పూర్తిగా నిలిచిపోయింది' అని క్యూబా ఇంధన మంత్రిత్వ శాఖ సోషల్ మీడియా వేదికగా ఒక పోస్టింగ్ పెట్టింది. అమెరికా అనుసరిస్తున్న దాష్టీక విధానాలు,కుట్రలు పూర్తిగా తెలిసిన ప్రజలు కష్టాలను కూడా సుఖాలతో సమానంగా స్వీకరిస్తున్నారు. ఒక గ్రామంలో మోటారు సైకిలు కాంతిలోనే ప్రజలు రాత్రివేళ ఒకచోట గుమిగూడి ఆనందంగా గడిపారు. ఆసుపత్రులు, నీటి సరఫరా వ్యవస్థలతోపాటు కీలకమైన వ్యవస్థలకు ప్రాధాన్యమిస్తూ వాటిని పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు క్యూబా గ్రిడ్ ఆపరేటర్ యుఎన్‌ఈ ప్రకటించింది. దీంతో క్యూబా దేశాన్ని ఈ కష్టకాలంలో ఆదుకునేందుకు అంతర్జాతీయ సోషలిస్టుల బృందాల కూటమి సహాయం చేసేందుకు ముందుకు వచ్చింది. సోలార్ ప్యానెళ్లతోపాటు వివిధ సహాయ సామాగ్రి తీసుకుని సోషలిస్టు బృందాల కూటమి ఒకటి రాజధాని హవానాకు చేరుకుంది. ప్రాథమిక ఆహార కిట్లు, ఔషధాలను వారు తీసుకువచ్చారు. అదేవిధంగా మెక్సికో నుండి కూడా ఒక నౌక విరాళాలు తీసుకుని క్యూబాకు బయలుదేరింది. నుయెస్ట్రా అమెరికా అనే ఒక సహాయ నౌకాదళం మెక్సికో నుండి బయలుదేరి సోమవారం హవానాకు చేరుకుంటుంది. అంతకుముందు ప్రజలు వేలాదిమంది అమెరికాకు వ్యతిరేకిస్తూ గిన్నెలు, చెంబులతో భారీ ప్రదర్శన చేశారు. మరికొన్ని చోట్ల ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది.

ఈ ఏడాది జనవరి మూడో తేదీన అమెరికా డెల్టా సైనిక బృందం వెనిజులా అధ్యక్ష భవనంపై దాడిచేసి అధ్యక్షుడు మదురో, ఆయన భార్యను బంధించి నేరస్తులుగా ముద్రవేసి అమెరికాకు తరలించింది. అక్కడి జైలులో ఉన్నారు. అప్పటినుండి క్యూబాకు చమురు, ఇంధన వనరుల సరఫరాను ట్రంప్ ప్రభుత్వం నిలిపివేసి సమస్యలు సృష్టించడం ప్రారంభించింది. దీంతో క్యూబాలో అనేక వ్యవస్థలు పనిచేయకుండా మూలపడ్డాయి. క్యూబా ప్రభుత్వం దిగ్బంధాన్ని ట్రంప్ వాడిస్తున్నారు. క్యూబా–అమెరికా విదేశీ మంత్రిత్వశాఖల ప్రతినిధుల మధ్య ఇప్పటికే శాంతియుత పద్ధతులలో సంభాషణలు జరిగాయి. క్యూబాను రక్షించుకోవడానికి దేశంలోని ప్రజలు ఒక సన్నాహక ప్రణాళికతో ఉన్నారని ఆ దేశాధ్యక్షుడు కానెల్ ప్రకటించారు.క్యూబా సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకుంటూ అమెరికాతో సమాన గౌరవ ప్రాతిపదికపై చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం చేసుకోవడానికి తమ దేశం సిద్ధంగా ఉందని కానెల్ ప్రకటించారు.

# పశ్చిమాసియాలో యుద్ధం బూమరాంగ్!

డీగోగార్షియాపై ఇరాన్ దాడి
ఊహించని పరిణామం

శక్తిమంతమైన క్షిపణులను వెలికితీసిన ఇరాన్



**దుబాయ్:** పశ్చిమాసియాలో ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని అమెరికా–ఇజ్రాయెల్ ప్రారంభించిన యుద్ధం అంచనాలు తప్పి బూమరాంగ్ (దాడిచేసినవాడిమీదకే తిరిగి దాడి)గా మారింది. మూడువారాలు దాటి యుద్ధం నాలుగోవారంలోకి ప్రవేశించిన తర్వాత ఇరాన్ మరింత బలం పుంజుకుంది. ఒకొక్క మారణాస్త్రాన్ని బయటకు తీయడం ప్రారంభించి శత్రువు అంచనాలను తారుమారు చేసింది. డీగో గార్షియాపై క్షిపణి ప్రయోగం, కీలకమైన అమెరికా నిఘా డ్రోన్ కూల్చివేతల ద్వారా అసలైన వ్యూహం అమలు చేస్తామని హెచ్చరికలు పంపించింది.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన స్వరం పెంచి తీవ్ర హెచ్చరికలు చేసేకొద్దీ ఇరాన్ మరింత బలంగా నేలకు కొట్టిన బంతిలా పైకిలేచి ప్రతిహెచ్చరికలు చేస్తోంది. హిందూమహాసముద్రంలో ఛాగోస్ ఐలాండ్‌లో ఉన్న డీగో గార్షియా దీవిలో ఉన్న అమెరికా–బ్రిటన్ ఉమ్మడి సైనిక స్థావరంపై శనివారం దాడిచేసి యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన ఇరాన్ ఈ యుద్ధం ఇంతటితో ఆగదని స్పష్టం చేసింది. ఛాగోస్ ఒక ద్వీప సమూహం. ఇందులో దాదాపు 60 చిన్న చిన్న ద్వీపాలున్నాయి. వీటిల్లో పెద్దతి అమెరికా–బ్రిటన్‌లకు కీలకమైనదీ డీగో గార్షియా స్థావరం. దాదాపు 56 ఏళ్ళుగా అమెరికా దీనిని కీలక ఆయుధాల కేంద్రంగా మార్చుకుంది. ఇరాన్‌కు ఏకంగా 4000 కి.మీ దూరంలో ఉన్న డీగోగార్షియా లక్ష్యాన్ని దెబ్బతీసేందుకు ఖండాంతర క్షిపణిని ప్రయోగించి తన శక్తిసామర్థ్యాలను చాటుకుంది. ఎంతో శక్తిమంతమైన ఆయుధాలను ఇంకా బయటకు తీయలేదని, అవన్నీ అమెరికాకోసం దాచే ఉంచామని ఇరాన్ నాయకులు గతంలో చేసిన ప్రకటనలు వట్టి ప్రగల్భాలు కాదని రుజువు చేయడంతో డోనాల్డ్ ట్రంప్ అప్రమత్తమయ్యారు. ఇరాన్‌కు 48 గంటలు మాత్రమే సమయం ఇస్తున్నామని, ఈ లోపు హోర్ముజ్ జలసంధిని తెరవాలని లేకపోతే ఇరాన్‌లో ఉన్న విద్యుత్ వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. కానీ ఇరాన్ అందుకు భయపడలేదు. వెంటనే ప్రతిహెచ్చరిక చేసింది. పశ్చిమాసియా అంతటా ఉన్న అమెరికా మౌలిక సదుపాయాలను, ఇంధన వనరుల కేంద్రాలను ధ్వంసం చేస్తామని ప్రతిహెచ్చరికచేసి ట్రంప్‌కు దీటుగా నిలబడటంతో అమెరికా ప్రతిష్ఠకు, యుద్ధాహంకారానికి భంగపాటు ఎదురవుతోంది. రోజు రోజుకూ ఏకాకిగా మారుతున్నప్పటికీ అనివార్యమైన పరిస్థితుల్లో వ్యతిరేక వాతావరణంలో ట్రంప్ గాంభీర్యం ప్రదర్శించాల్సి వస్తోంది. ఇరాన్ వద్ద క్షిపణి నిల్వలు తగ్గిపోయాయని, ఆ దేశానికి ఉన్న క్షిపణుల లక్ష్య సామర్థ్యం 2000 కి.మీ దూరం మాత్రమేనని ఇప్పటివరకూ ట్రంప్ చెబుతూ వచ్చారు. కానీ డీగోగార్షియాపై చేసిన క్షిపణి దాడి లక్ష్యదూరం 4000 కి.మీ కావడంతో ఒక ఊహించని పరిణామంగా తెరమీదకు వచ్చింది. ఇప్పుడు ట్రంప్ చైనా–రష్యాలపై సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమాసియాలో దేశాలు అమెరికా దాడులు చేసేందుకు ఇష్టపడకపోవడం ఒక ఎత్తైతే, డీగోగార్షియాను కేంద్రంగా చేసుకుని అత్యంత సురక్షితంగా యుద్ధం నడపవచ్చునని కూడా ట్రంప్ భావించారు. శ్రీలంక సమీపంలో ఇరాన్ యుద్ధ నౌకను నీట ముంచివేయడం ద్వారా ట్రంప్ అతిపెద్ద తప్పిదానికి పాల్పడిన ఇరాన్‌ను రెచ్చగొట్టారు. అమెరికా దీనికి తగిన మూల్యం చెల్లిస్తుందని ఇరాన్ హెచ్చరించింది. అంతేకాకుండా ప్రపంచ వ్యాప్తంగా కీలకమైన పర్యాటక ప్రాంతాలు కూడా ఇక తమ శత్రుదేశాలకు (అమెరికా–ఇజ్రాయెల్) ఎంత మాత్రం సురక్షితం కాదని, వారు భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందేనని చేసిన హెచ్చరికలను ప్రపంచ విశ్లేషకులు, వివిధ దేశాల నాయకులు తేలికగా కొట్టిపారేయడంలేదు. హోర్ముజ్ జలసంధి ద్వారా శత్రుదేశాల వాణిజ్య కార్యకలాపాలకు మాత్రమే నిషిద్ధమని ఇరాన్ ఇప్పటికే అనేక సార్లు ప్రకటించింది. హోర్ముజ్‌లో ఉద్రిక్తతలు సృష్టించిన అమెరికా–ఇజ్రాయెల్‌ను ప్రధాన లక్ష్యంగా చేసుకుని ఎన్ని దశాబ్దాలైనా పోరాటం చేస్తామని ప్రకటించింది.

### అత్యంత కీలకమైన అమెరికా నిఘా డ్రోన్ కూల్చివేత

ఎవరికీ అందనంత ఎత్తులో విహరిస్తూ నిఘా కార్యకలాపాలు నిర్వహించే శక్తిమంతమైన అమెరికా నిఘా డ్రోన్‌ను ఆదివారం తాజా దాడుల్లో ఇరాన్ కూల్చివేసి మరోసారి తన యుద్ధ సామర్థ్యాన్ని నిరూపించుకుంది. అమెరికాకు చెందిన ఎంక్యూ–9 రీపర్ డ్రోన్ బుష్‌హెర్ మీదుగా వెళుతుండగా, ఇరాన్ రక్షణ దళాలు కూల్చివేశాయి. ఈ నిఘా డ్రోన్ గిరికీలు కొట్టుకుంటూ నేలనుతాకి వట్టి బూడిదగా మారిపోయిన దృశ్యాన్ని వీడియో ద్వారా ఇరాన్ దళాలు విడుదల చేసి అమెరికా డొల్ల తనాన్ని నిరూపించాయి. అమెరికా సైనిక కార్యకలాపాలలో అత్యంత కీలకమైన ఈ నిఘా డ్రోన్ గిర గిరా తిరుగుతూ నేలకూలిన నాటకీయ దృశ్యాన్ని ఒక ఘన విజయంగా ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ భావిస్తోంది. 23 రోజులుగా హోర్ముజ్ జలసంధిని స్తంభింపజేసి ఉంచడం, జరిమానా టోల్ వసూలు ప్రకటనలు కూడా ఐఆర్‌జిసి విజయాల ఖాతాల్లో చేరిపోయాయి. రోజు రోజుకూ ఘర్షణ తీవ్రమయ్యేకొద్దీ నష్టాలు అమెరికా సైన్యానికి నష్టాలు పెరుగుతున్నాయి. అమెరికా యుద్ధ నైపుణ్యాన్ని గొప్పగా అంచనావేసుకున్న యూరోపియన్ మిత్రులు, పెట్టుబడిదారీ పాశ్చాత్య ప్రపంచ ఆరాధకులు నిరాశ చెందుతున్నారు.

### కుప్పకూలిన ఖతార్ మిలిటరీ హెలికాప్టర్ : ఆరుగురు దుర్మరణం

**దోహా:** ఖతార్‌లో మిలిటరీ హెలికాప్టర్ కుప్పకూలిపోవడంతో అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు మరణించారు. రోజువారీ కార్యకలాపాలలో భాగంగా ఖతార్ ప్రాదేశిక జలాలపై ప్రయాణిస్తున్న సమయంలో హెలికాప్టర్ కుప్పకూలిపోయిందని రక్షణఅధికారులు ఆదివారం చెప్పారు. పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ఈ సైనిక హెలికాప్టర్ కూలిపోయింది. ఐతే పశ్చిమాసియాలో యుద్ధానికి, ఈ హెలికాప్టర్ ప్రమాదానికీ సంబంధంలేదని, హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం తలెత్తడంవల్ల ప్రమాదం సంభవించిందని అధికారులు చెప్పారు. జలాల్లో పడిపోయిన హెలికాప్టర్‌ను వెతికి వెలికితీసేందుకు తీరప్రాంత గస్తీ దళాలతోపాటు ప్రత్యేక దర్యాప్తు బృందాలను రంగంలోకి దించినట్లు హోంమంత్రిత్వశాఖ ప్రకటించింది.



# స్లోవేనియా ఎన్నికల్లో సవాలు విసురుతున్న ట్రంప్ మిత్రుడు

**లుబ్లియానా:** మధ్యయూరప్‌లో ఆల్ప్ పర్వతశ్రేణులవద్ద కొలువుదీరిన గణతంత్ర దేశం స్లోవేనియాలో ఆదివారం పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. ఈ సారి ఎన్నికల్లో కన్జర్వేటివ్‌లు పెద్ద సవాలుగా మారారు. తిరిగి అధికారం సంపాదించేందుకు విపరీతమైన ప్రయత్నాలు చేస్తున్నారు. నేషనల్ అసెంబ్లీగా పిలిచే జాతీయ పార్లమెంటులో మొత్తం 90 స్థానాలు ఉండగా, ప్రభుత్వ అధికారం సంపాదించడానికి ఏ పార్టీ అయినా 46 సీట్ల మెజారిటీ తెచ్చుకోవాలి. ఫ్రీడమ్ మూమెంట్‌పార్టీతోపాటు స్లోవేనియా డెమోక్రాట్స్,న్యూ స్లోవేనియా–క్రిస్టియన్ డెమోక్రాట్స్,సోషల్ డెమోక్రాట్లు, వామపక్షాలు ఈ ఎన్నికల్లో పోటీలో ఉన్నాయి. మూడుసార్లు గతంలో ప్రధానమంత్రిగా పనిచేసిన సోషల్ డెమోక్రటిక్‌పార్టీ ఆఫ్ స్లోవేనియా (ఎస్‌డిఎస్) నాయకుడు జానెజ్ జాన్సా (68) అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు బలమైన మిత్రుడుగా ఎన్నికల బరిలోకి దిగారు. జానెజ్ జాన్సా పూర్తిగా కమ్యూనిస్టు వ్యతిరేకి. పచ్చి మితవాది. కార్మిక వ్యతిరేకి.ఇప్పుడు ఈ ఎన్నికల్లో ప్రధానంగా జానెజ్ జాన్సాకు, ప్రస్తుత ప్రధానమంత్రి రాబర్ట్ గోలోబ్‌కు మధ్య అధికారంకోసం పోరాటం జరుగుతోంది. ప్రస్తుతం జాన్సా ఆధిక్యంలో ఉన్నట్లు ముందస్తు సర్వేలు తెలియజేస్తున్నాయి. జాన్సా ఇజ్రాయెల్ అనుకూలవాది కాగా, గోలోబ్ పాలస్తినా రాజ్యానికి అనుకూలుడు.అవినీతి నిర్మూలన, ప్రజా సంక్షేమం, ప్రజారంజక పాలనవంటి అంశాలను ఎన్నికల ప్రచారాంశాలుగా అభ్యర్థులు తెరమీదకు తెచ్చారు. ప్రస్తుత ప్రధానమంత్రి ఫ్రీడమ్ మూమెంట్ పార్టీ నాయకుడు గోలోబ్ ఎన్నికల్లో గెలిచి 2022 జనవరిలో పదవీ బాధ్యతలు తీసుకున్నారు. 41 సీట్లు గెలుచుకుని సెంటర్ లెఫ్ట్, సోషల్ డెమోక్రాట్స్‌తో కలిసి మిశ్రమ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. గాజాలో ఇజ్రాయెల్ యుద్ధాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. పాలస్తినాను స్వంతంత్రదేశంగా గుర్తిస్తున్నట్లు 2024లో ప్రకటించారు.

## బడ్జెట్ రూపకల్పన (మొదటి పేజీ తరువాయి)

అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. గురుకులాలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌తో పాటు ప్రతి నియోజక వర్గంలో తెలంగాణ మోడల్ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారంగా మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగి జావ అందించనున్నట్లు తెలిపారు. యుక్త వయస్సులో ఉన్న ఇంటర్మీడియట్ విద్యార్థులు కూడా పౌష్టికాహారం అందించాలని ఈ ఏడాది నుంచి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. వైద్య రంగానికి ప్రాధాన్యతనిస్తూ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో బెడ్స్ సామర్థ్యాన్ని 30వేల నుంచి 44వేలకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్రంలో ఇండ్లు లేని పేదలు ఉండకూడదనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇంటి పథకం ద్వారా 4.5 లక్షల ఇండ్లను మంజూరు చేశామని వాటికి నిధులు కూడా కేటాయించామని ఇండ్ల నిర్మాణం చేపట్టిన వారికి వారం వారం నిధులు కూడా జమ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది ప్రతి నియోజక వర్గానికి వెయ్యి ఇండ్లు మంజూరు చేయనున్నామన్నారు. ఉద్యోగులకు వారి కుటుంబాలకు కూడా క్యాష్‌లెస్ వైద్యాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. రైతాంగానికి అన్ని రకాల అండగా ఉండేందుకు రైతుభరోసాతో పాటు సన్న ధాన్యానికి రూ. 500 బోనస్ కల్పిస్తున్నామన్నారు. ఎకరం లోపు ఉన్న రైతులకు ఆరువేల చొప్పున రైతు భరోసా నిధులు మంజూరు చేశామని 45 రోజుల్లో పూర్తి స్థాయిలో రైతు భరోసా విడుదల చేస్తామని తెలిపారు. నీటిపారుదల రంగానికి ప్రాధాన్యత కల్పిస్తూ ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉన్నత విశ్వ విద్యాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశామని తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలో జీవించే గిరిజనులకు సంబంధించి ఇందిర సౌర జల గిరి వికాస పథకం క్రింద బోర్లు, మోటార్లు, విద్యుత్ సౌకర్యం ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఆర్టిసిలో ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు గృహ విద్యుత్ ఉచితంగా అందిస్తున్నామన్నారు. గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంఎల్‌ఎ కొండబాల కోటేశ్వరరావు, మాజీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావిద్, దొబ్బల సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, బాలగంగాధర్ తిలక్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఐఎ చూపు

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టింది. మయన్మార్ సరిహద్దు ప్రాంతాలతో సంబంధం ఉన్న కేసులో అమెరికాకు చెందిన వ్యక్తి సహా మొత్తం 7 మంది విదేశీయులను అధికారులు ఈ నెల 17 నుంచి 19 వరకు ఢిల్లీ, కోల్‌కతా, లక్నో విమానాశ్రయాల్లో వేర్వేరు ఆపరేషన్లలో అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు సమాచారంతో భద్రతా సంస్థలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించి అరెస్టు చేశారు. వివిధ ప్రాంతాల్లో అరెస్ట్ చేసింది. అరెస్టైన వారిలో ఒకరు అమెరికన్ కాగా, మరో ఆరుగురు ఉక్రెయిన్ పౌరులు ఉన్నారు. వీరు భారత్‌లో టూరిస్ట్ వీసాలతో ప్రవేశించి, మిజోరం రాష్ట్రం ద్వారా మయన్మార్ సరిహద్దు ప్రాంతాలకు అక్రమంగా వెళ్లినట్లు విచారణలో వెల్లడైంది.

**ఉగ్రవాద కార్యకలాపాలకు సహాయం..**

దర్యాప్తు సంస్థల సమాచారం ప్రకారం, ఈ విదేశీయులు మయన్మార్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఎథ్నిక్ ఆర్మ్డ్ గ్రూప్స్‌కు శిక్షణ ఇచ్చినట్లు అనుమానం వ్యక్తమవుతోంది. ఆయుధ వినియోగం, డ్రోన్ టెక్నాలజీ, కమ్యూనికేషన్ వ్యవస్థలపై ప్రత్యేక శిక్షణ అందించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

యూరప్ దేశాల నుంచి డ్రోన్లు, ఆధునిక పరికరాలు తెచ్చి మయన్మార్ ప్రాంతానికి తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. డ్రోన్ వార్‌ఫేర్, సర్వైలెన్స్, జామింగ్ టెక్నాలజీల్లో వీరు నైపుణ్యం కలిగినవారిగా గుర్తించారు. అరెస్టైన ఏడుగురిని ఢిల్లీ కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారిని 11 రోజులపాటు ఎన్ఐఎ కస్టడీకి అప్పగించింది. ప్రస్తుతం వీరిని అధికారులు లోతుగా విచారిస్తున్నారు.ఇప్పటికే కీలక విషయాలు వెలుగు చూశాయి.

**హైదరాబాద్‌లో మయన్మార్ వాసులు..**

మయన్మార్ నుంచి పారిపోయి వచ్చి హైదరాబాద్‌లో సుమారు 500కుపైగా కుటుంబాలు తలదాచుకుంటున్నాయి. పదేళ్ల క్రితం 50 కుటుంబాలు మాత్రమే వచ్చాయి. ఆ తరువాత వీరి సంఖ్య రోజు రోజుకు పెరిగిపోయింది. వీరంతా ప్రస్తుతం బార్కాస్, చాంద్రాయణగుట్ట, తలాబ్‌కట్ట ప్రాంతాలలో నివాసముంటూ చిన్నాచితక పనులు చేసుకుంటున్నారు. గతంలో ఈ కుటుంబాలకు చెందిన కొందరు యువకులు ఉగ్రకార్యకలాపాలలో పాలు పంచుకున్నట్లు దర్యాప్తులో తేలింది. తాజాగా అమెరికా, ఉక్రేయిన్ ఉగ్రవాదులు పట్టుబడడం, వాళ్లంతా మయన్మార్‌కు చెందిన యుకువలకు ఉగ్ర శిక్షణ ఇచినట్లు దర్యాప్తులో తేలింది. దీంతో హైదరాబాద్‌లో నివాసముంటున్న యమన్మార్‌కు చెందిన యుకులపై ఎన్ఐఎ తాజాగా దృష్టి సారించింది. ఈ ఘటన వెనుక మరింత పెద్ద అంతర్జాతీయ నెట్‌వర్క్ ఉండే అవకాశం ఉందని ఎన్ఐఎ అనుమానిస్తోంది. ఇప్పటికే మరికొంత మంది విదేశీయులు భారత్‌లోకి ప్రవేశించి ఉండొచ్చని భావిస్తూ వారి కదలికలను ట్రాక్ చేస్తున్నారు.దేశంలోకి వచ్చిన 14 మంది ఉగ్రవాదుల్లో ఏగుగురు మాత్రమే చిక్కారు. మిగతా ఏడుగురు ఎక్కడికి వెళ్లారనే విషయంపై ఆరా తీస్తున్నారు. హైదరాబాద్‌లో వీరు తలదాచుకున్నారా అనే అనుమానాలను దర్యాప్తు అధికారులు వ్యక్తపరుస్తున్నారు. పట్టుబడిన ఉగ్రవాదులు మయన్మార్‌లోని యువకులకు అత్యాధునికమైన డ్రోన్‌లతో పాటు పేలుడు పదార్థాలను కూడా అందించినట్లు తెలిపారు. ఈ కోణంపై ఎన్ఐఎ అధికారులు హైదరాబాద్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు.

## ఎన్నికలప్పుడే రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

సిఎం రేవంత్‌రెడ్డి రైతుఉత్సవంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాళ్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సిఎం రేవంత్‌రెడ్డి రైతులనుద్దేశించి మాట్లాడుతూ ఎద్దు ఏడ్చిన వ్యవసాయం.రైతు కన్నీరు పెడితే రాజ్యం బాగుపడదని నానుడినే తాను నమ్ముతానని రైతులు రాజు చేయటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట ఆర్థికపరిస్థితి అంతంత మాత్రమే ఉన్న.. ఆర్థికలోటు ఉన్న రైతుసంక్షేమాన్ని విస్మరించలేదన్నారు. రైతు పండించిన చివరి కొనుగోలు చేయటంతో పాటు..ధాన్యానికి గిట్టుబాటుధరతో పాటు 500 బోనస్ చెల్లించినట్లు తెలిపారు. రైతు భరోసా కింద 70 లక్షల రైతులకు మొదటి విడుతగా 3600 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. మిగతావి సైతం రెండు విడుతల్లో 45రోజుల్లో 9వేల కోట్లు అర్హులైన అన్నదాతలందరికి రైతుభరోసా చెల్లిస్తామని సిఎం స్పష్టం చేశారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కెసిఆర్ 114 నెలల్లో నెలకు రైతుసంక్షేమం కోసం 2533 కోట్లు వెచ్చించేవారని. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాన 28 నెలల్లో ప్రతి నెల 5500 కోట్లు వెచ్చిస్తుందన్నారు. కాంగ్రెస్ సర్కార్ లక్ష 30వేల కోట్లు రైతుసంక్షేమానికి వెచ్చించిందని,. తమది రైతు ప్రభుత్వమని.. రైతును రాజును చేయటమే లక్ష్యమన్నారు. మెదక్, నిజామాబాద్ జిల్లాలో సారవంతమైన భూములని అన్ని రకాల కమర్షియల్ పంటలు వరి, మొక్కజొన్న, చెరుకు, పసుపు పంటలు పండిస్తారన్నారు. గతంలో పండించిన పసుపు పంట అమ్ముకుంటే తులం బంగారం వచ్చేదని..ఇప్పుడు బంగారం 2లక్షలకు చేరిందని. పసుపుకు పంటకు గిట్టుబాటు కరువైందన్నారు. అలాగే ఖమ్మం, వరంగల్ ప్రాంతంలో పత్తి, మిర్చి పంట, వికరాబాద్‌లో నాణ్యమైన కందులను పండిస్తారన్నారు. రైతులు వరిపంటకు బదులుగా వాణిజ్య పంటలపై దృష్టి సారించాలని..పంట మార్పిడి చేపట్టాలని, ఇందుకు అవసరమగు ప్రణాళికను తయారు చేయాలని వ్యవసాయమంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు సూచించినట్లు చెప్పారు. పామాయిల్ పంటను రాష్ట వ్యాప్తంగా 3లక్షల ఎకరాల్లో సాగుచేస్తున్నారని.. 10లక్షల ఎకరాల వరకు విస్తరించిన ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. పామాయిల్ పంటను ప్రోత్సహించేలా రైతుల్లో చైతన్యం తేవాలన్నారు. వరి పంటను 50లక్షలకు మించి కొనుగోలు చేయమని కేంద్రం చేతులేత్తేసిందని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికి 71లక్షల క్వింటల్ల పంటను కొనుగోలు చేసినట్లు చెప్పారు. పామాయిల్ పంటను సాగుచేస్తే మొదటి నాలుగేళ్ల వరకు రైతుకు ఆదాయం వుండదని..నాలుగేళ్లవరకు కేంద్రంతో పాటు రాష్ట్రం సహాయం చేసి రైతులను ఆదుకుంటుందన్నారు. నర్మెట్టలోని పామాయిల్ ఫ్యాక్టరీని కొడంగల్‌లో నిర్మించాలని.. ఇందుకు అవసరగు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రైతుల మిల్లెట్స్, ఆర్గానిక్ పంటలను పండిస్తే వారికి ఆదాయం లభిస్తుందన్నారు. తెలంగాణ సారవంతమైన భూమి రైతులు వినూత్నంగా ఆలోచించి లాభాదాయక పంటలు పండించి బంగారు తెలంగాణగా మార్చాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉచిత బస్సు ప్రయాణానికి 9వేల కోట్లు వెచ్చించినట్లు తెలిపారు. మహిళ ఉచిత ప్రయాణంతో అమ్మవారింటికి, అమ్మవారు దర్శనాలకు వెళ్లి వస్తారన్నారు. 2034 వరకు కోటిమంది మహిళలకు కోటీశ్వరులగా తీర్చిదిద్దుతానన్నారు. ఆర్టీసి బస్సులకు, పెట్రోల్ బంక్‌లకు యజమానులుగా మార్చినట్లు తెలిపారు. సాంకేతిక విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎటిసి సెంటర్లలో శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రతి నెల 2వేలు స్టైఫండ్ ఇస్తానన్నారు. ఎటిసిలో శిక్షణ పొందిన వారికి ఉద్యోగం ఇప్పించే బాధ్యత తనదని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తనకు భేషజాలు లేవని అభివృద్ధి కొరకు ఎవ్వరి వద్దకైన వెళ్తానని.. ఎన్నికలప్పుడు మాత్రమే తాను రాజకీయాలు చేస్తానని స్పష్టం చేశారు. బిజెపి ఎంపిలు,కేంద్ర మంత్రులతో కలసి ప్రధాని మోదీని కలసి రాష్ట్రాభివృద్ధికి నిధులు తేస్తానని మరోసారి స్పష్టం చేశారు. ప్రజాసంక్షేమం, రైతు సంక్షేమం, అభివృద్ధి తన లక్ష్యమని సిఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుదర్శన్‌రెడ్డి, ఎంపిలు రఘునందన్ రావు, వేం నరేందర్‌రెడ్డి, ఎంఎల్‌సి మహేశ్‌కుమార్ గౌడ్, అయిల్ ఫామ్ చైర్మన్ రాఘువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## భారీ మార్పులు

(మొదటి పేజీ తరువాయి)

5శాతం టిడిఆర్ వినియోగించాల్సి ఉంటుంది. బిల్డింగ్ అనుమతి సమయంలో 50శాతం టిడిఆర్ సమర్పించాల్సి ఉంటుంది. నివాసయోగ్య పత్రం (ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ఓసి)కు ముందు మిగతా 50 శాతం టిడిఆర్ తప్పనిసరిగా సమర్పించాలని ప్రభుత్వం ఉత్తర్వులలో స్పష్టం చేసింది. 21 మీటర్లకు పైగా ఉన్న భవనాలను హైరైజ్‌గా గుర్తించింది. 750 నుంచి 2000 చదరపు మీటర్ల ప్లాట్లలో 18 నుంచి 21 మీటర్ల భవనాలకు టిడిఆర్ తప్పనిసరిగా చేసింది. నాన్ హైరైజ్ బిల్డింగ్స్‌కు టిడిఆర్ ద్వారా సెట్‌బ్యాక్ సడలింపులు చేసింది. హైరైజ్ భవనాల్లో 10 శాతం వరకు సెట్‌బ్యాక్ రిలాక్సేషన్‌కు అనుమతి ఇచ్చింది. 2000 చదరపు మీటర్లకు పైగా ప్లాట్లలో అదనపు అంతస్తులకు అవకాశం కల్పించింది.

**హై–రైజ్ భవనాల కొత్త నిర్వచనం..**

ప్రభుత్వం హైరైజ్ (గగనతల) భవనాల ఎత్తు పరిమితిని సవరించింది. ఇకపై 21 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న భవనాలను మాత్రమే హైరైజ్ భవనాలుగా పరిగణిస్తారు. అయితే భవనం ఎత్తును లెక్కించేటప్పుడు చిమ్నీలు, కూలింగ్ టవర్లు, వాటర్ ట్యాంకులు, లిఫ్ట్ మెషిన్ గదుల ఇతర నిర్మాణ ఫీచర్లను ఈ ఎత్తు లెక్కలోకి తీసుకోరు.

**టిడిఆర్ వినియోగంతో అదనపు ప్రయోజనాలు..**

టిడిఆర్ వినియోగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం పలు వెసులుబాట్లు కల్పించింది. 750 నుండి 2000 చదరపు మీటర్ల విస్తీర్ణం కలిగిన ప్లాట్లలో, 18 నుండి 21 మీటర్ల ఎత్తు వరకు నిర్మాణాలకు టిడిఆర్ ద్వారా అనుమతి లభిస్తుంది. హైరైజ్ భవనాలలో నిర్ణీత సెట్‌బ్యాక్‌లలో 10 శాతం వరకు మినహాయింపును టిడిఆర్ ద్వారా పొందవచ్చు. అయితే భవనం చుట్టూ కనీసం 7 మీటర్ల ఖాళీ స్థలం ఉండటం తప్పనిసరిగా ఉండాలి. రోడ్డు విస్తరణలో భూమి కోల్పోయిన సందర్భాల్లో, కనీస సెట్‌బ్యాక్‌లను పాటిస్తూ టిడిఆర్ ద్వారా సడలింపులు పొందవచ్చు. మాస్టర్ ప్లాన్ రోడ్‌లలో మార్పులు లేదా తొలగింపులు జరిగినప్పుడు, డెవలప్‌మెంట్ ఛా ర్జీలకు బదులుగా సమానమైన టిడిఆర్ బాండ్ల ను సమర్పించే వెసులుబాటు కల్పించారు.

**రోడ్డు వెడల్పును బట్టి అదనపు అంతస్తులు..**

* 2000 చదరపు మీటర్ల కంటే పెద్ద ప్లాట్లలో రోడ్డు వెడల్పు ఆధారంగా అదనపు అంతస్తుల నిర్మాణానికి అనుమతి ఇచ్చింది.
* 40అడుగుల రోడ్డు: 3అదనపు అంతస్తులు.
* 60అడుగుల రోడ్డు: 4అదనపు అంతస్తులు.
* 80అడుగుల రోడ్డు: 5అదనపు అంతస్తులు.
* ఇవన్ని టిడిఆర్ వినియోగం, ఫైర్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ నిబంధనలకు లోబడి ఉండాల్సి ఉంటుంది.

**టిడిఆర్ సమర్పణ నిష్పత్తి..**

* ఎత్తైన భవనాల నిర్మాణంలో టిడిఆర్ లోడింగ్ విధానాన్ని ప్రభుత్వం కచ్చితం చేసింది.
* 10 నుండి 20 అంతస్తుల వరకు : బిల్టప్ ఏరియాలో 3 శాతం టిడిఆర్ వినియోగించాలి.
* 20 అంతస్తుల పైన : బిల్టప్ ఏరియాలో 5 శాతం టిడిఆర్ వినియోగించాలి.
* మొత్తం టిడిఆర్ 50 శాతం నిర్మాణ అనుమతి సమయంలో, మిగిలిన 50 శాతం ఓసి పొందే ముందు సమర్పించాల్సి ఉంటుంది.

## చెప్పు చేతల్లో సిఇసి

(మొదటి పేజీ తరువాయి)

ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో 130మంది, రాజ్యసభలో 63మంది సభ్యులు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్‌ను తొలగించాలని కోరుతూ తీర్మానాన్ని కోరారు. నోటీసుల గురించి అడగ్గా వాటిపై చర్య కోసం ఎదురు చూస్తున్నామని తృణమూల్ కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు డెరెక్ ఓబ్రియన్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఈ నోటీసులను పరిగణనలోనికి తీసుకోనట్లయితే, కార్యనిర్వాహకవర్గానికి, సిఇసికి మధ్య ఉన్న అవగాహనపై ప్రశ్నలు లేవనెత్తుతామని ఓబ్రియన్ తెలియజేశారు. సమాన అవకాశాల కల్పనను 'ఎన్నికల ప్రజాస్వామ్యానికి గుండెకాయ, ఆత్మ' అని, రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగమని ఆ నోటీసులు పేర్కొన్నాయి. నిరూపితమైన దుష్ప్రవర్తన ఆరోపణలలో ప్రధాన ఎన్నికల కమిషనర్ ''స్వతంత్రతను, రాజ్యాంగ విశ్వసనీయతను కాపాడటంలో విఫలమయ్యారు' అని కార్యనిర్వాహక వర్గం అదుపులో పనిచేస్తున్నారని ప్రతిపక్షం ఆరోపించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా జ్ఞానేష్ కుమార్ నియామక ప్రక్రియ 2025 ఆగస్టు 17న రాహుల్‌గాంధీని లక్ష్యంగా చేసుకుని ఆయన నిర్వహించిన 'పక్షపాత పత్రికా సమావేశం' ప్రతిపక్ష, అధికార పార్టీ సభ్యుల పట్ల వివక్షపూరిత వైఖరి దర్యాప్తులకు అడ్డంకులు, పారదర్శక సాధనాలను అందించడానికి నిరాకరించడం, అధికార పార్టీ రాజకీయ లక్ష్యాలకు అనుగుణంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కసరత్తును అమలు చేయడం వంటివి ప్రతిపక్షాల ఆరోపణలలో ఉన్నాయి. ఎస్ఐఆర్ సంబంధిత పౌరసత్వ ధృవీకరణ అంశంపై అంటే ఓటరు ద్వారా ఓటర్ల పౌరసత్వ స్థితిని నిర్ధారించడంపై భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) వైఖరి సవరణ భారతదేశం అంతటా జాతీయ పౌర పట్టికను (ఎన్ఆర్‌సి) ప్రక్రియను నిర్వహించాలన్న కేంద్ర హోం మంత్రి అధికార వైఖరికి పూర్తి అనుగుణంగా ఉంది. సిఇసి, ఇసిఐని ఒక కొత్త ఎన్నికల సంస్థ నుంచి కార్యనిర్వాహక వర్గం రాజకీయాలను అమలు చేసే సాధనంగా సమర్థవంతంగా మార్చేశారని, నిష్పక్షపాతంగా ఎన్నికలలు నిర్వహించే సంస్థ అయిన దానిని పౌరసత్వ నిర్ధారణ ట్రిబ్యునల్‌గా కూడా మార్చేశారని ప్రతిపక్షం ఆరోపించింది. గత సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు బిహార్‌లో ప్రకటించిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సమాజంలోని అత్యంత బలహీనవర్గాలను క్రమపద్ధతిలో ఓటు హక్కు కోల్పోయేలా చేసే మినహాయింపు పత్రాల అవసరాలను విధించిందని కూడా ఆరోపించింది.రాష్ట్ర ఓటర్లలో గణనీయమైన భాగాన్ని సూచించే 'దిగ్భ్రాంతికర సంఖ్య' అయిన 65లక్షల ఓటర్లను మినహాయించడం గురించి ప్రతిపక్షం ప్రస్తావిస్తూ, అసెంబ్లీ ఎన్నికలలో ఎన్‌డిఏ విజయంలో ఈ ప్రక్రియ నిర్ణయాత్మక పాత్ర పోషించి ప్రతిపక్షం తుడిచిపెట్టుకుపోయిందని పేర్కొంది. బిహార్ నమూనాను ఇతర రాష్ట్రాల మాదిరిగానే అనుకరించారని ఆ నోటీసులు పేర్కొన్నాయి. పశ్చిమబెంగాల్‌లో, ముసాయిదా ఓటర్ల జాబితాలో కోటిమంది ఓటర్లనుండి 58లక్షల పేర్లను తొలగించినట్లు వెల్లడైంది. కాగా 60లక్షల మందికి పైగా ఓటర్లు 'అడ్జుడికేషన్ కేటగిరీ' లోనే ఉన్నారు. దీంతో అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేవలం కొన్నివారాల ముందు వారి ఓటింగ్ స్థితి అనిశ్చితంగా మారింది. ఉభయ సభలలో తీర్మానం ఆమోదం పొందితే లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ సభ్యులు సంయుక్తంగా ఒక కమిటీని ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తి, 25 హైకోర్టులలో ఒకదాని ప్రధాన న్యాయమూర్తి, ఒక విశిష్ట న్యాయ కోవిదుడు సభ్యులుగా ఉంటారు. కమిటీ విచారణలు కూడా ఏదేని కోర్టు విచారణలాగే ఉంటాయి. సాక్షులను, నిందితులను క్రాస్‌ఎగ్జామినేషన్ చేస్తారు.

# దేశ అభివృద్ధిలో ఆర్య వైశ్యులు భాగస్వాములు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశ అభివృద్ధిలో ఆర్య వైశ్యులు భాగస్వాములని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. అవకాశాలు వచ్చినా, రాకపోయినా వారు క్రమశిక్షణను ఉల్లంఘించకుండా ఓపికతో ఉంటారన్నారు. ఆర్య వైశ్యులకు సముచితమైన స్థానం కల్పిస్తామన్నారు. 'తెలంగాణ ఆర్య వైశ్య కార్పొరేషన్' ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఎల్.బి స్టేడియంలో ఆదివారం జరిగిన 'శ్రీ వాసవి మహాశక్తి మహోత్సవ' కార్యక్రమం సిఎం రేవంత్ రెడ్డితో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి టిజి. భరత్, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వసుజాత, ఆర్య వైశ్య ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఆర్య వైశ్య లు ఊరికి ఒక్కరు ఉన్నప్పటికీ ఆధిపత్యం చూపిస్తుంటారని, తెలంగాణ రాష్ట్ర పునర్ నిర్మాణంలో ఆర్య వైశ్యలది కీలక పాత్ర అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో ఆర్య వైశ్యులు భాగస్వాములన్నారు. ఆర్య వైశ్యులకు 6 మున్సిపల్ చైర్మన్ పదవులతోపాటు ఒక మేయర్ పదవిని ఇచ్చి వారికి రాజకీయ ప్రాధాన్య తను కల్పించామని సిఎం తెలిపారు. రాచరికం లో అధికారం మారాలంటే హింస తప్పనిసరిగా ఉండేదని, కానీ మహాత్మాగాంధీ ఒక్కరే అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చారని గుర్తు చేశారు. రవి హస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని అహింస, సహాయ నిరాకరణ, ఉప్పు సత్యాగ్రహంతో పారదోలిన గొప్ప తత్వవేత్త గాంధీ అని అన్నారు. మాజీ సిఎం రోశయ్య విగ్రహాన్ని లక్డీకాపూల్‌లో ఏర్పాటు చేసి, ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తున్నామన్నారు. తనకు ఇష్టమైన నాయకుడు రోశయ్య అని, ఆయనతో వాదించడం ,ప్రశ్నించడం గౌరవం గా ఉండేదని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఆర్య వైశ్యుల ఆలోచనలే ప్రభుత్వం విధానమని, ఆర్యవైశ్యుల గౌరవానికి భంగం కలగకుండా చూస్తామని సిఎం అన్నారు.

# మావోయిస్టు శంకర్‌కు తీవ్రఅనారోగ్యం

**ప్రజాపక్షం/హైదరాబాద్:**ఒడిశా రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లోని సెంట్రల్ జైలులో గత ఐదేళ్లుగా రిమాండ్ ఖైదీగా ఉన్న సిపిఐ (మావోయిస్టు) పార్టీ కేంద్ర మిలిటరీ కమిషన్ సభ్యుడు దుబాషి శంకర్ అలియాస్ మహేందర్ అలియాస్ రమేష్ ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్నాడు.

గత కొన్ని రోజులుగా జైలులోనే అతనికి కుడి కాలులో ఇన్ఫెక్షన్ తీవ్రంగా పెరిగింది. విశాఖపట్నం జిల్లా గొల్లపల్లి ప్రాంతంలో 2014లో జరిగిన ఎదురు కాల్పుల్లో కుడి కాలు గాయపడినప్పటి నుంచి అతడు నొప్పితో ఇబ్బందులు పడుతున్నాడు. ప్రస్తుతం ఆ గాయం మళ్లీ ఇన్ఫెక్షన్‌కు గురవడంతో పరిస్థితి మరింత విషమించింది. ఇప్పటికే రెండు రోజులుగా కుడి కాలులో ఇన్ఫెక్షన్ తీవ్రత పెరగడంతో భువనేశ్వర్ సెంట్రల్ జైలు అధికారులు వైద్య చికిత్సలు అందిస్తున్నారు. అయితే ప్రస్తుతం నడవలేని స్థితిలో ఉన్నట్లు సమాచారం. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంతకుముందు కూడా ఒకసారి అతడు తీవ్ర అనారోగ్యానికి గురికాగా జైలు అధికారులు చికిత్సలు అందించారు. దుబాషి శంకర్‌పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో కలిపి 100కు పైగా కేసులు నమోదయ్యాయి. అలిపిరి, ఉమేష్ చంద్ర, వ్యాస్ హత్య కేసుల్లో కీలక నిందితుడిగా ఉన్నాడు. తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం చెట్ల నర్సంపల్లి గ్రామానికి చెందిన దుబాషి శంకర్ గత 45 ఏళ్లుగా విప్లవ ఉద్యమంలో ఒడిస్సా ఎఒబిలో కొనసాగుతున్నాడు దుబాషి శంకర్ అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. 2018లో ఒరిస్సా రామడుగు లో జరిగిన ఎన్కౌంటర్‌లో దుబాషి శంకర్ సహచరి లత ఎన్కౌంటర్లో చనిపోయింది.

## సుదీర్ఘకాలం ప్రభుత్వాధినేతగా మోదీ రికార్డు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**భారత ప్రధాని నరేంద్ర మోదీ సుదీర్ఘ కాలం పాటు (8,931 రోజులు) ప్రభుత్వాధినేతగా (ముఖ్యమంత్రి, ప్రధానిగా) సేవలు అందించి చారిత్రాత్మక మైలురాయిని అధిగమించినందుకు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అభినందనలు తెలిపారు. గత 24 ఏళ్లుగా ఒక్క సెలవు కూడా తీసుకోకుండా దేశ సేవకే అంకితమైన మోదీ ప్రయాణం యువతకు ప్రేరణాదాయకమన్నారు. 'సబ్ కా సాథ్‌సబ్ కా వికాస్' మంత్రంతో జనధన్, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు.

## నేడు శాసనసభలో రెండు బిల్లులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**'తెలంగాణ విద్యా విధాన పరిషత్ బిల్లు– 2026, తెలంగాణ బిల్లు–2026 (రెగ్యులేషన్ ఆఫ్ అపాయింట్‌మెంట్స్ టు పబ్లిక్ సరీసెస్, రేషనలైజేషన్ ఆఫ్ స్టాఫ్ ప్యాట్రన్, పే స్ట్రక్షర్) బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జరిగే శాసన సభ బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టనుంది. సోమవారం ఉదయం 10గం.కు ప్రశ్నోత్తరాల సమయం, రెండు బిల్లులను ప్రవేశపెట్టడం, ఆ తర్వాత రాష్ట్ర ఆర్థిక బడ్జెట్ 2026–27పై చర్చ ప్రారంభం కానుంది.

# సోషల్ మీడియా స్వీయ నియంత్రణకు ఒక వ్యవస్థ అవసరం

## 'ది వైర్ న్యూస్ పోర్టల్' వ్యవస్థాపక సంపాదకుడు ఎంకె.వేణు సూచన




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సోషల్ మీడియా నియంత్రణ పేరుతో ప్రభుత్వాలు జోక్యం చేసుకోవడం పెద్ద ప్రమాదకరమని, ఈ ప్రమాదానికి ఆస్కారం ఇవ్వకూడదని, సోషల్ మీడియా స్వీయ నియంత్రణకు ఒక అసోసియేషన్ లాంటి వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని ప్రముఖ 'ది వైర్ న్యూస్ పోర్టల్' వ్యవస్థాపక సంపాదకు లు ఎం.కె.వేణు సూచించారు. సోషల్ మీడియా కు స్వీయ నియంత్రణ వ్యవస్థ అవసరమన్నారు. 'ఈ నెల 27–29 తేదీలలో' విజయవాడలో జరగనున్న ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) జాతీయ ప్లీనరీని పురస్కరించుకుని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యుజె), మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇండియా (మెఫి) సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్, బషీర్‌బాగ్ లోని దేశోద్ధార క భవన్‌లో ''సోషల్ మీడియా–మంచిచెడు'' అనే అంశం పైన ఆదివారం జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీనియర్ పాత్రికేయులు సోమశేఖర్ అధ్యక్షత వహించగా, వక్తగా ఎం.కె.వేణు, మెఫీ మేనేజింగ్ ట్రస్టీ, ఐజెయు మాజీ అధ్యక్షులు డి.అమర్ స్వాగతోపన్యాసం చేశారు. టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు, కె. విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె. రాం నారాయణ, ఐజెయు స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఎ. మాజీద్, జాతీయ కార్యదర్శి వై. నరేందర్ రెడ్డి, టియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శులు కె. శ్రీకాంత్ రెడ్డి, వి.యాదగిరి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని కిరణ్ కుమార్‌తో పాటు పాత్రికేయులు, సామాజిక కార్యకర్త లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం.కె. వేణు మాట్లాడుతూ ప్రస్తుత యుద్ధ వార్తలను సిఎన్ఎన్, బిబిసి, అల్ జజీరా కంటే వేగంగా ట్విట్టర్ హ్యాండిల్ ద్వారా అందుతున్నాయన్నారు. సోషల్ మీడియా రాక తో వేగం పెరిగిందని, వార్తను వెంటనే మరింత వేగంగా అందజేసేం దుకు అవకాశం లభించిందని, వార్తల శైలిలోనూ మార్పు వచ్చిందని వివరించారు. సోషల్ మీడియా డిస్ట్రిబ్యూషన్ ప్లాట్ ఫామ్‌గా ఉపయోగపడుతుందని, ఇంటర్‌నెట్ రాకతో మీడియా ప్రజాస్వామీకరణ జరిగి ఏకపక్ష ఆధిపత్యానికి తెరపడిందని తెలిపారు. నరేంద్రమోదీ ప్రధాని కాకముందు ప్రధానమంత్రుల కార్టూన్లు కనిపించేవని, ప్రస్తుతం దేశంలో అలాంటి పరిస్థితి లేదన్నారు. మీడియాలో ఏకఛత్రాధిపత్యం దిశగా జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో జర్నలిస్టుల పోరాటం కంటే, సమాజంలో వ్యక్తులు ఒకరితో ఒకరు చర్చించుకుంటే ఎక్కువ ఫలితం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. జర్నలిస్టులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ కొత్త స్కిల్స్‌ను నేర్చుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో ఒక జర్నలిస్ట్ ఒక దగ్గర కూర్చొని చేసిన స్టోరీ క్షణాల్లో ప్రపంచం మొత్తం వెళ్తుందని, ఒకప్పుడు ఇంటింటికి తిరిగి న్యూస్ పేపర్స్ డిస్ట్రిబ్యూట్ చేసేవాళ్ళని, ఇప్పుడు ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ లాంటివి డిస్ట్రిబ్యూటర్స్‌గా ఉన్నాయని వివరించారు. యుపి ఎన్నికల్లో సోషల్ మీడియా ద్వారా బిజెపి ప్రతి వ్యక్తికీ దగ్గరయిందన్నారు. టెక్నాలజీ ఎలా వినియోగించుకోవాలనే అంశం తెలుసుకోవాల్సిన అవసరం యువతకు ఉన్నదని, సరైన విధానంలో తెలుసుకోకపోతే ఇబ్బందులు తలెత్తె ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్ట్ సోమశేఖర్ మాట్లాడు తూ నేటి ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రధాని మన్ కి బాత్ పేరుతో సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారని చెప్పారు. సోషల్ మీడియా వచ్చిన తర్వాత ఎవరికీ వాళ్ళు తమకు నచ్చిన విషయాలు రాస్తున్నారని, మాట్లాడుతున్నారని తెలిపారు.

# చెరువుల ప్రక్షాళనలో పౌరుల భాగస్వామ్యం





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** '99 రోజుల కార్యాచరణ ప్రజా పాలన'లో భాగంగా మల్కాజిగిరి నగరపాలక సంస్థ పరిధిలో ని 33 చెరువులు, కుంటలను శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు. కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బందితో పాటు సుమా రు 300 మంది పౌరులు ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో భాగంగా చెరువుల గట్ల చుట్టూ ఉన్న సుమారు 44 మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించారు. పౌరుల భాగస్వామ్యంతోనే నగరాభివృద్ధి సాధ్యమని ఎంఎంసి అదనపు కమిషనర్ సి.ఎన్.రఘుప్రసాద్ అన్నారు.

# ఖద్దరు గుప్పెట్లో.. ఖమ్మం కార్పొరేషన్!

- ✻ అనేక విషయల్లో వేలుపెడుతున్న ఛోటా నేతలు
- ✻ అభివృద్ధి పనుల్లో పెరిగిన జోక్యం ✻ టెండర్లు ఒకరివి చేసేది మరొకరు
- ✻ లోపిస్తున్న నాణ్యత..నోరెత్తని అధికారులు




**ప్రజాపక్షం/ఖమ్మం టౌన్ :** ఖమ్మం కార్పొరేషన్‌లో ఇటీవలకాలంలో అనధికారుల జోక్యం ఎక్కువైపోయింది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రస్తుతం కార్పొరేషన్ అవినీతి గుప్పెట్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది. కంటికి కనిపించని పెత్తనాలు రాజ్యమేలుతున్నాయి. ప్రజాప్రతినిధుల అనుచరులమంటు కొందరు అనేక విషయాల్లో లక్ష్మణరేఖను దాటేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నా టెండర్లు అర్హత కలిగిన కాంట్రాక్టర్ల చేత వేయించి తర్వాత ఆ పనులను ముక్కలు ముక్కలుగా విడగొట్టి క్షేత్రస్థాయిలో అధికార పార్టీ కార్యకర్తలకు కట్టబెడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పనుల్లో నాణ్యత లోపాలు ఉంటున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. మొక్కలు నాటడం, ఎండ్ టూ ఎండ్ రోడ్లు వేయడం, రోడ్ల ప్యాచ్ వర్క్ ఇలాటివన్నీ లోతుగా పరిశీలిస్తే అందులోని లోపాలు, పాపాలు బయటపడే అవకాశాలు ఉన్నాయి. అయితే క్వాలిటి కంట్రోల్, విజిలెన్స్ లాంటి నిఘావిభాగాలు నిద్రపోతూ పెద్ద తలల నియోజకవర్గాలంటు భావించి క్షేత్రస్థాయి పరిశీలన జోలికి వెళ్లడంలేదు. ఎండ్ టు ఎండ్ రోడ్ల విషయానికి వస్తే రోడ్ల చివర బాగా ఉన్న రోడ్లను కూడా కొంతమేర యంత్రాలతో కట్‌చేసి ఆ సిసి శిధిలాలను తొలగించి తిరిగి అక్కడ ఎండ్ టు ఎండ్ రోడ్లు వేస్తున్నారు. ఈ అభివృద్ధి పనుల అంచనాలు కూడా అధికంగా ఉంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వాల్లో మున్సిపల్ కాంట్రాక్టర్లు అంటు ప్రైవేటు విభాగం ఉండేది. వారే అభివృద్ధి పనుల టెండర్లు దక్కించుకుంటు క్షేత్రస్థాయిలో ఆ పనులు చేసి సీనియారిటీ క్రమంలో బిల్లులు తీసుకునేవారు. ఇటీవల కాలంలో నేతలే బడాకాంట్రాక్టర్లతో మాట్లాడి వారి పేరుపైన టెండర్లు వేయించి ఆ టెండర్లు పొంది వచ్చిన పనులను తమ అనుచర గణాలకు పంచిపెడుతున్నారు. దీంతో గతంలో ఉన్న ప్రయివేటు కాంట్రాక్టు వ్యవస్థ రోజురోజుకు వెనుకబడిపోయింది. ఒక వేళ కాంట్రాక్టర్లు ముందుకొచ్చి పనులు చేయాలని భావించి టెండర్లు వేసినా క్షేత్రస్థాయిలో పనులు చేయడం సాధ్యం కావడంలేదు. అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి.

పనులు పూర్తయినా బిల్లులు రావడం చాలా కష్టతరంగా మారింది. అందుకే కార్పొరేషన్‌లో అనేక అభివృద్ధి పనులకు మేయర్‌లచేత ర్యాటిఫికేషన్ ఆర్డర్లు వేయించి విచ్చలవిడిగా జనరల్ ఫండ్స్ నిధులను కేటాయింపచేసుకుంటున్నారు. తెరవెనుక నేతలు సిఫారసుచేసిన వారికే బిల్లులు, లేనివారికి చిల్లులు అన్నచందంగా ఈ అభివృద్ధి వ్యవస్థ మారిపోయింది. ఒక వైపు అవినీతి అక్రమాలు జరిగితే చూస్తు ఊరుకోం అంటు ప్రకటనలు గుప్పిస్తున్న ఆ ప్రకటనలకు క్షేత్రస్థాయిలో జరిగే వ్యవహారాలకు అసలు సంబంధం ఉండడం లేదు. ఇక సిటీ ప్లానింగ్ విషయానికొస్తే ఈ వ్యవస్థపై ఒత్తిళ్లు రోజురోజుకు ఎక్కువవుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సిటీప్లానింగ్ కొందరు నేతలు తమ జేబుసంస్థగా మార్చుకున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. దీంతో సిటీ ప్లానింగ్ అధికారుల పనితీరు ముందు నుయ్యి, వెనుక గొయి అన్న చందంగా మారింది. ప్రజల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధు లు కార్పొరేటర్లు క్షేత్రస్థాయిలో పెత్తనాలకు రాకపోయినా సంబంధిత కార్పోరేటర్ల బంధువుల పెత్తనాలు క్షేత్రస్థాయి లో ఎక్కువై పోయాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా మంత్రి ప్రాతినిధ్యం వహించే ఖమ్మం నియోజకవర్గంలోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. ఇక ఏళ్ల తరబడి స్థానచలనాలు లేకుండానే ఆయా విభాగాలో పేరుకుపోయిన కొందరు ఉద్యోగులు తమకున్న రాజకీయ నేతల అండదండలతో ఆయా సీట్లలో పెత్తనాలు చలాయిస్తున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఇలా ప్రతి విభాగాన్ని పరీక్షించి చూస్తే ఖమ్మం కార్పొరేషన్‌లో ప్రతి విభాగంలో తెరవెనుక రాజకీయ జోక్యం రోజురోజుకు పెరిగిపోతుంది. దీనిని అరికట్టాల్సిన ఉన్నతస్థాయి ప్రజాప్రతినిధులు ఇంతవరకు ఆ దిశగా ఆలోచించి సరైన కఠిన నిర్ణయాలు తీసుకోవడంలేదన్న భావన నగర ప్రజల్లో వ్యక్తమవుతోంది.

# రైతు భరోసా నిధులు విడుదల




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతు భరోసా నిధుల కోసం ఎప్పు డెప్పుడని ఎదురు చూస్తున్న రైతుల ముఖాల్లో ఆనందం వెల్లువిరిసింది.ఆదివారం సిద్దిపేట జిల్లా నర్మేట్ట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవ వేదిక నుంచి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తన చేతుల మీదగా రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశారు. రైతు భరోసా కోసం రూ.9 వేల కోట్లను కేటాయించిన ప్రభుత్వంఈ నిధులను మూడు విడుతలుగా రైతు ఖాతాల్లో జమ చేయనుంది. ఇందులో భాగంగా మొదటి విడుతగా1 ఎకరం వరకు ఉన్న 68, 89, 955 రైతులకు సంబంధించి 57, 44,907.19 ఎకరాలకుగాను మొత్తం రూ.34,46, 94,45,249లను సిఎం రేవంతరెడ్డి రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమచేశారు. రెండవ విడుతగా రెండు ఎకరాలకు వరకు ఉన్న రైతుల ఖాతాల్లో మరో 20 రోజుల్లో జమాచేయనున్న ప్రభుత్వం ఏప్రిల్ చివరి నాటికి అర్హులైన రైతులందరి ఖాతాలో రైతు భరోసా నిధులు పడనున్నాయి.

**జిల్లాల వారీగా మొదటి విడుత రైతు భరోసా – యాసంగి 2025–26 నిధులు**

| జిల్లా పేరు | రైతుల సంఖ్య | మొత్తం (రూ.) |
|---|---|---|
| ఆదిలాబాద్ | 1,59,655 | 92,76,74,979 |
| కుమురంభీమ్ ఆసిఫాబాద్ | 1,32,854 | 74,05,91,844 |
| మంచిర్యాల | 1,52,001 | 76,91,78,355 |
| నిర్మల్ | 1,86,817 | 99,32,88,462 |
| నిజామాబాద్ | 2,69,476 | 1,34,95,15,004 |
| కామారెడ్డి | 3,00,294 | 39,42,03,740 |
| కరీంనగర్ | 1,88,818 | 90,42,73,809 |
| పెద్దపల్లి | 1,50,049 | 72,45,61,430 |
| జగిత్యాల | 2,24,305 | 1,04,94,63,532 |
| రాజన్న సిరిసిల్ల | 1,25,855 | 62,38,48,243 |
| మెదక్ | 2,60,818 | 1,10,44,83,608 |
| సంగారెడ్డి | 3,53,351 | 1,67,80,87,158 |
| సిద్ధిపేట | 3,18,877 | 1,53,44,32,836 |
| వరంగల్ | 1,55,170 | 75,95,46,280 |
| హన్మకొండ | 1,43,394 | 70,05,61,045 |
| మహబూబాబాద్ | 2,11,287 | 1,08,38,93,098 |
| ములుగు | 79,040 | 40,98,59,892 |
| జయశంకర్ భూపాలపల్లి | 1,15,177 | 59,35,19,448 |
| జనగాం | 1,80,186 | 92,11,17,163 |
| ఖమ్మం | 3,35,377 | 1,69,51,40,594 |
| భద్రాద్రి కొత్తగూడెం | 1,77,201 | 98,75,18,195 |
| రంగారెడ్డి | 2,89,448 | 1,37,11,08,146 |
| వికారాబాద్ | 2,72,871 | 1,40,32,09,054 |
| మెడ్చల్‌మల్కాజిగిరి | 24,935 | 10,43,50,423 |
| మహబూబ్‌నగర్ | 2,15,923 | 1,04,77,74,728 |
| నారాయణపేట్ | 1,77,425 | 93,71,46,917 |
| నాగర్‌కర్నూల్ | 3,01,828 | 1,57,95,16,058 |
| వనపర్తి | 1,77,987 | 86,31,56,223 |
| జోగులాంబ గద్వాల్ | 1,68,142 | 91,45,37,186 |
| నల్గొండ | 5,22,313 | 2,68,57,20,042 |
| సూర్యాపేట్ | 2,84,332 | 1,45,23,28,895 |
| యాదాద్రి భువనగిరి | 2,34,749 | 1,16,58,38,862 |
| **మొత్తం రైతుల సంఖ్య:** | **68,89,955** | **34,46,94,45,249** |

# భగత్ సింగ్ వర్ధంతిని సామ్రాజ్యవాద వ్యతిరేక దినోత్సవంగా నిర్వహించాలి

### సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ భగత్ సింగ్ వర్ధంతిని సోమవారం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో సామ్రాజ్యవాద వ్యతిరేక దినోత్సవంగా నిర్వహించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సర్దార్ భగత్ సింగ్ బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి తన ప్రాణాలను సైతం తృణప్రాయంగా అర్పించిన ఆ మహనీయుని స్ఫూర్తితో నేడు దేశవ్యాప్తంగా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని, ఇందుకు అందరూ కూడా కలిసి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రపంచ వ్యాప్తంగా అమెరికన్ సామ్రాజ్యవాదం ప్రత్యేకించి డోనాల్డ్ ట్రంప్ రెండవసారి అధికారులకు వచ్చిన తర్వాత ఆయన ప్రపంచాన్ని బెదిరిస్తూ , వెనుజులా దేశం పై దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడిని ఆయన భార్యను నిర్బంధించడమే కాకుండ గత 24 రోజులుగా అమెరికా ఇజ్రాయిల్ దేశాలు పెద్ద ఎత్తున యుద్ధాన్ని ప్రారంభించిందన్నారు. ఈ యుద్ధాన్ని అమెరికన్ పౌరుల్లో 62శాతం మంది వ్యతిరేకిస్తున్నారని, అయినా సరే ట్రంప్ యుద్ధాన్ని కొనసాగిస్తు ప్రపంచాన్ని భయపెట్టాలని చూస్తున్నారన్నారు. మరోవైపు క్యూబాను ఆర్థికంగా దిగ్బంధనం చేసి, వారికి డీజిల్ ,విద్యుత్తుతో పాటు వారికి సరైన ఆహారం లేకుండా చివరకు మందులు కూడా దొరకని పరిస్థితి కల్పించారని రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో క్యూబా తమ దేశ డాక్టర్లను ప్రపంచ దేశాలకు పంపించి వైద్య సేవలు అందించిన నేడు అలాంటి దేశంలో కూడా మందులు కూడా లేకుండా ప్రజలు ఆందోళన చెందే పరిస్థితిని కల్పించారని విమర్శించారు. ఇటీవల ప్రపంచంలో ఏనాడు లేని విధంగా ఉద్రిక్తతలు పెంచి, పోషిస్తూ అమెరికన్ సామ్రాజ్యవాదం నిసిగ్గుగా దేశాలపై దాడులు చేస్తున్నారన్నారు. ఇన్ని దాడులు దుర్మార్గాలు జరుగుతూ ఉంటే మన దేశ ప్రధాని నరేంద్ర మోదీ, భారత ప్రభుత్వం కనీసం ఈ దాడులను మానవత్వంగానైనా ఖండించలేని దిక్కుతోచని స్థితిలో ఉందంటే ఇంతకంటే సిగ్గుచేటున విషయం మరొకటి లేదన్నారు. అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాపితంగా ప్రజలంతా కుడా పోరాడుతున్న తరుణంలో మార్చి 23వ తేదీన దేశవ్యాప్తంగా పార్టీ శ్రేణులన్నీ నిరసన తెలుపాలని, సభలు సమావేశాల ద్వారా నిరసన తీర్మానాలు చేయాలని రామకృష్ణ కోరారు.

# యుద్ధంతో ఆర్థిక సంక్షోభం

### 29న హైదరాబాద్‌లో 'నో వార్' ప్రదర్శన

### తిరుమలకు అపకీర్తి తెచ్చిన వ్యక్తి పదవిలో కొనసాగడం తగదు: నారాయణ

**విశాలాంధ్ర బ్యూరోఅమరావతి:** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేపడుతున్న యుద్ధం దేశవ్యాప్తంగా మానవాళిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని, ఈ యుద్ధం ద్వారా అమెరికాలోని కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూరుతున్నాయని సిపిఐ జాతీయ నాయకుడు డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఈ యుద్ధం కారణంగా భయానకమైన మరణాలు సంభవిస్తున్నప్పటికీ, దాన్ని నివారించాలంటూ అమెరికాపై ఒత్తిడి తీసుకురావడంలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ వైఖరి ప్రశ్నార్థకరంగా ఉందన్నారు. విజయవాడలోని దాసరి భవన్‌లో ఆదివారం మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ... యుద్ధం ప్రధానంగా చమురు వనరులపై ఆధిపత్యం సాధించడానికి, కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చడానికి ట్రంప్ చేపడుతున్న చర్యగా అభివర్ణించారు. యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభ పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఇప్పటికే భారత్‌లో పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగిన విషయాన్ని గుర్తుచేశారు. గ్యాస్ కొరత ఏర్పడి హోటళ్లు, రెస్టారెంట్లు, హాస్టళ్లు మూతపడిన సందర్భాలు ఉన్నాయని, దీని ప్రభావం నేరుగా కార్మిక, శ్రామిక వర్గంపై పడుతోందన్నారు. ప్రపంచంలో అత్యధిక ప్రజాస్వామ్య దేశంగా గుర్తింపు పొందిన భారత్ ప్రధాని మోదీ... డోనాల్డ్ ట్రంప్ వైఖరిపై మౌనం పాటించడం సమంజసం కాదన్నారు. ఈ యుద్ధ అంశంపై మోదీపై ఒత్తిడి తేగల నాయకుడు...కేంద్ర ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు మాత్రమేనని ఆయన అభిప్రాయపడ్డారు. అమెరికా యుద్ధోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ, ఈ నెల 29న హైదరాబాద్‌లో 'నో వార్' (యుద్ధ వ్యతిరేక) పేరుతో అన్ని రాజకీయ పార్టీలతో కలిసి భారీ శాంతి ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలంతా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. టిటిడి వంటి పవిత్ర క్షేత్రానికి అపకీర్తి తెచ్చే ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని చైర్మన్ పదవిలో కొనసాగించడం చంద్రబాబుకు తగదని అభిప్రాయపడ్డారు. ఆ పదవిలో ఉన్న వ్యక్తి కూడా ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూట మి నేతలు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ పేదలకు మూడు సెంట్లు, పట్టణ పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వడంతో పాటు గృహ నిర్మాణానికి రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ నెల 24న పార్టీ రాష్ట్ర సమితి పిలుపునిచ్చిన ఆందోళనల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచినా, ఇచ్చిన హామీల అమలులో పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. టిడ్కో ఇళ్లను పూర్తిచేసి వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని, అద్దె ఇళ్లలో నివసిస్తున్న పేదలకు అద్దెను ప్రభుత్వం భరించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు దోనేపూడి శంకర్ పాల్గొన్నారు.

# ప్రభుత్వం చెల్లించిన అప్పులు రూ.1,67,742 కోట్లు మాత్రమే




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎఫ్‌ఆర్‌బిఎం రుణాల కింద రాష్ట్ర ప్రభుత్వం సుమా రు గడిచిన 24 నెలలుగా ప్రిన్సిపల్, వడ్డీ కలిపి మొత్తం రూ. 1,67,742 కోట్లు మాత్రమే చెల్లించిందని బిఆర్ఎస్ ఎంఎల్‌సి దాసోజు శ్రవణ్ తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్లు, ప్రత్యేక ప్రయోజన వాహనాలు (ఎస్‌పివి) తమ స్వంత ఆదాయాలతో చెల్లించిన అప్పులు రూ.1,02,744 కోట్లు అని, అలాగే కార్పొరేషన్లు స్వయంగా చెల్లించిన నాన్ గ్యారంటీ రుణాలు రూ. 33,717కోట్లు అని, ఈ రుణాలతో రాష్ట్ర ప్రభుత్వానికి ఎటువంటి ప్రత్యక్ష బాధ్యత లేకపోయినప్పటికీ, వాటినీ తమ ప్రభుత్వమే చెల్లించినట్లు సిఎం రేవంత్ రెడ్డి చూపిస్తున్నారని మండిపడ్డారు. సిఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా తన ప్రభుత్వం రూ. 3,30,570 కోట్లు అప్పులు తీర్చిందని ప్రకటించడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనని అన్నారు. ఆర్థిక శాఖ నివేదిక ప్రకారం డిసెంబర్ 1వ తేదీ, 2023 నుండి 31 డిసెంబర్ 2025 వరకు ప్రభుత్వ అప్పుల చెల్లింపులను నాలుగు విభాగాలుగా చూపించారని, ఇందులో ఎఫ్‌ఆర్‌బిఎం ప్రిన్సిపల్ రూ. 40,660 కోట్లు, వడ్డీ రూ.56,350 కోట్లు కలిపి మొత్తం రూ.97,010 కోట్లు మాత్రమే ప్రభుత్వం చెల్లించిందని వివరించారు. ప్రభుత్వ గ్యారంటీతో ఎస్‌పివి తీసుకున్న, ప్రభుత్వం సర్వీస్ చేసిన రుణాలు లోన్స్ ఇందులో ప్రిన్సిపల్ రూ.47,043 కోట్లు, వడ్డీ రూ. 23,689కోట్లు కలిపి మొత్తం రూ.70,732 కోట్లు ప్రభుత్వం చెల్లించిందన్నారు.

# నీటి చుక్క వృథా తగదు

ఐఈఐ ప్రెసిడెంట్ మనీష్ మహేంద్ర కొఠారి

ఎస్కీలో ఘనంగా ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'నీటిని వృధా చేయ వద్దు.. ప్రతి నీటి చుక్కను ప్రాణ సమానంగా చూడాలి' అని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా (ఐఈఐ) ప్రెసిడెంట్ మనీష్ మహేంద్ర కొఠారి అన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఎస్కీ)లో నిర్వహించిన 'ప్రపంచ నీటి దినోత్సవ' వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టి లోని సకల జీవరాశులకు నీరు ఆధారమని, నీరు లేని ప్రపంచాన్ని ఊహించలేమన్నారు. నీటి సంరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే సందర్భంలో ఎస్కీలో నిర్వహిస్తున్న ఎలక్ట్రికల్ వెహికల్ బ్యాటరీ ఇంజనీరింగ్ కోర్సులకు మంచి భవిష్యత్తు ఉందని, త్వరలోనే జియో స్పెషియల్ కోర్సులను కూడా ప్రవేశపెడతామని తెలిపారు.

**2030 లక్ష్యం – సుస్థిరాభివృద్ధి : రామేశ్వర్ రావు**

ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు మాట్లాడుతూ 2030 నాటికి అందరికీ సురక్షితమైన తాగునీరు, పారిశుద్ధ్యం అందించడమే లక్ష్యంగా (ఎస్‌డిజి 6) పని చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన జల్ జీవన్ మిషన్, అమృత్ వంటి ప్రాజెక్టులపై వివిధ రాష్ట్రాల అభ్యర్థులకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. 'వాక్ ఫర్ వాటర్' ఫౌండేషన్ ప్రతినిధి ఎం. కరుణాకర్ రెడ్డి ఆసక్తికర అంశాలను పంచుకున్నారు. భూమిపై ఉన్న నీటిలో 97 శాతం సముద్రపు ఉప్పు నీరే అని తెలిపారు. మిగిలిన 3 శాతంలో మెజారిటీ భాగం మంచు పర్వతాల్లో ఉందన్నారు. మనకు అందుబాటులో ఉన్నది కేవలం 0.3 శాతం నీరు మాత్రమేనని చెప్పారు. 2026 సంవత్సరానికి ఐక్యరాజ్య సమితి 'నీరు, జెండర్' అనే అంశాన్ని ఎంపిక చేసిందని, నీటి నిర్వహణలో మహిళల పాత్ర కీలకమన్నారు. రాజస్థాన్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో కమ్యూనిటీ మూమెంట్ ద్వారా ఎండిపోయిన నదులను పునరుజ్జీవింపజేసిన ఉదాహరణలను ఆయన వివరించారు.

**పెరుగుతున్న ముప్పు :** నీటి నిపుణులు డాక్టర్ దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలో 25 శాతం మంది తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారని, జనాభా పెరుగుదల, వాతావరణ మార్పుల వల్ల భవిష్యత్తులో ఈ సమస్య మరింత జటిలం కానుందని హెచ్చరించారు. వాన నీటిని ఒడిసి పట్టడమే దీనికి ఏకైక మార్గమని సూచించారు. ఎన్విరాన్‌మెంట్ హెడ్ అనితా అగర్వాల్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేయగా, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సీనియర్ ఇంజనీర్లను డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ఐఈఐ మాజీ ప్రెసిడెంట్ వి.బి. సింగ్, దేవేంద్ర గిల్, సంతోష్ కుమార్, రఘుపతి భీమ్ రావ్, డాక్టర్ రమణా నాయక్ బానోత్, సూర్యప్రకాష్, డాక్టర్ సీరం సత్యనారాయణ పాల్గొన్నారు.

# ప్రజల ప్రాణాలతో చెలగాటం!

మళ్లీ వాడకంలోకి పాత పురానాపూల్ వంతెన



**ప్రజాపక్షం/పురానాపూల్ :** ప్రేమకు చిహ్నంగా.. చారిత్రక కట్టడంగా పేరొందిన పాత పురానాపూల్ వంతెన వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. శిథిలావస్థకు చేరుకున్న వంతెన స్థానంలో పక్కనే నూతన వంతెన నిర్మించిన అనంతరం పాత వంతెనను కేవలం కాలిబాటగా మార్చినా.. తాజాగా వాహనాలను అదే వంతెన నుంచి అనుమిస్తుండటం ఆందోళన కలిగించే అంశంగా మారింది. 1578లో ఇబ్రహీం కులీకుతుబ్ షా ఈ వంతెన నిర్మిచడం జరిగింది. ఇది కుతుబ్ షాహీ రాజవంశం కాలానికి చెందిన అత్యంత పురాతన వంతెనగా గుర్తింపు పొందింది. మూసీ నదిపై 22 కమానులతో నిర్మితమైన ఈ వంతెన.. పాత నగరాన్ని గోల్కొండ ఖిల్లాతో అనుసంధానించే ముఖ్య మార్గంగా పనిచేసింది. దాదాపు 448 సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ వంతెన.. కాలక్రమేణా జనాభా పెరుగుదలతో పాటు రవాణా భారం అధికమవడంతో ఇరుకుగా, బలహీనంగా మారింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం పక్కనే 100 అడుగుల వెడల్పుతో కొత్త వంతెనను నిర్మించి వాహనాల రాకపోకలను దానిపైకి మళ్లించింది. పాత వంతెనను తక్కువ బరువు ఉండే విధంగా కూరగాయల మార్కెట్ వినియోగానికి మాత్రమే పరిమితం చేశారు. అయితే, ఇటీవలి కాలంలో అధికారులు తీసుకున్న నిర్ణయం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. పాడైపోయిన పాత పురానాపూల్ వంతెనపై మళ్లీ వాహన రాకపోకలను అనుమతించడం ప్రజల్లో భయాందోళనలు రేకెత్తిస్తోంది. ఇంజనీర్లు ఇప్పటికే ఈ వంతెన దెబ్బతిన్న స్థితిలో ఉందని, భారీ వాహనాలను తట్టుకునే సామర్థ్యం తగ్గిందని హెచ్చరించారు. కొత్త వంతెనపై ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉందనే కారణంతో పాత వంతెనను తెరవడం ప్రజల ప్రాణాలతో ప్రమాదకరమైన ప్రయోగంగా మారింది. స్థానికులు కూడా ఈ వంతెనపై ప్రయాణం సురక్షితంకాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉంది. అవసరమైతే కొత్త వంతెనకు పక్కన మరో విస్తరణ వంతెనను నిర్మించవచ్చు. కానీ, బలహీనమైన చారిత్రక వంతెనపై వాహనాలను అనుమతించడం అసలు సమంజసం కాదు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే స్పందించి.. పాత పురానాపూల్ వంతెనపై వాహన రాకపోకలను నిలిపివేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.

## మరో డిప్యూటేషన్ వివాదం?

**ప్రజాపక్షం/సిటీబ్యూరో :** టీజీఎస్‌పీడీసీఎల్‌లో మరో డిప్యూటేషన్ వివాదం తెరపైకి వచ్చింది. ఏపీ విద్యుత్ సంస్థల నుంచి తెలంగాణ విద్యుత్ సంస్థలకు అక్రమ డిప్యూటేషన్ల దందా సాగుతుందన్న విమర్శలు ఊపందుకున్న నేపథ్యంలోనే మరో అధికారి విధుల్లో చేరేందుకు ఏర్పాట్లు జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఏపీ జెన్‌కోలో డిప్యూటీ ఏఈగా విధులు నిర్వహిస్తున్న అధికారి దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు డిప్యూటేషన్‌పై వస్తున్నట్లు సమాచారం. ఏపీకి చెందిన ఆయనకు మూడేండ్ల పాటు దక్షిణ డిస్కంలో డిప్యూటేషన్ కేటాయిస్తు ఈ నెల 20న ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయగా.. ప్రాథమికంగా మూడేండ్ల పాటు ఇంటర్ స్టేట్ డిప్యూటేషన్ అంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు తెలిసింది. ముందుగా మూడేండ్లు అవకాశం కల్పించారని, తర్వాత మళ్లీ పొడగించే అవకాశముందని తెలంగాణ ఇంజినీర్లు అనుమానిస్తున్నారు. ఈ వ్యవహారంతో ఇంజనీర్లు ఆందోళన బాటపట్టే అవకాశాలున్నట్లు సమాచారం.



## రాక్‌స్టార్ అనిరుద్ రికార్డ్

**ప్రజాపక్షం/బంజారాహిల్స్ :** రాక్‌స్టార్ అనిరుద్ రవిచందర్ గీతాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. కళ్లు చెదిరే స్టేజ్ డెకరేషన్, అత్యాధునిక లైటింగ్, విజువల్స్‌తో మాయాలోకాన్ని తలపించింది. ఇయర్స్ విత్ యూ టూర్‌లో భాగంగా నిర్వహించిన లైవ్ కాన్సర్ట్ నగర లైవ్ మ్యూజిక్ చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది. హైదరాబాద్‌లో అనిరుద్‌కు ఇది మొదటి కాన్సర్ట్ కావడంతో ఏకంగా ముప్పయి వేల మందికి పైగా అభిమానులు హాజరు కావడంతో రికార్డు స్థాయి ఈవెంట్‌గా నిలిచింది. బ్రాండ్ అవతార్ సంస్థ ఈవెంట్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది.

## ఎన్‌హెచ్‌ఎంల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి

రామ రాజేష్ ఖన్నా డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన గత ఆరు నెలల వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా డిమాండ్ చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో అగ్రభాగాన నిలుస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పోరు బాట పట్టారని, గత ఆరు నెలలుగా వేతనాలు అందక పోవడంతో ఇంటి అద్దె, కరెంటు బిల్లు, పిల్లల విద్య ఫీజులు, పాల బిల్లు, ఇఎమ్‌ఐలు, నిత్యవసర వస్తువులు కొనలేని దీనస్థితిలో ఉన్నారని, వారికి వచ్చే జీతాలు తక్కువ, ఆ జీతాలు కూడా నెల నెలకు ప్రభుత్వం చెల్లించకుంటే ఉద్యోగులు ఎలా బ్రతకాలి అని ప్రశ్నించారు. ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు ప్రభుత్వం చెల్లించాలని, కాంట్రాక్ట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను ఔట్‌సోర్సింగ్ లోకి మార్చారనీ, యధావిధిగా తిరిగి కాంట్రాక్ట్‌లోకి కొనసాగింపు చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని, పై సమస్యలు అన్ని మార్చి 28వ తేదీ లోపు పరిష్కరించాలని, లేకపోతే ఎఐటియుసి ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో మార్చి 29న ఇందిరా పార్క్ వద్ద జరిగే మహాధర్నాలో తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి ఉద్యోగులందరూ పాల్గొంటారని రాజేష్ ఖన్నా హెచ్చరించారు.

## ప్రతి మహిళ ఖాతాలో నెలకు రూ.2500 జమ చేయాలి

భారత కూటమి డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రణాళికలలో మహాలక్ష్మి పథకంలో భాగంగా తెలంగాణలోని ప్రతి మహిళకు నెలకు రూ.2500తక్షణమే అమలు చేయాలని భారత కూటమి డిమాండ్ చేసింది. ఇందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 202627 వార్షిక బడ్జెట్‌ను సవరించాలని కోరింది. ఆదివారం 2026–27 బడ్జెట్‌లో మహిళా పరాభవం అనే అంశంపై సదస్సునిర్వహించారు. ఈ సదస్సులో ఛైర్మన్ కాసాని శ్రీనివాసరావు గౌడ్ (జై స్వరాజ్ పార్టీ), వైస్ చైర్మన్లు రాయబండి పాండురంగం (వర్కర్స్ పార్టీ),నక్క యాదీశ్వర్ (తెలంగాణ రిపబ్లికన్ పార్టీ), కన్వీనర్లు హసన్ (ఆబాద్ పార్టీ), బి.పురుషోత్తం(సోషలిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్), సచిన్ (రాష్ట్రీయ బహుజన్ పార్టీ (మహారాష్ట్ర)),సత్యరాజ్(నవ ప్రజారాజ్యం పార్టీ), ఎండి.జానీ ఒమర్(ఇంక్విలాబ్ సేన పార్టీ),బొంగు ప్రసాద్ గౌడ్ (బ్లూ ఇండియా పార్టీ) పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఉన్న తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మహాలక్ష్మి పథకంను తక్షణమే అమలు చేసి తెలంగాణ మహిళలకు నెలకు రూ2500 ఆర్థిక సహాయం అందించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారం సమయంలో మహిళల ఆర్థిక సాధికారత కోసం మహాలక్ష్మి పథకం అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ స్పష్టంగా హామీ ఇవ్వడంతో రాష్ట్రంలోని మహిళలు నమ్మి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చారన్నారు. ఇచ్చిన హామీని నేరవేర్చకపోతే తెలంగాణ మహిళల తరపున భారత్ కూటమి ఉద్యమిస్తుందని వారు స్పష్టం చేశారు.

## కేటగిరి–8కి దిద్దుబాటు చర్యలు

**ప్రజాపక్షం/సిటీబ్యూరో :** ఎట్టకేలకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో వివాదాస్పదంగా మారిన కేటగిరి8 ఓసీ క్యాటగిరీకి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు. కమర్షియల్ వింగ్ అమలులోకి తీసుకువచ్చిన కేటగిరి8 నిబంధనకు టీజీఎస్‌పీడీసీఎల్ నూతన సీఎండీ జితేష్ వి పాటిల్ దిద్దుబాటు చర్యలు చేపడుతూ... కోర్టు ఆదేశాలను అమలు చేస్తూనే వినియోగదారులకు వెసులుబాటు కల్పిస్తున్నారు. పాత సీఎండీ నిర్ణయాలతో సంస్థకు జరిగిన రూ.300 కోట్ల నష్టంతో పాటు నాలుగు లక్షల మంది వినియోగదారులకు కలిగిన ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని సీఎండీ నిర్ణయం తీసుకోవడం పట్ల వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జీవితాలలో మార్పు రావాలంటే రాజకీయంగా రాణించాలి

సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర పిలుపు




**ప్రజాపక్షం/చిక్కడపల్లి :** సగరులు రాజకీయంగా ఎదిగినప్పుడే జీవన స్థితిగతులలో మార్పు రాగలదని.. దీని కోసం ప్రతి ఎన్నికల్లో సగరులు పోటీ చేయాలని తెలంగాణ రాష్ట్ర సగర సంఘం అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర పిలుపునిచ్చారు. ఈ మేరకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర సగర సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించిన శేఖర్ సగర మాట్లాడుతూ, ఈ మధ్య కాలంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో 39 మంది సగరులు సర్పంచులుగా గెలుపొందారని.. 9 మంది కౌన్సిలర్లుగా.. కార్పొరేటర్లుగా విజయం సాధించారని.. భవిష్యత్తులో హైదరాబాద్ నగర పాలక సంస్థకుకు జరిగే ఎన్నికల్లో సగరులు అనేక డివిజన్లలో పోటీ చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ కేంద్రంగా దాదాపు లక్ష మందికి తగ్గకుండా శంఖారావం పేరిట పెద్ద బహిరంగ సభను నిర్వహించి ఈ రాజకీయ పార్టీలకు సగరుల చైతన్యం ఏంటో చాటి చెబుతామన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అయినా సగరులను బి, సి, డి గ్రూప్ నుంచి ఏ గ్రూప్‌కు మార్చాలని కోరారు. సంచార జీవనం సాగించే సగరులను దాదాపు అగ్రకులాల సరసన చేర్చి గత ప్రభుత్వాలు అన్యాయం చేశాయని ఆందోళన వ్యక్తం చేశారు. సగరులకు ఫెడరేషన్ కాకుండా సగర కార్పొరేషన్‌ను ప్రత్యేకంగా ఈ ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేసి చైర్మన్‌ను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ముత్యాల హరికృష్ణ సగర, సగర భగీరథ ఆత్మగౌరవ భవన వెల్ఫేర్ చైర్మన్ ఆస్కాని మారుతి సాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, కోశాధికారి వడ్ల కొండ కుమారస్వామి సగర, రాష్ట్ర గౌరవ సలహాదారులు ఆర్‌బి ఆంజనేయులు సగర, రాష్ట్ర మహిళా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లవి సగర, ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మి సగర, కోశాధికారి జయమ్మ సగర, సలహాదారులు మనీ మంజరి సగర, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ సగర, ప్రధాన కార్యదర్శి మహేందర్ సాగర్, కోశాధికారి సాయి గణేష్ సగర, రాష్ట్ర సంఘం నాయకులు, జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



## 'లోకాలోకనం' ఆవిష్కరణ

**ప్రజాపక్షం/త్యాగరాయగానసభ :** శాతవాహన యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య కడారు వీరారెడ్డి రచించిన లోకాలోకనం పుస్తకావిష్కరణ జరిగింది. త్యాగరాయగానసభలో కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ఉదయసాహితి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సినీ గీత రచయిత సుద్దాల అశోక్ తేజ, నేటి దినపత్రిక సంపాదకుడు బైసా దేవదాసు, సినీ గీత రచయిత మౌనశ్రీ మల్లిక్, కిన్నెర రఘురాం,సాహితీవేత్త దాస్యం సేనాధిపతి, కవి మసన చెన్నప్ప, రాజేశమ్ గౌడ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. తాత్వికత, కవిత్వం మేళవింపుగా నిండిన వ్యాసాలు గొప్పగా ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. 22 వ్యాసాలు ఈ పుస్తకంలో ఉన్నాయని...ప్రతి కుటుంబం ఓ గొప్ప సాంస్కృతిక కేంద్రం అని రచయిత పేర్కొనడం విశేషం అని వక్తలు కీర్తించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ, భారసాలలో శివును లోకానికి పరిచయం చేస్తాయని.. రచయిత మనసులోని ఆలోచనలు అనుభవాలు కాలంతో కలసి ఓ పుస్తకం రావడం లోకానికి పరిచయమవుతుందని అన్నారు.

## చర్చిలో దాడి అమానుషం

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** క్రైస్తవ మతపెద్దలు, పాస్టర్లు, మహిళలపై దాడులు జరుగుతున్నాయని.. ఈ ఘటనలు అమానుషమని తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ (టీయూసీపీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్ రాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల జహీరాబాద్‌లోని మెథడిస్ట్ చర్చిలో కొందరు దుండగులు పాస్టర్లు, మహిళలపై దాడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. చర్చికి సంబంధించిన ఆస్తుల అమ్మకం, లీజుకు ఇవ్వనున్నట్లు కొందరు దుండగులు తప్పుడు వదంతులు సృష్టించడంతో ఈ విషయంపై వివరణ ఇచ్చేందుకు హైదరాబాద్ ప్రాంతీయ కాన్ఫరెన్స్ మెథడిస్ట్ చర్చి ఇన్ ఇండియా ఎగ్జిక్యూటీవ్ కార్యదర్శి రెవరెండ్ డాక్టర్ ఎ.స్టీవెన్‌తో పాటు పాస్టర్లు, మహిళలు ఈ నెల 15న జహీరాబాద్‌లోని మెథడిస్ట్ చర్చికి వెళ్లారని తెలిపారు. చర్చిలో ప్రార్థనలు జరుగుతున్న సమయంలో కొందరు దుండగులు ప్లాన్ ప్రకారంగా వచ్చి పాస్టర్లు, మహిళలు, వృద్ధులను దూషించించడంతో పాటు కర్రలతో దాడి చేయడం అమానుషమన్నారు. దాడిలో తీవ్రంగా గాయపడిన పాస్టర్ శ్రీనివాస్ హెర్బర్ట్ ప్రాణాలను కాపాడిన మహిళ, పురుష కానిస్టేబుళ్లను ఆయన అభినందించారు. పాస్టర్లు, మహిళలపై దాడికి పాల్పడిన దుండగులను తక్షణమే అరెస్ట్ చేసేందుకు రాష్ట్ర డీజీపీ, సంగారెడ్డి జిల్లా ఎస్పీ చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో అసోసియేషన్ మహిళా విభాగం ఇంచార్జి సి.హేమలత, నేతలు ఎం.శాలిని, బి.ప్రేమ్‌సాగర్ జోసెఫ్, థామ్సన్, అబ్రియాహా మోసెస్, పాల్ బంటి, జైపాల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## బాల్కనీ కూలి.. ఇద్దరు మృతి

**ప్రజాపక్షం/పంజాగుట్ట:** ప్రమాదవశాత్తు బాల్కనీ కూలి ఇద్దరు మృతి చెందగా.. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వచ్చే కుందన్‌బాగ్ మెథడిస్ట్ కాలనీలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కుందన్‌బాగ్ మెథడిస్ట్ కాలనీకి చెందిన ద్వారకా ప్రసాద్ వ్యక్తిగత పని నిమిత్తం దేవిదాస్‌ను తన ఇంటికి పిలిచాడు. శ్రీవస్త అపార్ట్‌మెంట్‌లోని మూడవ ఫ్లోర్ పక్కన ఉన్న బాల్కనీలో ఇద్దరు మరమ్మత్తు పనులు చేస్తుండగా.. ఒకరు భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో పూజ చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే అకస్మాత్తుగా బాల్కనీ కూలడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో దేవదాస్(56), వివేక్(30) అక్కడికక్కడే మృతిచెందగా.. ద్వారకా ప్రసాద్ మాత్రం స్థానికంగా ఉన్న వెల్నెస్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటన శనివారం చోటుచేసుకున్నా.. ఒకరోజు తరువాత వెలుగులోకి రావడం అనుమానాలకు తావిస్తున్నది.

## ఉచిత వైద్య శిబిరాలు ఉపయుక్తం

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**ప్రజాపక్షం/కంటోన్మెంట్ :** పేద ప్రజలకు ఉపయుక్తంగా ఉండే ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మోండా డివిజన్ పరిధిలోకి వచ్చే రెజిమెంటల్‌బజార్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బద్రీనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్పొరేట్ హాస్పిటల్స్‌కు వెళ్లి వైద్యం చేయించుకోలేని వారికి ఇలాంటి శిబిరాలు ఉపయోగ పడతాయని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌరీ శంకర్, నందికంటి రవి, బాబూరావు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# ఒకరి ఆపద – మరొకరికి సంపద

ఎంత వీలైతే అంత సంపాదించుకో

నాడు కోవిడ్ - నేడు యుద్ధం

నాడు ప్రాణాలతో - నేడు ఆకలితో చెలగాటం

**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** విపత్తు ఏదైనా సరే ఒకరి ఆపదను మరొకరు సంపద చేసుకుంటున్నారు. నాడు కోవిడ్ సమయంలోను, నేడు ఇరాన్, అమెరికా, ఇజ్రాయిల్ మధ్య జరుగుతున్న సమయంలోనూ జరుగుతున్న తంతు అదే. ఒకరి బలహీనతను మరొకరు సొమ్ము చేసుకుంటున్నారు. ఒకరి అవసరాన్ని మరొకరు వాడుకుంటూ అందిన కాడికి దోచుకుంటున్నారు. ఇదీ హైదరాబాద్ జిల్లాలో అప్పుడు జరిగింది, ఇప్పుడు జరుగుతోంది. ఆసుపత్రులు, డాక్టర్లు, లాడ్జీలు, హోటళ్లు, హాస్టళ్లు కోవిడ్ సమయంలో వైద్యం, క్వారంటైన్ సెంటర్లు, మెడికల్ దుకాణాలు, నిత్యావసర వస్తువుల ధరలు ఇలా అనేక రూపాల్లో ఎంత దొరికితే అంత ఎక్కువ సంపాదించుకున్నారు. కొందరు కోట్లకు పడగలెత్తితే మరొకరు దివాళా తీసారు. ఇప్పుడు యుద్ధం సమయంలోనూ అదే జరుగుతోంది. కాకపోతే కొంత తేడా.. ఆనాడు ప్రాణ భయాన్ని సొమ్ము చేసుకుంటే, నేడు నిత్యవసరాల అత్యవసరాన్ని ఆసరాగా చేసుకుని దోచుకుంటున్నారు. డీజిల్, పెట్రోల్ చార్జీలు మొదట కొన్ని రోజులు పెరగకపోయినా కొరత పేరుతో ఆటోలు, క్యాబ్‌లు, కూరగాయలు, నిత్యావసరకుల ధరలు పెంచేశారు. రవాణా చార్జీ పెరిగిందని చెప్పి ఒకప్పుడు వంద రూపాయలు అయ్యే చార్జీని ఇప్పుడు ఆటోలు, క్యాబ్‌లు ఇతర రవాణా వాహనాలు రూ.130వరకు పెంచారు. అంటే ప్రస్తుతం సామాన్యుడు అదనంగా 30 శాతం చెల్లిస్తున్నాడు. నిజానికి కొరత మాట నిజమే కాని ధరలు పెరగక ముందే ఇంధన కొరత సాకుతో ఇలా దోచేసుకోవడం మొదలుపెట్టారు. ప్రస్తుతం కూడా పవర్ పెట్రోల్ ధర కొంత పెరిగింది. కాని ఇది రవాణా వాహనాలు చాలా తక్కువగా వినియోనిగిస్తాయి.ఇక వార సంతల్లో, రైతు బజార్లలో, కూరగాయల మార్కెట్లలో కూరగాయల ధరలను కూడా అమాంతం పెంచేసారు. యుద్ధానికి ముందు పావు కిలో 20 రూపాయలు ఉన్న కూరగాయ ధర ఇప్పుడు 25 రూపాయల నుంచి 30 రూపాయలకు పెంచేసారు. ఒకే సారి 25 శాతం నుంచి 50 శాతం ధర పెరిగింది. ఈ ధర పెంపు ఒక్కో మార్కెట్‌లో ఒక విధంగా ఉంది. వీధుల్లోకి వాహనాలపై కూరగాయలు తెచ్చి విక్రయించే వారైతే 40 శాతం నుంచి 50 శాతం ధర పెంచేసారు. కూరగాయలు తేవడానికి వాహనదారులు డీజిల్,పెట్రోల్ ధరలు పెరిగినందున చార్జీలు ఎక్కువ తీసుకుంటున్నామని చెబుతున్నారని, కాబట్టి మాకు కూరగాయల ధరలు పెంచాల్సి వచ్చిందని సమాధానమిస్తున్నారు. ఈ పరిస్థితి రోజురోజుకు పెరుగుతోందే తప్ప తగ్గడం లేదు.

**హాస్టళ్లు, హోటళ్లు, రెస్టారెంట్లలో మరీ అధికం :**

డీజిల్, పెట్రోల్ సాకుతో నిత్యవసరాలు పెరిగితే ఇక గ్యాస్ కొరత పేరుతో ఒకరి ఆకలిని మరొకరు సొమ్ము చేసుకుంటున్న పరిస్థితి మరీ దారుణంగా ఉంది. గ్యాస్ కొరత మాట వాస్తవమే, అందులోనూ వాణిజ్య అవసరాల గ్యాస్ కొరత ఉందనేది అక్షర సత్యం. కాని దానిని సాకుగా చూపి అడ్డగోలు ధరలు పెంచేసి దోచుకుంటున్నారు. ఇదేందని అడిగితే మీకు తెలియందేముంది, నిజానికి మూసుకోవాలి, కాని మీకోసం బ్లాక్‌లో మూడు, నాలుగు రెట్లు ఎక్కువ ధరకైనా సరే సిలిండర్లు కొని మీకు కష్టం కలగకుండా చూసుకుంటున్నామని చెబుతున్నారు. ఒక వాణిజ్య సిలిండర్ ధర రూ.1800 కాగా పరిస్థితిని బట్టి ఒక్కోదానిని రూ. 3వేల నుంచి రూ.5వేలు, కొన్ని సంధర్భాల్లో రూ.6వేలకు కూడా గ్యాస్ ఏజెన్సీలు బ్లాక్‌లో విక్రయించిన సందర్భాలు ఉన్నాయి.

ఇక గృహావసర సిలిండర్లు వాణిజ్య అవసరాలకోస వాడకుండా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెపుతున్నప్పటికి ఇటీవల వారు గ్యాస్ ఏజెన్సీలపై చేసిన ఆకస్మిక దాడుల్లో వారు బ్లాక్ చేసి పెట్టిన గృహావసర సిలిండర్లు వందల సంఖ్యలో దొరకడం బట్టి చూస్తే అవి బ్లాక్ అవుతున్నాయన్న దానికి బలం చేకూరుస్తోంది. ఇక వాణిజ్య సిలిండర్ల బ్లాక్ షరామామూలే. జిల్లాలోని హిమాయత్‌నగర్, అశోక్‌నగర్, నారాయణ గూడా, అమీర్ పేట, దిల్‌సుఖ్‌నగర్, ముషీరాబాద్, పద్మారావ్ నగర్ తదితర ఎడ్యుకేషన్ హబ్‌లలో విద్యాలయాలు,కోచింగ్ సెంటర్లు వంటి వాటిలో హాస్టళ్లు ఎక్కువ. దీంతో పాటు హాస్టళ్లలో ఉండి ఉద్యోగం చేసుకునే వారు కూడా ఎక్కువే. ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు ముగిసినప్పటికి ప్రైవేటు కాలేజీల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులు సోమవారం నుంచి ప్రారంభం అవుతున్నాయి. వివిధ పోటీ పరీక్షలు సిద్ధమవుతున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. హాస్టళ్లలో, మెస్‌లలో నెల వారీ ధరలు కూడా దాదాపు 20 నుంచి 30శాతం పెరిగాయి. ఉదహరణకు పరిశీలిస్తే అశోక్‌నగర్‌లోని వివిధ పరీక్షలకు కోచింగ్ తీసుకుంటున్నవారు ఉంటున్న ఒక హాస్టళ్లలో గత నెల వరకు ఒకరికి నెలకు మెస్, ఉండడానికి వసతి కలుపుకొని రూ.9వేలు ఉండగా అది ఈ నెల నుంచి రూ.12వేలకు పెంచారు. హాస్టల్ స్థాయిని బట్టి ఈ ధర పెంపు మరింత ఎక్కువ ఉంది. రెసిడెన్షియల్, సెమి రెసిడెన్షియల్ కళాశాలల్లో కూడా ఫీజులు పెంచేశారు. అకడమిక్ ఫీజు అంతే ఉందని, గ్యాస్ సమస్య కారణంగా మెస్ ధరలు పెంచాల్సి వచ్చిందని చెబుతున్నారు. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ ఉండి చదువుకునే వారికి, పోటీ పరీక్షలకు, గ్రూప్, సివిల్స్ వంటి వాటికి కోచింగ్ తీసుకుంటున్న వారు, హాస్టళ్లలో ఉండి ఉద్యోగం చేసుకునే వారికి వేరే ప్రత్యామ్నాయం లేక యుద్ధం ముగిసే వరకే కదా తర్వాత సర్ధకు పోతుంది అంటూ పెంచిన ధరలను కిక్కురుమనకుండా చెల్లిస్తున్నారు. ధరలు పెంచిన వారంతా చెబుతున్న పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ కొరత,బ్లాక్‌లో అధిక ధరలు పెట్టి కొనుగోలు చేయండం వంటి కారణాల్లో కొంత వాస్తవం ఉన్నా, ఈ సాకుతో వారు పెడుతున్న ఖర్చు కంటే కనీసం అయిదు నుంచి పది రెట్లు ఎక్కువ వసూలు చేసి మంచి తరుణం మించిన దొరకదు అంటూ ఎంత వీలైతే అంత ఈ పరిస్థితిని ఆసరా చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారన్నది మాత్రం వాస్తవం.

## జైళ్ల పరిస్థితులపై
# సమగ్ర వివరాలు పంపండి

రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు 'సుప్రీం' ఆదేశాలు



**న్యూఢిల్లీ:** దేశంలోని అన్ని రాష్ట్రాలు మరియు కేంద్ర పాలిత ప్రాంతాలకు జైళ్ల పరిస్థితులపై తాజా, సమగ్ర వివరాలను సమర్పించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ముఖ్యంగా జైళ్లలో ఉన్న అధిక జనసాంద్రత (ఓవర్‌క్రౌడింగ్) సమస్యపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ ఆదేశాలను న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన సుప్రీం కోర్టు బెంచ్ జారీ చేసింది. కోర్టు సూచనల ప్రకారం, ప్రతి జైలుకు సంబంధించి, అనుమతించిన సామర్థ్యం (సాంక్షన్డ్ కెపాసిటీ), ప్రస్తుతం ఉన్న ఖైదీల సంఖ్య, ప్రతి జైలులో ఎంత మంది అధికంగా ఉన్నారు వంటి వివరాలతో సమగ్ర సమాచారం ఇవ్వాలి. ఇది సాధారణ గణాంక సేకరణ మాత్రమే కాకుండా, ప్రతి జైలు పరిస్థితిని స్పష్టంగా అర్థం చేసుకోవడానికి అవసరమైన చర్యగా నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు రాష్ట్రాలు సమర్పించిన డేటా 2023 సంవత్సరానికి చెందినది. ఈ పాత సమాచారం ఆధారంగా ప్రస్తుత పరిస్థితిని అంచనా వేయడం కష్టమని కోర్టు అభిప్రాయపడింది. అందువల్ల తాజా, సమకాలీన డేటా లేకుండా సరైన నిర్ణయాలు తీసుకోవడం అసాధ్యమని పేర్కొంది. ఈ ఆదేశం కేవలం సామర్థ్యం, ఖైదీల సంఖ్యతో మాత్రమే పరిమితం కాలేదు. మహిళల జైళ్ల గురించి కూడా ప్రత్యేకంగా వివరాలు ఇవ్వాలని కోర్టు సూచించింది. మహిళా ఖైదీల కోసం ఉన్న సదుపాయాలు, ముఖ్యంగా వారితో కలిసి జైల్లో నివసిస్తున్న పిల్లల విద్య, ఆరోగ్యం, సంక్షేమానికి తీసుకున్న చర్యలపై వివరాలు ఇవ్వాలని సూచించింది. ఇది జైలు వ్యవస్థను మానవ హక్కుల కోణంలో పరిశీలిస్తున్నట్లు చూపిస్తుంది. ఇంకా, జైళ్లలో పనిచేసే సిబ్బంది సంఖ్య, ఖాళీలు, వాటిని భర్తీ చేయడానికి తీసుకున్న చర్యల గురించి కూడా సమాచారం ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. సిబ్బంది కొరత కూడా జైళ్లలో సమస్యలను పెంచే ముఖ్య కారణమని కోర్టు భావిస్తోంది. ఈ మొత్తం సమాచారాన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమతమ హోం సెక్రటరీల ద్వారా ప్రమాణపూర్వక అఫిడవిట్ల రూపంలో మే 18, 2026లోపు సమర్పించాలి. ఆ తర్వాత ఈ వివరాలను సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ సమీక్షించి, కోర్టుకు సమగ్ర నివేదిక అందిస్తారు. ఈ కేసు తదుపరి విచారణ మే 26న జరగనుంది. ఈ చర్య ద్వారా కోర్టు జైళ్లలో ఉన్న సమస్యలను తీవంగా పరిగణిస్తూ, సమర్థవంతమైన పరిష్కారాల కోసం దిశానిర్దేశం చేస్తోంది.

## న్యాయ వ్యవస్థ బలోపేతానికే ఎఐ
# భర్తీ చేయడానికి కాదు..

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్



**న్యూఢిల్లీ:** కృత్రిమ మేధస్సు (ఎఐ) న్యాయ వ్యవస్థను బలోపేతం చేయాలే తప్ప, దానిని భర్తీ చేయడానికి కాదని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ వ్యాఖ్యానించారు. బెంగళూరులోని కర్నాటక జ్యుడిషియల్ అకాడెమీలో నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, న్యాయ వ్యవస్థలో భారీ స్థాయిలో ఉన్న డేటా, కేసుల వివరాలు, పత్రాలను నిర్వహించడంలో ఎఐ చాలా ఉపయోగపడుతుందని అన్నారు. ఉదాహరణకు, కేసులలో ఉన్న నమూనాలను గుర్తించడం, సమాచారాన్ని వేగంగా విశ్లేషించడం, విధానపరమైన ఆలస్యాలను తగ్గించడం వంటి పనుల్లో ఎఐ ఒక శక్తివంతమైన సాధనంగా పనిచేయగలదని చెప్పారు. ఈ దృష్టిలో ఎఐ అనేది సహాయక పాత్ర పోషించాలని, అంటూ, న్యాయ నిర్ణయాల వంటి కీలక అంశాల్లో ఎఐకి అధిక ప్రాధాన్యం ఇస్తే, పారదర్శకత, బాధ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. న్యాయ తీర్పులు ఇవ్వడం అనేది కేవలం డేటా విశ్లేషణతో ముగిసే ప్రక్రియ కాదని, ఇందులో న్యాయమూర్తుల అనుభవం, వివేచన, సామాజిక అవగాహన కూడా కీలక పాత్ర పోషిస్తాయని వ్యాఖ్యానించారు. అందువల్ల తుది తీర్పు ఇవ్వడం మాత్రం మనుషుల చేతుల్లోనే ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఎఐ అనేది ఒక సాధనం మాత్రమేనని, దిశను నిర్దేశించేది మాత్రం మానవ మేధస్సేనని ఆయన అన్నారు. న్యాయమూర్తులు తమ అనుభవం, విశ్లేషణా సామర్థ్యంతో తీర్పులు ఇవ్వాలని, ఎఐ కేవలం వారికి సహాయపడాలని అన్నారు. ఇది న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యాన్ని కాపాడటానికి అవసరమైన సమతుల్యతను కల్పిస్తుందని చెప్పారు. కాగా, కర్నాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విభు బఖ్రూ మాట్లాడుతూ భవిష్యత్తులో ఎఐ కేవలం సహాయకంగా ఉంటుందా, లేక న్యాయమూర్తుల స్థానాన్ని తగ్గించే స్థాయికి చేరుతుందా అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. అదే సమయంలో, ఎఐ ద్వారా కేసులపై ముందస్తు విశ్లేషణ చేయడం, ఆన్‌లైన్ వివాద పరిష్కార వ్యవస్థలను మెరుగుపరచడం ద్వారా వేగంగాను, తక్కువ ఖర్చుతోనూ కేసులను పరిష్కరించవచ్చని ఆయన చెప్పారు. ఎఐ వల్ల కోర్టు తీర్పులను స్థానిక భాషల్లో వేగంగా అనువదించడం సాధ్యమైందని చెప్పారు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల ప్రజలకు న్యాయం చేరువ అవుతుందని అన్నారు. న్యాయవాదులు తమ క్లయింట్లతో సులభంగా కమ్యూనికేట్ చేయగలుగుతారని పేర్కొన్నారు.


## ఒబిసి ఉద్యమ నాయకుడు షబ్బీర్ అన్సారీ మృతి



**జాల్నా:** ఒబిసిఉద్యమానికి ప్రముఖ నాయకుడు షబ్బీర్ అహమ్మద్ అన్సిరీ మహారాష్ట్రలోని జల్నాలో దీర్ఘకాల అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన వయస్సు 79 సంవత్సరాలు. ఆల్ ఇండియా ముస్లిం ఒబిసి ఆర్గనైజేషన్ జాతీయ అధ్యక్షుడిగా ఆయన నాలుగు దశాబ్దాలకు పైగా సామాజిక న్యాయం, వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం పనిచేశారు. రిజర్వేషన్లు, సమాన హక్కుల కోసం దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యపరిచారు. మండల్ కమిషన్ సిఫార్సుల అమలు కోసం కృషి చేసి, ముస్లిం సమాజంలోని వెనుకబడిన వర్గాలను ఒబిసి కేటగిరీలో చేర్చేందుకు పోరాడారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఆరు కుమార్తెలు ఉన్నారు.

# ఫ్లెమింగోలకు కష్టకాలం!

## కనుమరుగవుతున్న పక్షుల నివాస ప్రదేశాలు



**ముంబయి:** నవి ముంబై ప్రాంతంలో ఫ్లెమింగోపక్షుల నివాస ప్రదేశాలు తీవ్రంగా క్షీణిస్తున్నాయని పర్యావరణ కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు. డిపిఎస్ లేక్ నెరూల్, ఎన్ఆర్ఐ లేక్ నెరూల్, టిఎస్ చాణక్య లేక్ అనే మూడు కీలక సరస్సులు విషపూరితంగా మారుతున్నాయని తాజా పరీక్షలు వెల్లడించాయి. ఇవి థానే క్రీక్ ఫ్లెమింగ్ సాంక్చువరీకి అనుబంధంగా ఉన్న ఉపచిత్తడి బయళ్లు కావడం వల్ల ఈ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. సాధారణంగా నవంబర్ నుండి మే వరకు ఈ ప్రాంతంలో ఫ్లామింగోలు కనిపిస్తాయి. ముఖ్యంగా జనవరి నుంచి మార్చి వరకు వీటి సంఖ్య ఎక్కువగా ఉండటంతో పక్షి ప్రేమికులు పెద్ద సంఖ్యలో వచ్చి వీటిని వీక్షిస్తారు. అయితే ఈసారి ఫ్లామింగోలు రాకపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. ఇది సహజ వాతావరణంలో ఏదో మూలపూర్వక మార్పు జరిగిందని సూచిస్తోంది. పర్యావరణ సంస్థ నాట్‌కనెక్ట్ ఫౌండేషన్ నిర్వహించిన నీటి నమూనాల పరీక్షలు పరిస్థితి ఎంత దిగజారిందో స్పష్టంగా చూపిస్తున్నాయి. పరీక్షా ఫలితాలను అనుసరించి, టిడిఎస్ (మొత్తం కరిగిన ఘనాలు), పిహెచ్ స్థాయి, బిఒడి (జీవరసాయన ఆక్సిజన్ అవసరం), సిఒడి (రసాయన ఆక్సిజన్ అవసరం) స్థాయిలు ప్రమాదకరంగా ఉన్నాయి. అక్కడ నీరు సహజంగా ప్రవహించడం లేదు. సాధారణంగా ఈ చిత్తడి నేలలు సముద్రపు అలల ప్రభావంతో శుభ్రపడాలి. కానీ ఇప్పుడు ఆ ప్రవాహం అడ్డంకులకు గురై, నీరు నిలిచిపోయి కాలుష్యంతో నిండిపోతోంది. ఈ పరిస్థితి ఫ్లామింగోలకు ప్రత్యక్షంగా హానికరం. ఇవి ప్రధానంగా ఆల్గీ , సూక్ష్మ జీవులపై ఆధారపడి జీవించడమే ప్రమాదానికి కారణం. నీటి నాణ్యత క్షీణిస్తే, ఆహార గొలుసు కూలిపోతుంది. అప్పుడు ఆ ప్రదేశం జీవించడానికి అనుకూలంగా ఉండదు. గతంలో కొన్ని సందర్భాల్లో ఫ్లెమింగోలు కాలుష్య ప్రాంతాలకు కూడా తగినంతగా అలవాటు పడ్డాయి. కానీ ఇప్పుడు అవి పూర్తిగా రాకపోవడం, ఈ వ్యవస్థ ఒక ప్రమాదకరమైన స్థాయిని దాటిందని సూచిస్తోంది. కార్యకర్తలు ఈ పరిస్థితికి ప్రధాన కారణంగా పాలనాపరమైన వైఫల్యాన్ని సూచిస్తున్నారు. ముఖ్యంగా సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. అభివృద్ధి పేరుతో ప్రకృతి వనరులను నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ సమస్య వచ్చిందని అంటున్నారు. అలాగే, మహారాష్ట్ర కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ, అటవీ శాఖ కూడా సరైన చర్యలు తీసుకోలేదని విమర్శిస్తున్నారు. ఈ చిత్తడి నేలలు కేవలం పక్షుల నివాసాలే కాకుండా ప్రజల సహజ సంపద కూడా. ఇవి భూగర్భ జలాలను పరిరక్షించడం, జీవ వైవిధ్యాన్ని నిలుపుకోవడం వంటి అనేక కీలక పాత్రలు పోషిస్తాయి. ఇప్పుడు ఇవి కాలుష్యంతో నిండిపోతే, దీని ప్రభావం పర్యావరణంపై మాత్రమే కాకుండా మన ఆరోగ్యంపై కూడా పడుతుంది. పర్యావరణ కార్యకర్తలు దీనిని వెట్‌ల్యాండ్ ఎమర్జెన్సీగా ప్రకటించి, వెంటనే ప్రభుత్వ జోక్యం అవసరమని కోరుతున్నారు. పర్యావరణంలో సమస్యలు ఎంత తీవ్రమయ్యాయో తెలియజేసే సూచికగా ఈ హెచ్చరికలను భావించాల్సి ఉంటుంది. పరిస్థితిని సరిచేయకపోతే, భవిష్యత్తులో మరింత పెద్ద పర్యావరణ సంక్షోభం ఎదురయ్యే అవకాశం ఉంది.

## యువతరానికి మార్గదర్శకులు భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్ గురు



**న్యూఢిల్లీ:** మనం నేడు స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నామంటే, దాని వెనుక ఎంతో మంది త్యాగం ఉంది. పోరాటం ఉంది. అంతులేని పట్టుదల ఉంది. ఎంచుకున్న మార్గాలు వేరుకావచ్చుగానీ, స్వాతంత్ర్య కాంక్ష మాత్రం అందరిలో ఒకే రకంగా ఉంది. మొదటి స్వాతంత్ర్య యుద్ధం తర్వాత, అలాంటి చారిత్రక ఘటనగా 1931 , మార్చి 23వ తేదీని పేర్కోవాలి. ఆ రోజు యువ దేశ భక్తులు భగత్ సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురును బ్రిటిష్ ప్రభుత్వం ఉరి తీసింది. దేశం కోసం వారు చేసిన త్యాగం, భారత స్వాతంత్ర్య యుద్ధాన్ని మరింతగా ప్రభావితం చేసింది. లక్షలాది మంది వీధుల్లోకి వచ్చి, స్వాతంత్ర్యం కోసం నినదించడానికి అవసరమైన ధైర్యాన్నిచ్చిన ఆ యువత్రయం త్యాగం సదా స్మరణీయం. అందుకే ఆ రోజు 'షహీద్ దివస్' లేదా అమరుల దినోత్సవంగా స్థిరపడింది. దేశభక్తిని నరనరాన జీర్ణించుకున్న యువకులు భగత్ సింగ్, సుఖ్‌దేవ్ తాపర్, శివరామ్ రాజ్‌గురు త్రయం హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ సభ్యులుగా పోరాట భూమిలోకి దిగారు. బ్రిటిష్ పాలనను వ్యతిరేకిస్తూ యువ విప్లవ జ్యోతులుగా వెలుగొందారు. లాలా లజపతిరాయి మరణానికి స్పందనగా నాటి బ్రిటీష్ అధికారి జె పి సార్డ్సను చంపారనే అభియోగాల మీద ఈ ముగ్గురు యువకులను అరెస్టు చేసి 'లాహోర్ కాన్సెరసీ' కేసును కొనసాగించిన బ్రిటిష్ వలస పాలకులు ఈ ముగ్గురికీ ఉరి శిక్ష విధించారు. అంతర్జాతీయ పౌర సమాజం క్షమాభిక్ష పెట్టాలని వేడుకున్నప్పటికీ కక్ష పూరితంగా వలస పాలకులు 23 మార్చి 1931న వీరిని ఉరి తీయడం జరిగింది. అంతకు ముందు, 1929, ఏప్రిల్ 8వ తేదీన, 'ఇంక్విలాబ్ జిందాబాద్' అని నినదిస్తూ భగత్ సింగ్ సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీపై బాంబులు విసిరాడు. అతనిపై అధికారులు కేసును నమోదు చేసి లాహోర్ జైల్‌లో ఉరి శిక్ష అమలు చేసారు. దేశవాసుల అశ్రునయనాల మధ్య వారి పార్థివ దేహాలను సుత్లజ్ నదీ తీరాన దహన సంస్కారాలు జరిగాయి. ఈ ముగ్గురు అగ్గిరవ్వలు చూపిన తెగువ, దేశభక్తి, అంకితభావం, త్యాగగుణం, ధైర్య సాహసాలు నేటి భారతీయ యువతకు దారి దీపాలుగా నిలుస్తున్నాయి. వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ, వారు అందించిన స్వాతంత్ర్యాన్ని భాద్యతాయుతంగా అనుభవిస్తూ దేశ అభ్యున్నతికి సమిధలుగా మారాలని కోరుకుందాం.

## రోప్‌వే ప్రమాదంలో
### మహిళ మృతి..ఆరుగురికి గాయాలు

**మహాసమ్ముండ్ (ఛత్తీస్‌గఢ్):** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని మహాసముంద్ జిల్లాలో జరిగిన విషాద ఘటనలో ఒక మహిళ మృతి చెందగా, మరో ఆరుగురు గాయపడ్డారు. కొండపై ఉన్న దేవాలయం నుంచి దిగుతూ వస్తున్న రోప్‌వే ట్రాలీ ప్రమాదానికి గురై కింద పడిపోవడంతో ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. అధికారుల వివరాల ప్రకారం, ఈ ప్రమాదం ఆదివారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో జరిగింది. ట్రాలీ దిగుతున్న సమయంలో కేబుల్ అకస్మాత్తుగా తెగిపోవడంతో, అందులో ఉన్న ప్రయాణికులు భారీ ఎత్తు నుంచి కిందకు పడిపోయారు. ఈ ట్రాలీలో మొదట ఎనిమిది మంది ఉన్నారని భావించినప్పటికీ, చివరకు ఏడు మంది ఉన్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ఈ రోప్‌వే సేవలు భక్తులు కొండపై ఉన్న కల్లారీ మాతా టెంపుల్ చేరుకోవడానికి సాధారణంగా ఉపయోగిస్తారు. ఈ ఆలయం సముద్ర మట్టానికి సుమారు 1,100 అడుగుల ఎత్తులో ఉంది. భక్తులు ఈ ఆలయానికి చేరుకోవడానికి రోప్‌వేతో పాటు సుమారు 900 మెట్లు ఎక్కే మార్గం కూడా ఉంది. ప్రస్తుతం జరుగుతున్న నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అక్కడికి చేరుకున్నారు. కాగా, ప్రమాదంలో రాయ్‌పూర్‌కు చెందిన అయుషి సట్కర్ (28) అక్కడికక్కడే మరణించగా, ఆమె భర్త రిషభ్ ధావ్రే (29), 16 ఏళ్ల బాలుడు చయాంశ్ ధావ్రే, గోవింద్ స్వామి (47), నమితా స్వామి (48), కుష్మితా స్వామి (10), మాన్వి గోదారియా (12) గాయాలపాలయ్యారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి, అందులో నలుగురిని మెరుగైన చికిత్స కోసం రాయ్‌పూర్‌కు పంపించారు. ఈ ప్రమాదం తర్వాత, పైకి ఎక్కుతున్న మరో ట్రాలీని వెంటనే నిలిపివేసి సురక్షితంగా కిందకు తీసుకువచ్చారు. అందులో ఉన్న ప్రయాణికులు గట్టిగా షాక్‌కు గురైనప్పటికీ, వారికి పెద్దగా గాయాలు కాలేదు.

## అమెరికా గ్యాస్, రష్యా చమురు
# మంగళూరు చేరిన నౌకలు



**మంగళూరు:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, భారత్ తన ఇంధన భద్రతను పటిష్టం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా అమెరికా నుంచి ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పిజి), రష్యా నుంచి ముడి చమురుతో కూడిన భారీ నౌకలు మంగళూరు పోర్టుకు చేరుకున్నాయి. అమెరికాలోని టెక్సాస్ నుంచి ఎల్‌పిజితో బయలుదేరిన 'పైక్సిస్ పయనీర్' అనే కార్గో నౌక విజయవంతంగా మంగళూరు పోర్టులో లంగరేసింది. ఇదే సమయంలో రష్యా నుంచి ముడి చమురును తీసుకొచ్చిన మరో నౌక కూడా పోర్టుకు 18 నాటికల్ మైళ్ల దూరంలో నిలిపి ఉంచారు. సింగిల్‌పాయింట్ మూర్తింగ్ వ్యవస్థ ద్వారా ఈ చమురును పైప్‌లైన్‌లోకి, అక్కడి నుంచి మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్స్ లిమిటెడ్‌కు తరలించనున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచ ఇంధన ధరలను స్థిరీకరించే లక్ష్యంతో సముద్రంలో అప్పటికే ప్రయాణంలో ఉన్న రష్యా ముడి చమురు అమ్మకాలకు అమెరికా తాత్కాలికంగా అనుమతి ఇచ్చింది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని భారత్... రష్యా నుంచి చమురు కొనుగోళ్లను గణనీయంగా పెంచింది. ఇరాన్ ప్రమేయంతో నెలకొన్న వివాదాల వల్ల సరఫరాలో ఆటంకాలు ఏర్పడటంతో భారత్ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో, ఈ వారం గుజరాత్‌లోని వాడినార్, ముంద్రా పోర్టులకు 'నందా దేవి', 'శివాలిక్' అనే రెండు భారత ఎల్‌పిజి ట్యాంకర్లు కూడా సురక్షితంగా చేరుకున్నాయి. ప్రమాదకరమైన హార్మూజ్ జలసంధి గుండా ఇవి ప్రయాణించి రావడం గమనార్హం. ప్రస్తుతం పశ్చిమ పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో 611 మంది భారత నావికులతో కూడిన 22 భారత నౌకలు ఉన్నాయని, డిజి షిప్పింగ్ పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తోందని అధికారులు పేర్కొన్నారు.

## మమతపై ప్రజల్లో అసంతృప్తి లేదు
# 'సర్'తో అది కనుమరుగైపోయింది

టిఎంసి రాజ్యసభ ఎంపి సాగరికా ఘోష్



**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో స్థానికంగా ఉన్న ప్రభుత్వ వ్యతిరేకత, ఎస్ఐఆర్ ప్రక్రియ పర్యవసానంగా చాలా వరకు మరుగున పడిందని, ఇది రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో బిజెపిపై తమ పార్టీకి స్పష్టమైన ఆధిక్యాన్ని ఇస్తుందని టిఎంసి రాజ్యసభ ఎంపీ సాగరిక ఘోష్ అన్నారు. ఈ ఎన్నికల కోసం టిఎంసి స్టార్ క్యాంపెయినర్లలో ఒకరిగా ఎంపికైన, పాత్రికేయురాలిగా రాజకీయాల్లోకి వచ్చిన ఘోష్ ఆదివారం మాట్లాడుతూ ఒక నాయకురాలిగా మమతా బెనర్జీ పట్ల ఆమె మద్దతుదారులలో ఎటువంటి అసంతృప్తి లేదు. ఎన్నికలలో అభ్యర్థులుగా మార్చబడిన స్థానిక నాయకులలో ఒక వర్గం పట్ల మాత్రమే ఇటువంటి భావనలు నెలకొని ఉండవచ్చని తెలిపారు. మార్చి 17న బెనర్జీ ప్రకటించిన 291 మంది అభ్యర్థుల జాబితాలో, టిఎంసి తన శాసనసభ బలంలో దాదాపు మూడో వంతు అయిన 74 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలను తొలగించింది. ఇది ప్రభుత్వ వ్యతిరేకతను ఎదుర్కోవడానికి అనుసరిస్తున్న ఒక ప్రణాళికాబద్ధమైన వ్యూహానికి సంకేతం. గత 15 ఏళ్లుగా కాషాయ పార్టీని నిరంతరం ఓడిస్తూ వస్తున్న మమతా బెనర్జీని ఓడించి, ఏ విధంగానైనా పశ్చిమ బెంగాల్‌ను కైవసం చేసుకోవడానికే ఎస్ఐఆర్ ప్రక్రియను ఉపయోగించుకోవాలన్నది బిజెపి అజెండా. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో సాగరికా ఘోష్ మాట్లాడుతూ 'ఈ ప్రక్రియ ఇప్పుడు తలకిందులైంది. టిఎంసికి స్పష్టమైన ప్రయోజనాన్ని చేకూర్చింది. స్థానిక స్థాయిలో ఏమైనా ప్రభుత్వ వ్యతిరేకత ఉండి ఉంటే, ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల అది పూర్తిగా మరుగున పడిపోయింది. ఇది బిజెపి చేసిన ఘోరమైన తప్పు' అని అన్నారు. 'వారు ఎన్ని పేర్లు తొలగించాలనుకుంటే అన్ని తొలగించుకోనివ్వండి. మేము ఎలాగైనా గెలుస్తాము' అని అన్నారు. 'హడావిడిగా రుద్దిన' ఎస్ఐఆర్ ప్రక్రియ, కేవలం సామాన్య ప్రజలపైనే కాకుండా, నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్య సేన్, మాజీ చీఫ్ సెక్రటరీ నందిని చక్రవర్తి, మంత్రి శశి పంజా, క్రికెటర్ రిచా ఘోష్ వంటి నిష్ణాతులైన పౌరులపై కూడా పౌరసత్వ సందేహాలను రేకెత్తించిందని, ఇది రాష్ట్రంలో బిజెపి వ్యతిరేక పవనాన్ని సృష్టించిందని టిఎంసి ఎంపీ అన్నారు. 'బిజెపి ఎవరి గురించి అయితే అంత గట్టిగా మాట్లాడిందో, ఆ చొరబాటుదారులు ఎక్కడ ఉన్నారు?' అని ఆమె ప్రశ్నించారు. ''ఆమె 24 గంటలూ తన ప్రజలతో మమేకమై ఉండే రాజకీయ నాయకురాలు. మూడు పర్యాయాల పాలన తర్వాత స్థానిక స్థాయిలో కొంతమేర ప్రభుత్వ వ్యతిరేకత సహజమే. కష్టకాలంలో తాము ఆమెను ఆశ్రయించవచ్చని, ఆమె తమ సమస్యలను పరిష్కరిస్తుందని ప్రజలకు తెలుసు' అని తెలిపారు. బెనర్జీని 'దక్షిణాసియాలోనే అరుదైన ఒక రాజకీయ శక్తి'గా అభివర్ణిస్తూ, ఎటువంటి రాజకీయ వారసత్వం లేదా గురువు అండ లేకుండానే 'భారత రాజకీయాల్లోని తీవ్రమైన స్త్రీ వ్యతిరేక, పితృస్వామ్య వాతావరణంలో ఒక రాజకీయ నవ సంస్థను విజయవంతంగా నడిపినందుకు ఘోష్ టిఎంసి అధినేత్రిని ప్రశంసించారు. ఉత్తర ప్రదేశ్, బీహార్, ఢిల్లీ వంటి డబుల్ ఇంజిన్' రాష్ట్రాల్లో మహిళలపై జరుగుతున్న నేరాలను ప్రస్తావిస్తూ, ఆర్జీకర్ బాధితురాలి కుటుంబానికి భారతదేశంలో మరే ఇతర ప్రాంతం కంటే పశ్చిమ బెంగాల్‌లోనే న్యాయం పొందే అవకాశం ఎక్కువగా ఉంది' అని తెలిపారు. ''బిజెపి బెంగాల్ వ్యతిరేక విధానాల వల్ల, అలాగే ఎస్ఐఆర్ నిర్వహణలో సన్నద్ధం కాని ఎన్నికల సంఘంపై ఒత్తిడి తీసుకురావడం వల్ల ప్రజలు ఎదుర్కొన్న వేధింపులు రాష్ట్రంలో టిఎంసి స్థానాన్ని మరింత బలోపేతం చేశాయి' అని ఆమె పేర్కొన్నారు.

# 'అస్సామీయ గుర్తింపు' ప్రధాన ఎజెండా

అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో రసవత్తర పోరు




**గౌహతి:** అస్సాంలో ఏప్రిల్ 9న జరగబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 'అస్సామీయ గుర్తింపు' (అస్సామీయ జాతియోతబాది) ప్రధాన రాజకీయ అంశంగా మళ్లీ ముందుకు రావడంతో, పోరు రసవత్తరంగా సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. దశాబ్దాలుగా బయటి వ్యక్తులు, ప్రత్యేకించి అక్రమ వలసదారులు, స్థానిక సంస్కృతి, భాష, భూమిపై ప్రభావం చూపుతున్నారనే అభిప్రాయం ప్రజల్లో బలంగా ఉంది. ఈ భావజాలాన్ని ప్రాంతీయ పార్టీలతో పాటు జాతీయ పార్టీలు కూడా తమ ఎన్నికల వ్యూహాల్లో కీలకంగా వినియోగిస్తున్నాయి. ఒకప్పుడు ఈ అంశంపై ఆధిపత్యం చూపిన అసోమ్ గణ పరిషద్ (ఎజిపి) వంటి ప్రాంతీయ పార్టీలు ఇప్పుడు జాతీయ పార్టీలతో కూటములు కట్టడం వల్ల తమ స్వతంత్రత కోల్పోయినట్లుగా విశ్లేషకులు భావిస్తున్నారు. 1985, 1996లో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన ఎజిపి, ప్రస్తుతం భారతీయ జనతా పార్టీ (బిజెపి)కి చిన్న భాగస్వామిగా మారింది. గత ఎన్నికల్లో 126 స్థానాల్లో కేవలం 26 సీట్లకే పరిమితమవడం, ప్రాంతీయ రాజకీయాల బలహీనతను సూచిస్తుంది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, అస్సామీయ జాతీయత అనే ప్రధాన అంశాన్ని జాతీయ పార్టీలు హైజాక్ చేశాయి. 2016లో బిజెపి 'జాతి, భూమి, స్థానం' అనే నినాదంతో అధికారంలోకి రావడం దీనికి ఉదాహరణ. అక్రమ వలసదారులను గుర్తించి పంపిస్తామనే హామీతో ప్రజల మద్దతు పొందింది. ఇదే అంశం గతంలో ఎజిపికి విజయాన్ని అందించింది. అయితే ఇప్పుడు పరిస్థితి మారింది. ఎజిపిలో కూడా సిద్ధాంతపరమైన మార్పులు కనిపిస్తున్నాయి. గతంలో అనుమానంతో చూసిన బెంగాలీ మాట్లాడే ముస్లింలకు చెందిన అభ్యర్థులను కూడా ఈసారి పెద్ద ఎత్తున నిలబెట్టడం రాజకీయ వ్యూహంలో మార్పును సూచిస్తోంది. ఇది అధికార రాజకీయాలు సిద్ధాంతాలపై పైచేయి సాధిస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంకొకవైపు, కొత్త ప్రాంతీయ పార్టీలు, రైజోర్దాల్, అస్సాం జాతీయ పరిషత్ అస్సామీయ గుర్తింపును కాపాడటానికి ఏర్పడ్డప్పటికీ, ఇవి కూడా కాంగ్రెస్‌తో కలవడం గమనార్హం. ఇది ప్రాంతీయ పార్టీలకు స్వతంత్ర రాజకీయ స్థలం తగ్గుతున్నదని సూచిస్తుంది. కాగా, అస్సాం ప్రజల్లో స్థానిక సంస్కృతి, భాష, గుర్తింపుపై ఉన్న ఆందోళన ఇప్పటికీ బలంగానే ఉందని పరిశీలకులు అంటున్నారు. అయితే జాతీయ పార్టీలు ఈ అంశాన్ని విస్తృతంగా ప్రదర్శించడం వల్ల ప్రాంతీయ పార్టీల ప్రాధాన్యం తగ్గింది. అయినప్పటికీ, ఈ భావజాలం పూర్తిగా మాయం కాలేదు. ఏదిఏమైనా, అస్సాం రాజకీయాల్లో ప్రస్తుతం ఒక ద్వంద్వ పరిస్థితి కనిపిస్తోంది. ఒకవైపు జాతీయ పార్టీలు పెద్ద వనరులు, విస్తృత వ్యూహాలతో ముందుకు వస్తుంటే, మరోవైపు ప్రాంతీయ పార్టీలు తమ ప్రాముఖ్యతను నిలబెట్టుకోవడానికి పోరాడుతున్నాయి. అస్సామీయ గుర్తింపు అనే భావన ఇంకా ప్రజల్లో బలంగా ఉన్నందున, భవిష్యత్తులో ప్రాంతీయ రాజకీయాలకు మళ్లీ అవకాశాలు ఉండే అవకాశం ఉంది.

# మమతా బెనర్జీ విజయం తథ్యం: అఖిలేశ్ యాదవ్



**లక్నో:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో మమతా బెనర్జీ చారిత్రక విజయం సాధించి, మరోసారి ముఖ్యమంత్రి పదవి చేపడతారని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాద్ అన్నారు. లక్నోలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ మమత విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ బిజెపితో కుమ్మక్కై ఎంతో మంది అధికారులను బదిలీ చేసిందన్నారు. డిజిపి, చీఫ్ సెక్రెటరీ, ఇతర అధికారులను బదిలీ చేసినప్పటికీ మమత తిరిగి అధికారంలోకి వస్తుందని చెప్పారు. ఇటీవల జరిగిన యూపీ ఎన్నికలను పరిశీలిస్తే... ఒక్క అధికారిని కూడా బదిలీ చేసిన దాఖలాలు లేవన్నారు. యూపీ నుంచి బెంగాల్‌కి బిజెపి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను భారీగా తరిలిస్తోందనే సమాచారం ఉందన్నారు. వారు ఇక్కడ లక్షలాదిమందికి శిక్షణలు ఇస్తున్నారన్నారు. వారి అండర్ గ్రౌండ్ సామ్రాజ్యంలో పోలీస్, కేంద్ర బలగాలను రూపొందిస్తున్నారని అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. పోలింగ్ బూత్‌లను ఎలా ఎత్తుకెళ్లాలి, ఎలా డబ్బు ఖర్చు చేయాలనేదానిపై శిక్షణలు ఇస్తున్నారని చెప్పారు. ఇప్పటికే బెంగాల్‌లో బూత్ స్థాయి వరకు డబ్బు తరలించడం జరిగిందని తెలిపారుతెలిపారు.

# జీవితాలను మింగుతున్న యుద్ధాలు

**‘రణరంగం కానిచోటు**
**భూస్థలమంతా వెదికినా దొరకదు**
**గతమంతా తడిసె రక్తమున,**
**కాకుంటే కన్నీళ్ళతో’...**
**‘చల్లారిన సంసారాలూ**
**మరణించిన జన సందోహం**
**అసహాయుల హహాకారం**
**చరిత్రలో నిరూపించినవి’** అంటాడు మహాకవి శ్రీశ్రీ ‘దేశ చరిత్రలు’ కవితలో. యుద్ధాల చరిత్రను.. పర్యవసానాలను అతి కొద్ది పదాలతో సూక్ష్మంగా, ఆలోచనాపరంగా ఎంతో లోతుగా విశ్లేషిస్తాడు. అలాంటి రచనలు నేటి అవసరంగా మారింది. దేశదేశాలు యుద్ధాల్లో తలమునకలై, ఆస్తి ప్రాణ నష్టాలకు పాల్పడుతున్న వేళ ‘యుద్ధ సాహిత్యం’ ప్రాధాన్యతను సంతరించుకుంది. యుద్ధం విధ్వంసాన్ని మిగిలిస్తుంది. యుద్ధం ప్రాణాలను హరిస్తుంది. అత్యంత హేయమైన యుద్ధాలకు వీరత్వాన్ని ఆపాదించి, కీర్తించే సాహిత్యం పుట్టుకురావడం మరింత దారుణం. వీటిలో, రాజులు, పాలకులు, అధికారుల ప్రాపకం కోసం రాసినవి కొన్ని... మతపరమైన విశ్వాసాలను ప్రజల్లో బలంగా నాటడానికి రాసినవి మరికొన్ని... యుద్ధాలు ఎంతటి దారుణ పరిస్థితులను సృష్టిస్తాయో మొదటి, రెండో ప్రపంచ యుద్ధాలు నిరూపించాయి. అప్పటికీ పాఠాలు నేర్చుకొని సామ్రాజ్యవాద దేశాలు యుద్ధాలకు కాలు దువ్వుతునే ఉన్నాయి. ప్రపంచాన్ని రావణకాష్టంలా మారుస్తున్నాయి. యుద్ధాలను గొప్పగా భావించడం, యుద్ధోన్మాదులను వీరులుగా కీర్తిచడం ఒకప్పుడు సాహిత్యంలో ఒక భాగంగా ఉండేది. క్రమంగా ఆ ఉధృతి తగ్గినప్పటికీ, పరంపర ఇప్పటికీ ఎంతోకొంత ప్రభావం చూపుతునే ఉంది. ఈ యుద్ధ సాహిత్యం అనే భావనను మనం లోతుగా పరిశీలిస్తే మాత్రం, అది యుద్ధాల గురించి చెప్పే రచనల సమాహారంగానేగాక, మానవజాతి తన చరిత్రలో చేసిన అత్యంత ఘోరమైన చర్యలను అర్థం చేసుకునే ఒక ప్రయత్నం. మనిషి చేతులారా సృష్టించిన విధ్వంసాన్ని చూసి, దానికి అర్థం వెతికే ఒక ఆత్మపరిశీలనా ప్రక్రియ. వేల సంవత్సరాలుగా యుద్ధాలు కొనసాగుతున్నాయి. ప్రతి తరంలో రక్తపాతం, నష్టం, బాధ పునరావృతమవుతూనే ఉన్నాయి. సాధారణంగా చూస్తే, ఇంత అనుభవం తర్వాత మనుషులు యుద్ధాన్ని కీర్తించే ఆలోచనను విడిచిపెట్టాలి. కానీ, వాస్తవ పరిస్థితి భిన్నంగా కనిపిస్తుంది. యుద్ధాన్ని అర్థం చేసుకోవడానికి మరింత రచనలు పుట్టుకొస్తున్నాయి. ఇది ఒక విచిత్ర పరిస్థితి. మనిషి ఒక వైపు యుద్ధం చేస్తాడు... మరోవైపు ఆ యుద్ధాన్ని అర్థం చేసుకోవడానికి సాహిత్యాన్ని సృష్టిస్తాడు... ప్రాచీన సాహిత్యంలో యుద్ధాన్ని ప్రశ్నించే ధోరణి చాలా తక్కువ. ఆ కాలంలో యుద్ధం అనేది గౌరవం, పరాక్రమం, వీరత్వం అనే భావనలతో ముడిపడి ఉండేది. ‘ది ఇలియాడ్’ వంటి గ్రంథాల్లో యోధులు తమ కీర్తి కోసం యుద్ధంలో పాల్గొంటారు. అక్కడ యుద్ధం ఒక గొప్ప వేదికగా కనిపిస్తుంది. కానీ, అదే రచనలో రాజు తన కుమారుడి మృతదేహం కోసం వేడుకునే దృశ్యం మన




సును కలచివేస్తుంది. ఈ రెండు విభిన్న భావనలు ఒకే రచనలో అత్యంత సహజంగా కనిపిస్తాయి. ఈ పరిణామం యుద్ధ సంక్లిష్టతను తెలియజేస్తుంది. భారతీయ సాహిత్యంలో కూడా ఇదే ద్వంద్వ భావన కనిపిస్తుంది. ‘మహాభారతం’లోని యుద్ధం కేవలం విజయం కోసం జరగలేదని, దానిని ధర్మం, కర్తవ్యాలు, సంబంధాలు, బాధ్యతల మధ్య జరిగే సంఘర్షణగా చూడాలని అంటారు. ఫలతంగా దాయాదుల మధ్య జరిగిన పోరు లక్షలాది మందిని పొట్టనబెట్టుకున్నప్పటికీ, యుద్ధానికి కారణమైన వారిని ఘనంగా కీర్తించడం కనిపిస్తుంది. దాదాపుగా, యుద్ధాలను పొగడ్తల్లో ముంచెత్తే అన్ని రచనల్లోనూ అవి అనివార్యమనే అభిప్రాయాన్ని పాఠకుల మెదళ్లలో నాటే ప్రయత్నం జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో మాత్రమే నైతిక సవాళ్లు విసురుతుంది. ప్రాచీన రచనలు యుద్ధాన్ని పూర్తిగా ఖండించకపోయినా, దాని వెనుక ఉన్న బాధను దాచలేకపోయాయి.

కాలక్రమేణా మానవ అనుభవం మారింది. యుద్ధాల తీవ్రత పెరిగింది. ముఖ్యంగా మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత సాహిత్యంలో ఒక పెద్ద మార్పు కనిపించింది. యుద్ధాన్ని గొప్పగా చూపించే ధోరణి క్రమంగా తగ్గింది. దాని స్థానంలో యుద్ధాన్ని విమర్శించే, ప్రశ్నించే ధోరణి పెరిగింది. ‘విల్ఫ్రెడ్ అవెన్’ రాసిన కవిత్వం ఈ మార్పుకు ఉదాహరణ. అతని రచనలు యుద్ధాన్ని దేశభక్తి పేరుతో మహిమాపరిచే భావనను నేరుగా సవాలు చేస్తాయి. అదేవిధంగా, ఎరిచ్ మారియా రెమార్క్ రాసిన ‘ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టర్న్ ఫ్రంట్’ వంటి రచనలు యుద్ధంలో పాల్గొనే యువ సైనికుల అంతర్గత ప్రపంచాన్ని చూపిస్తాయి. అక్కడ యుద్ధం ఒక వీరగాథ కాదు. అది మానవత్వాన్ని క్రమంగా కరిగించే ప్రక్రియ. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సాహిత్యం మరింత లోతుగా మారింది. యుద్ధం కేవలం యుద్ధభూమిలోనే జరుగదని రచయితలు గ్రహించారు. అది ప్రజల జీవితాల్లోకి ప్రవేశిస్తుంది. వారి రోజువారీ జీవితాలను మార్చేస్తుంది. అన్నే ఫ్రాంక్ ‘ది డైరీ ఆఫ్ ఆ యంగ్ గర్ల్’లో ఒక చిన్నారి భయం, ఆశ, నిరాశల మధ్య జీవిస్తుంది. అక్కడ బాంబులు కనిపించకపోయినా, భయం ప్రతీ పేజీలో కనిపిస్తుంది. అలాగే, కుర్ట్ వొన్నెగట్ రచించిన ‘స్లాటర్ హౌస్ ఫైవ్’ (ది చిల్డ్రెన్స్ క్రూసేడ్: ఎ డ్యూటీ డాన్స్ విత్ డెత్’ యుద్ధాన్ని ఒక విరుద్ధమైన, అర్థంకాని అనుభవంగా చూపిస్తుంది. ఇది యుద్ధం మనసులో ఎలా నిలిచిపోతుందో తెలియజేస్తుంది. తర్వాతి దశలో యుద్ధ సాహిత్యం ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ఒకప్పుడు పాశ్చాత్య దేశాల అనుభవాలకే పరిమితమైన ఈ సాహిత్యం, ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా వంటి ప్రాంతాల అనుభవాలను కూడా ప్రతిబింబించడం ప్రారంభించింది. చినువా అచెబె రచనలు వలస పాలన వల్ల జరిగే సాంస్కృతిక విధ్వంసాన్ని చూపిస్తాయి. తొలుత ‘డెస్టినీ ఆఫ్ లవ్’ అని పేరుపెట్టి, ఆ తర్వాత ‘ది సారో ఆఫ్ వార్’గా మార్చిన పుస్తకంలో యుద్ధం విజయం లేదా పరాజయం అనే కోణంలో కనిపించదు. యుద్ధం అనేది ప్రతి వ్యక్తి జీవితాన్ని చెదరగొట్టే శక్తిగా రచయిత బవొ నిన్హ్ ఈ రచనలో పేర్కొంటాడు. ‘ట్రైన్ టు పాకిస్తాన్’ నవలలో రచయిత కుష్వంత్ సింగ్, ఆ నాటి దేశ విభజన సమయంలో జరిగిన హింస మనుషుల మధ్య ఉన్న నమ్మకాన్ని ఎలా చెదరగొడుతుందో చూపిస్తుంది.

ఇలాంటి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. ఈ రకమైన రచనలన్నీ యుద్ధాన్ని వ్యక్తీకరించడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తాయి. కొన్ని అనుభవాలను గద్యంతో పూర్తిగా చెప్పడం కష్టం. అక్కడ కవిత్వం సహజంగా ముందుకు వస్తుంది. సీగ్‌ఫ్రైడ్ శాస్సూన్ తన కవిత్వంలో వ్యంగ్యాన్ని ఉపయోగించి యుద్ధపు అర్థంలేని స్వభావాన్ని బయటపెడతాడు. పాబ్లో నెరుడా రచనలు యుద్ధాన్ని ఒక ప్రపంచవ్యాప్త విషాదంగా చూపిస్తాయి. మహమ్మద్ డార్విష్ రచనల్లో యుద్ధం ఒక నిరంతర జీవన పరిస్థితిగా కనిపిస్తుంది. అక్కడ యుద్ధం ఒక సంఘటన మాత్రమేగాక, ఒక స్థితిగా మన కళ్ల ముందు కదలాడుతుంది.


ఆధునిక కాలంలో యుద్ధ సాహిత్యం మరింత సంక్లిష్టంగా మారింది. వాస్తవం, కల్పితం మధ్య గీత మసకబారింది. టిమ్ ఒబ్రియెన్స్ పుస్తకం ‘ది థింగ్స్ దె క్యారీడ్’లో కథలు నిజమైనవా? కావా? అనే ప్రశ్న పాఠకులకు రాదు. ఎందుకంటే, వీటిలో అత్యంత భావోద్వేగం నిండి ఉంటుంది. ఫలితంగా, వాస్తవికతకు, కల్పనకు మధ్య ఉండే గీత చెదిరిపోతుంది. ఇలాంటి రచనల్లో అభూత కల్పనలు చోటు చేసుకునే ప్రమాదం లేకపోలేదు. ఖలీద్ హొస్సేనీ రచన ‘ది కైట్ రన్నింగ్’లో యుద్ధం ఒక వ్యక్తి జీవితాన్ని సంవత్సరాల పాటు వెంటాడే నీడలా కనిపిస్తుంది. ఎంతో మంది రచయితలు... ఎన్నో రకాల విశ్లేషణలు... కానీ, ఒకప్పటి మాదిరి యుద్ధకారకులను వీరుగానో, ఘనులుగానో కీర్తించడం లేదు. గొప్పతనాన్ని చాటడం లేదు. పైగా యుద్ధం అవసరాన్ని ప్రశ్నిస్తున్నారు. ఎవరి కోసం ఈ యుద్ధాలు? అని ప్రశ్నిస్తున్నారు.

**‘సామ్రాజ్యపు దండయాత్రలో సామాన్యుల సాహసమెట్టిది?’** అని నిలదీసిన శ్రీశ్రీ తత్వాన్ని ఆవాహన చేసుకుంటే, సామ్రాజ్యవాద పదఘట్టన కింద నలిగిపోతున్న బడుగు జీవుల కోసం.. వారి జీవితాల కోసం గళం ఎత్తాల్సిన అవసరం అవగతమవుతుంది. యుద్ధ సాహిత్యం అధికారిక కథనాలను ప్రశ్నిస్తుంది. బాధితుల గళాన్ని వినిపిస్తుంది. శత్రువును కూడా మనిషిగా చూపిస్తుంది. యుద్ధం ఎంత అర్థంలేనిదో బయటపెడుతుంది. ఈ ప్రక్రియలో ఇది పాఠకుడిని అసౌకర్యానికి గురిచేస్తుంది. కానీ అదే దీని అసలు శక్తి. మానవ చరిత్రలో యుద్ధం ఒక నిరంతర వాస్తవం. అది రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక కారణాల వల్ల పునరావృతమవుతుంది. కానీ యుద్ధ సాహిత్యం ఈ చక్రాన్ని అర్థం చేసుకోవడానికి ఒక సాధనం. ఇది మనిషి తనను తాను చూసుకునే అద్దం. ఆ అద్దంలో కనిపించే చిత్రం అందంగా ఉండదు. కానీ అది నిజం. అదే ఈ సాహిత్యపు ప్రాముఖ్యత.

**– బివిఎల్**

## చదవాల్సిన పుస్తకం

### సంపూర్ణ ప్రపంచ నిర్మాణం..




జీవితాన్ని ఎలా ఉండాలో కాదు.. ఎలా ఉందో అలానే పట్టుకునే సామర్థ్యం రచయితల్లో లియో టాల్‌స్టాయ్ అగ్రగణ్యుడు. ఆయన రచించిన ‘వార్ అండ్ పీస్’ (యుద్ధము మరియు శాంతి) అనే మహత్తర కృతి ఈ లక్షణానికి అత్యంత స్పష్టమైన ఉదాహరణ. ఇది ఒక యుద్ధ గాథగానో, ఒక ప్రేమ కథగానో కాకుండా, ఒక సంపూర్ణ ప్రపంచ నిర్మాణంలా ప్రాభవాన్ని సంపాదించుకుంది. వందలాది పాత్రలు, విభిన్న స్థాయిలలో జీవించే మనుషులు, సమాజంలోని అంతర్గత మార్పులు వంటి ఎన్నో అంశాలు కలిసి ఒక శ్వాసించే ప్రపంచాన్ని నిర్మిస్తాయి. ఇది కథానాయకుడి చుట్టూ తిరిగే కథ కాదు.. ఎందుకంటే, ఇందులో సమాజం మొత్తం ఒక జీవిగా కదులుతుంది. యుద్ధభూమిలో గర్జించే తుపాకీ శబ్దాల నుంచి, రాజవంశీయుల గదుల్లో నిశ్శబ్దంగా జరిగే సంభాషణల వరకు అన్నీ సమాన ప్రాధాన్యం పొందుతాయి. ఈ రచనలో యుద్ధం ఒక రాజకీయ సంఘటనగా ఉంటుంది. అదే సమయంలో మానవ జీవితంపై ప్రశ్నలు వేసే అద్దంలా మారుతుంది. ఒక వ్యక్తి చరిత్రలో ఎంతవరకు ప్రభావం చూపగలడు? స్వేచ్ఛ అనే భావన నిజంగా ఉందా లేక విధి అన్నదే అన్నింటినీ నడిపిస్తుందా? ఒక చిన్న నిర్ణయం లేదా అనుకోని సంఘటన ఒక దేశ గమ్యాన్ని మార్చగలదా? వంటి అనేక ప్రశ్నలు యుద్ధం ద్వారా ముందుకు వస్తాయి. ఒక మహా సైన్యాధిపతి ప్రకృతిలోని చిన్న మార్పులకు లోబడిపోవచ్చు. ఒక సాధారణ సైనికుడు కూడా ఒక పెద్ద మార్పుకు కారణమవుతాడు. ఈ విధంగా యుద్ధం కేవలం చరిత్రలోని సంఘటనగా కాకుండా, ప్రతి మనిషిని తాకే అస్తిత్వ ప్రశ్నగా మారుతుంది. ఇదే సమయంలో, ఈ విస్తృత ప్రపంచంలో మరో వైపు రాజభవనాల జీవితం కనిపిస్తుంది. అక్కడ కూడా పోరాటాలే జరుగుతాయి. కానీ, అవి కనిపించవు. ప్రేమ సామాజిక నియమాల వల్ల పరిమితం అవుతుంది. స్నేహాలు ఆశల ఒత్తిడితో చీలిపోతాయి. కలలు మెల్లగా కూలిపోతాయి. టాల్‌స్టాయ్ ప్రతిభ ఈ చిన్న సంఘటనలను కూడా జీవితంలోని పెద్ద సత్యాలతో మేళవించడంలో కనిపిస్తుంది. పాఠకుడు కేవలం కథను చదవడంతో ఆగిపోడు. పాత్రలతో కలిసి ఆందోళనను, ఆశను, నిరాశను అనుభవిస్తాడు. ఈ నవల ఒకే కథ కాదు. అనేక కథల సంగమం. నటాషా రొస్టోవా అమాయకత, తప్పిదాలు, ప్రిన్స్ ఆండ్రెయ్‌లోని అంతర్గత బాధ, పియెరీ బెజుఖోవ్ అర్థాన్వేషణ తదితరాలన్నీ వేర్వేరు ప్రవాహాల్లా కనిపిస్తాయి. కానీ చివరికి అవి ఒకే నదిగా కలుస్తాయి. చిన్న చిన్న క్షణాలు కూడా పెద్ద సంఘటనలతో సమానంగా ప్రాధాన్యం పొందుతాయి. ఒక చూపు, ఒక మాట, ఒక నిశ్శబ్దం కూడా దేశ గమ్యాన్ని మార్చే నిర్ణయాలంత భారాన్ని కలిగి ఉంటుంది. చరిత్రను అత్యంత సాధారణమైన గతంలా చూపించకపోవడం వల్లే, ఇది కాలాతీత సాహిత్యం జాబితాలోకి చేరుతుంది. తప్పక చదవాల్సిన పుస్తకంగా మారింది. రష్యా సమాజాన్ని ఒక జీవిగా, విభిన్నతలతో, విరుద్ధతలతో, పాఠకుడి ముందుంచడంలో రచయిత సఫలమయ్యాడు. నిజమైన మహాకావ్యం అంటే మనల్ని మనమే ఇతరుల్లో చూడగలిగేలా చేయడం. ఈ నవల ఆ అనుభూతిని పాఠకులకు అందిస్తుంది.

**ప్రతులకు**

నవచేతన పబ్లిషింగ్ హౌస్ గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068. (నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

## భగత్‌సింగ్ ఓసారి రావయ్యా..

మొన్న జుట్టుకు పన్నువేస్తే తిరుగుబాటు చేశారు జనం.
ఉప్పుపై పన్ను వేస్తే ఊరు ఊరు ‘‘దండి’’లా కదిలింది.
పన్ను వేసినోడు తెల్లోడు కాబట్టి వాడ్ని వెళ్లిపోమన్నారు.
మరి నేటి నల్లోడి సంగతేంటి ?
తెలియకుండానే పన్నేసి గుంజుతుండు.
జిఎస్‌టి పేర ప్రజలనెత్తురు జుర్రుతుండు..
మతంపేర, కులంపేర విభజించి ఎల్లకాలం
తానే ఏలచూస్తుండు.
ప్రశ్నిస్తే జైలు, కాదంటే దేశద్రోహి.
ఇంత జరుగుతున్నా.. నోరు మెదపరేం?
పోరాట జవ చచ్చిపోయిందా?
తలవంచి బతకటం అలవాటు అయిందా..
ఓ భగత్‌సింగ్ మళ్లీ ఓ సారి రావయ్యా
నిశ్చలమైన ఈ సమాజాన్ని చలింపజేయగా
కొలువు వేతనం, సరదాలు తప్ప
ప్రజలకోసం కొట్లాడలేని యువతరాన్ని మేల్కొల్పగా
ఆలోచన, అధ్యయనం ఆయుధాలుగా
సమరానికి యువతరాన్ని సన్నద్ధం చేయగ.
ఓ భగత్‌సింగ్ ఓసారి రావయ్యా..

**(భగత్‌సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా నివాళులర్పిస్తూ.. )**

**– ఏనుగు వెంకటేశ్వరావు, ప్రజాపక్షం, ఖమ్మం.**



## ఈవారం కవితలు

### ఎర్రని జెండను చూసి...

**పల్లవి:**
ఎర్రని జెండను చూసి దండం పెడుతున్నా
ఎర్రాని రెపరెప చూసి సెల్యూట్ అంటున్నా
గడ్డిపూల గర్జన వింటూ అబ్బుర పడుతున్నా
గుండెనే జెండా చేసి సంబర పడుతున్నా
గానమై ప్రవహిస్తున్నా...
మేఘమై ప్రభవిస్తున్నా...
చూపుల దారుల్లోన...
దీపమై వెలుగుతు వున్నా...
రేలారే రేలారే రేపటి సూరీడు నువ్వేలే
నువ్వైనా నేనైనా తూరుపు దిక్కయి నడవాలే
రేలారే ....
రేలారే ...
రేలారే ....
॥ఎర్రని॥

**చరణం : I**
రాలిపోయే ఆకులు చూసి
కాలుతున్న కలలను చూసి
ఎండుతున్న డొక్కలు చూసి
మండుతున్న గుండెలు చూసి
మరణం లేని వీరుల పాటల తోరణమవుతున్నా
సూర్యున్ని డప్పుగ మార్చి దరువే వేస్తున్నా
నాగేటి చాళ్ళనుండి పొడిచే పిడికిలినై
రెల్లుగడ్డి సందుల్లోంచి జెండై వస్తున్నా
॥ఎర్రని॥

**చరణం : II**
గుప్పెడంత మట్టిని చూసి
గుబులుగున్న మనిషిని చూసి
నిన్నటి గాయం చూసి
నెత్తుటి గేయం చేసి
కంటిరెప్ప విడుదల చేసిన కన్నీరవుతున్నా
గున్నమావి కొమ్మన కూసిన కోయిల అవుతున్నా
ఆయుధాలు దాచిన జమ్మిచెట్టును అవుతున్నా
రాలిన చినుకుల పలుకుల పాటను అవుతున్నా
॥ఎర్రని॥

**చరణం : III**
సంద్రాల రోదన చూసి
కెరటాల వేదన చూసి
నిదురలేని రాత్రులు చూసి
కుదురు లేని కష్టాలు చూసి
అస్తమించినా మళ్ళీ ఉదయిస్తూ వున్నా
ఆంక్షలు అవరోధాలు దాటుకు వస్తున్నా
వీరుల దరహాసాలను మోసుకు వస్తున్నా
తూరుపు వాకిలి నేనై స్వాగతిస్తూ వున్నా
॥ఎర్రని॥

– బాబ్జీ

## ప్రియతమ నాయకుడు సురవరం సుధాకరరెడ్డి




ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ
పూర్వ ఉపకులపతి,
తెలుగు విశ్వవిద్యాలయం

‘ఆదర్శం ఆచరణల సముచిత సమన్వయం కమ్యూనిజమే నిజమని చెదరని విశ్వాసం’గా జీవితాంతం అరుణపతాకం నీడ కింద జీవితాన్నీ, వ్యక్తిత్వాన్నీ తీర్చిదిద్దుకున్న ఆదర్శ కమ్యూనిస్టు సురవరం సుధాకరరెడ్డి. 1942 మార్చి 25న అప్పటి మహబూబ్‌నగర్ జిల్లా కొండ్రావుపల్లెలో సురవరం వెంకట్రామరెడ్డి దంపతులకు పుట్టిన సుధాకరరెడ్డి పెదనాన్న సురవరం ప్రతాపరెడ్డి. పెదనాన్న నుండి సంక్రమించిన సాహిత్యాభినివేశం, తండ్రి నుండి లభించిన స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో బాల్యం నుండి ఉద్యమ లక్షణాలు పుణికిపుచ్చుకున్న సుధాకరరెడ్డి పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లు పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే స్కూల్‌లో బ్లాక్‌బోర్డులు, చాక్‌పీసులు, పాఠ్యపుస్తకాలు కావాలంటూ 15ఏళ్ళ ప్రాయంలోనే ఆందోళనకు నాయకత్వం వహించాడు. అది క్రమంగా జిల్లా వ్యాప్త ఆందోళనగా విస్తరించి, సమస్య పరిష్కారానికి దారితీసింది. విద్యార్థి దశలోనే కమ్యూనిస్టు భావజాలం ఆయనను ఆకర్షించింది. 1950లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య కర్నూలు పట్టణ కార్యదర్శిగా, తర్వాత జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించాడు. 1964లో కర్నూలు కళాశాల విద్యార్థిసంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. 1967 ఉస్మానియా విశ్వవిద్యాలయం న్యాయకళాశాల విద్యార్థి సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయి, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర బాధ్యతలు చేపట్టాడు. 1970లో అఖిల భారత విద్యార్థి సమాఖ్యకు, 1972లో అఖిల భారత యువజన సమాఖ్యకు జాతీయ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించాడు. 2000లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి చారిత్రాత్మకమైన విద్యుత్ ఉద్యమంతో క్రియాశీలకంగా వ్యవహరించాడు. 1988లో ఒకసారి 2004లో రెండోసారి నల్లగొండ నియోజకవర్గం నుండి పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికయ్యాడు. నల్లగొండలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి కృషిచేశాడు. కేరళ యువనేత సి.కె.చంద్రప్పన్‌తో కలిసి 18 ఏళ్ళకే ఓటుహక్కు కోసం లోక్‌సభలో గళమెత్తి, తమ డిమాండ్‌ను సాధించాడు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పార్లమెంట్‌లో పీడిత ప్రజల పక్షాన, శ్రామిక జనం, రైతాంగం, మహిళల సమస్యలపై బలమైన గళ గర్జనలు వినిపించాడు. ప్రజల న్యాయమైన హక్కుల సాధన కోసం అవిశ్రాంతంగా కృషిచేశాడు. ప్రభావవంతమైన వక్తగా మూడుతరాల విద్యార్థులను, యువజనులను, శ్రామికులను ప్రభావితం చేసిన సుధాకరరెడ్డి మూడు పర్యాయాలు (2012 నుండి 2019 వరకు) సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాడు. చండ్ర రాజేశ్వర రావు తరువాత భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన రెండవ తెలుగు నేత కావడం విశేషం.

సుధాకరరెడ్డి నేతృత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ, జాతీయస్థాయిలోనూ అన్ని ప్రజాసంఘాలలో క్రియాశీలంగా పనిచేశాయి. వారి ప్రత్యక్ష పర్యవేక్షణలోనే 2003లో హైదరాబాద్ నగరంలో అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం జాతీయ మహాసభలు ఘనంగా జరిగాయి. తెలంగాణ తొలిదశ ఉద్యమం (1969) సందర్భంగా ‘సమైక్యాంధ్ర’ నినాదం చేపట్టిన భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర సాధన తుది దశ ఉద్యమ కాలంలో ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు సంపూర్ణమైన మద్దతును ప్రకటించడం వెనుక కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి ప్రమేయం నిత్య స్మరణీయం. కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డితో నా పరిచయం 52 ఏళ్ళ క్రితం ఏర్పడింది. 1973లో తెనాలిలో జరిగిన చారిత్రాత్మక విద్యార్థుల రాజకీయ శిక్షణా తరగతుల్లో నేనూ, బి.వి.విజయలక్ష్మి, రాంభట్ల అరుణ, విద్యాసాగర్ (ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది), పద్మ (వి.రామనరసింహారావు సతీమణి), సిహెచ్. అప్పన్న, కమలమ్మ తదితరులం విద్యార్థులం. కె.నారాయణ, రామనరసింహారావు నిర్వాహకులు. సురవరం సుధాకర రెడ్డి మాకు అధ్యాపకులుగా వచ్చి, నక్సలిజం పుట్టుపూర్వోత్తరాలపై విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. ఆయన వాగ్ధాటికి నేను ఆకర్షితుడనయ్యాను. ‘ఏనాటికైనా ఆయనలాగా ప్రసంగించాలి’ అని నిర్ణయించుకున్నాను. ఆ రకంగా వక్తృత్వంలో ఆయన నాకు గురుతుల్యులు. ఆనాటి శిక్షణాశిబిరంలో నేనూ, బి.వి. విజయలక్ష్మి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహకులుగా ఉన్నాం. 19–2–1974 నాడు జరిగిన సుధాకరరెడ్డి–విజయలక్ష్మిల కులాంతర వేదిక వివాహానికి హాజరైన అనేకమందిలో నేనొకడ్ని. కంది మళ్ళ ప్రతాపరెడ్డి వాళ్ల అమ్మాయి భారతితో నా పెళ్లి జరిగిన నాటి నుండి సుధాకరరెడ్డి కుటుంబంతో మా అనుబంధం రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది. భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా సుధాకర రెడ్డి, రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యక్షుడిగా ఉన్న నన్ను ఎంతో ప్రోత్సహించారు. కార్యదర్శిగా సుధాకరరెడ్డి రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా ఉన్నప్పుడు నేను అఖిల భారత అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించాను. అలాగే 2000, 2006 మధ్యకాలంలో ఆరేళ్ళపాటు ‘విశాలాంధ్ర’ దినపత్రిక సాహిత్యం పేజీకి అనధికారికంగా బాధ్యతలు నిర్వహిస్తూ నారాయణ సుర్వే, రాజ్ బహదూర్ గౌర్ మొదలైన ప్రసిద్ధ సాహితీవేత్తలతో ఇంటర్వ్యూలు చేయించి ప్రచురించాం. ఆనాటి యువ సాహితీవేత్తలకు ‘విశాలాంధ్ర’ దినపత్రిక ఒక వేదికలాగా చేయూతనందించింది.

రాష్ట్రవ్యాపితంగా అనేకచోట్ల జరిగిన సభలకు, సదస్సులకు సుధాకరరెడ్డితో కలిసి వెళ్ళి, పాల్గొనే అవకాశం నాకు లభించింది. వారితో కలిసి ప్రయాణం చేయడం ఒక మరువరాని జ్ఞాపకం. ఒక ఎడ్యుకేషన్. వేదికపై ఎంత గంభీరంగా ప్రసంగిస్తారో, వేదిక దిగిన తర్వాత ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతున్నప్పుడు చలోక్తులతో, హాస్యోక్తులతో చుట్టూతా వాతావరణాన్ని ఆహ్లాదపరిచేవారు.


మార్చి 25 సురవరం సుధాకర్‌రెడ్డి జయంతి

మా ఇంట్లో జరిగిన శుభకార్యాలకు, వేడుకలకు, విందులకు, పండుగలకు సురవరం సుధాకరరెడ్డి విజయలక్ష్మి కుటుంబ సభ్యులందరూ పాల్గొని నిండు హృదయంతో మమ్మల్ని అభినందించేవారు, ఉత్సాహపరచేవారు. వారితో పెనవేసుకున్న జ్ఞాపకాలు ఎన్నో... ఎన్నెన్నో... 19–2–2024 నాడు సుధాకరరెడ్డి ఇంట్లో నిరాడంబరంగా జరిగిన వారి వివాహ స్వర్ణోత్సవం సందర్భంగా ‘వైవాహిక స్వర్ణం’ శీర్షికన ఒక కవితను రాసి, లేమినేట్ చేయించి, వారికి బహూకరించాను. ఆ కవితను ఇక్కడ ఉటంకిస్తున్నాను

**యాభై సంవత్సరాల పెళ్ళిరోజు వేడుక**
**సుధాకరరెడ్డి విజయలక్ష్మి వైవాహిక గీతిక**
**వందనం అభినందనం ॥ వందనం ॥**

**ఆదర్శం ఆచరణల సముచిత సమన్వయం**
**కమ్యూనిజమే నిజమని చెదరని మీ విశ్వాసం**
**॥ వందనం ॥**
**ఒడిదుడుకుల నెదుర్కొన్న మీ జీవన ప్రస్థానం**
**ఎన్నెన్నో విజయాలను సాధించిన మీ గమ్యం**
**॥ వందనం ॥**
**ఉద్యమాలు ఊపిరిగా కొనసాగిన పయనం**
**అనురాగం, ఆత్మీయత విరిసిన అనుబంధం**
**॥ వందనం ॥**
**నిఖిల లోకమర్పించు కపిల పుత్రరత్నాలు**
**వినయ విధేయత నిండిన నిత్య స్నేహ హస్తాలు**
**॥ వందనం ॥**
**చిరునవ్వులు చిందించే మీ సుందర వదనాలు**
**ఆప్యాయత కురిపించే మీ సుమధుర వచనాలు**
**॥ వందనం ॥**
**వామపక్ష ఉద్యమాన విరబూసిన దాంపత్యం**
**కులాతీత వివాహాల యువతరాని కాదర్శం**
**॥ వందనం ॥**

ఇంకా ఎన్నో సందర్భాల్లో వారిని గురించి వ్యాసాలూ, అనుభవాలూ, జ్ఞాపకాలూ, కవితలు రాయాలని భావిస్తున్న నాకు వారి మరణవార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ‘ప్రజాగ్రహ గళం ఉద్యమాల దళం’ శీర్షికన ‘ఆంధ్రజ్యోతి’ దినపత్రికకు ఒక నివాళి వ్యాసాన్నీ, ‘ప్రజాపక్షం’ దినపత్రికకు ఒక స్మృతి గీతాన్ని (ఎలిజీ) రాసి నా శ్రద్ధాంజలి ఘటించాను. ఆ స్మృతిగీతం ఇది

**మృదువైన స్వభావమున్న కమ్యూనిస్టు యోధుడా!**
**ఆత్మీయత ప్రతిరూపం ఓ అమృత హృదయుడా!**
**నిండు జీవితం గడిపిన ఎర్రసేన నాయకుడా!**
**ఎర్రెర్రని వందనాలు అందుకో లాల్ సలాం !**
**॥మృదు॥**

**చెదిరిపోని చిరునవ్వు మీ మోమున కాభరణం**
**ప్రేమపూర్వ పలకరింత మిత్రత్వపు పులకరింత**
**పాతతరం కమ్యూనిస్టు వారసత్వ సారథి**
**నేటితరం నాయకులకు నికార్సయిన వారధి**
**॥మృదు॥**

**విద్యార్థుల ఉద్యమాల మీ సమగ్ర నేతృత్వం**
**విజయాలను సాధించిన అసామాన్య సామర్థ్యం**
**ఎన్నెన్నో సమరాలను నడిపిన మీ అనుభవం**
**తెలుగునాట రాజసంగ ఎగిరిన జయకేతనం**
**॥మృదు॥**

**నిరంతర అధ్యయనం నిర్విరామ సాధనం**
**సిద్ధాంతం ఆచరణల తిరుగులేని సమన్వయం**
**లక్షలాది ప్రజలను ఉర్రూతలూపిన వక్తృత్వం**
**లక్ష్యం సాధించే దిశగా నిబద్ధకార్యకర్తృత్వం**
**॥మృదు॥**

**జాతీయస్థాయిలోన వెలిగిన తెలుగుతేజం**
**వామపక్ష ప్రజాతంత్ర ఉద్యమ ప్రవాహం**
**పార్లమెంట్లో మార్మోగిన ప్రజాగ్రహగళం**
**జనచేతన విరబూసిన ఉద్యమాలదళం**

**మీ ఆశయ సాధనకై శ్రమిస్తాము మేము !**
**మీ ప్రేరణ కాగడాగ గ్రహిస్తాము మేము !**
**ఎర్రెర్రని వందనాలు అందుకో సురవరం !**
**మీ ఉద్యమ ప్రస్థానం**

### మాకు స్ఫూర్తిదాయకం !

జీవితంలోనూ, ఉద్యమ ప్రస్థానంలోనూ ఎన్నో ఒడిదుడుకులనూ, జయాపజయాలనూ ఎదుర్కొంటూనే తాను నమ్ముకున్న కమ్యూనిస్టు సిద్ధాంతాలకోసం అంకితమై పురోగమించిన సురవరం సుధాకరరెడ్డి జీవితం, వ్యక్తిత్వం, సిద్ధాంతం నేటితరానికీ, రానున్న తరాలకూ స్ఫూర్తిదాయకం, ఆదర్శప్రాయం.



## ఎమ్మెల్యే ఇంటిపై దాడికి ఎంపి ఈటల రాజేందర్ స్పందించాలి

### అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య

**ప్రజాపక్షం/బోడుప్పల్:** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 370వ ఆదివారం జ్ఞాన మాల కార్యక్రమం ఘనంగా జరిగింది. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ ఇంటిపై బిజెపి నాయకులు దాడి చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ ఆ దాడికి నిరసనగా అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ ఎవరి మనోభావాలు అయినా దెబ్బతింటే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి. నిరసన కార్యక్రమాలు నిర్వహించాలి, అంతే కానీ ఇంటిపై టమోటాలు, కోడిగుడ్లతో దాడి చేయడం మహిళలను భయభ్రాంతులకు గురి చేయడం బిజెపి నేతల పనికిమాలిన చర్య అని నత్తి మైసయ్య మండిపడ్డారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవడంలో పోలీసు యంత్రాంగం విఫలమైందని, తక్షణమే దాడికి పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు. అదే విధంగా స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ ఈ ఘటనపై తక్షణమే స్పందించాలని, బిజెపి నాయకులపై పార్టీ పరంగా చర్యలు తీసుకొని తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని నత్తి మైసయ్య అన్నారు. గరికపాటి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడిన మాటలు తీవ్ర అభ్యంతరకరమని తక్షణమే ఆయన తన మాటలు వెనక్కి తీసుకోవాలని నత్తి మైసయ్య, గరికపాటిని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇటుకల రవీందర్, రాపోలు శ్రీరాములు, బోడుప్పల్ అరుంధతి మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గురుకుల యాకయ్య, పిఎం దాసు, యేసు రాజు, సాయి బండారి, ఏ.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడిని పరిష్కరించిన సర్పంచ్



**ప్రజాపక్షం /పూడూర్ :** నీటి ఎద్దడిని పరిష్కరించేందుకు సర్పంచు చొరవతో తీసుకున్నారు. పూడూర్ మండలం తిరుమలపూర్ తాండలో గ్రామ సర్పంచు అనుష విస్తావత్ నూతన భోరు వేయించి గ్రామ ప్రజల నీటి కష్టాలను తీర్చారు. గ్రామ ప్రజలకు నీటి కష్టాలను తీర్చారు. సర్పంచు నూతన భోర్ వేయించిన శాశ్వత పరిష్కారం చూపినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. వేసవి కాంలో గ్రామస్తులకు మంచినీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని సర్పంచు అనూష విస్లావత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ‘మా భగవతి విశాల్ జాగరణ్’ ఒక శక్తివంతమైన ఆధ్యాత్మిక సాధన

### తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ‘మా భగవతి విశాల్ జాగరణ్’ఒక శక్తివంతమైన ఆధ్యాత్మిక సాధనం అని, ఇది భక్తులు దివ్యమాతతో అనుసంధానం కావడానికి, ఆధ్యాత్మిక ఎదుగుదలను పొందడానికి సహాయపడుతుందని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ తెలిపారు. సనాతన సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా, దైవిక రక్షణ, కుటుంబాల ఆశీర్వాదం కోసం ప్రేమ, కరుణ, భక్తి, ధర్మం వంటి విలువలను పెంపొందించేందుకు హైదరాబాద్ నాంపల్లి, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో శనివారం రాత్రి నుండి ఆదివారం ఉదయం వరకు మా వైష్ణోదేవి మాతా జాగరణ్ మండల్ హైదరాబాద్ మా వైష్ణో దేవి మాతకు అంకితం చేస్తూ ‘మా భగవతి విశాల్ జాగరణ్’ను అత్యంత వైభవంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రాకేష్ జైస్వాల్, గోవింద్ నారాయణ్ రాతి, కరోడీమల్ నర్సింగపూరియా, రామ్ కిషన్ అగర్వాల్, అంజనీ కుమార్ అగర్వాల్, రాకేష్ నర్సింగ్పురియా, తదితరులు పాల్గొన్నారు.



## ఆరు గ్యారంటీలు, 11డిక్లరేషన్లు...అన్నీ మోసమే

### బిఆర్ఎస్ నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** మోసపూరిత వాగ్దానాలు, డిక్లరేషన్లతో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను తిరోగమనంలోకి నెట్టివేస్తుందని నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ ధ్వజమెత్తారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నిజాంపేట్ సర్కిల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్‌లు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టిన తెలంగాణ బడ్జెట్ పూర్తిగా మోసపూరితమైందని, తెలంగాణను తిరోగమనంలోకి నెట్టే బడ్జెట్ అని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది కేవలం అంకెల గారడీ కాదని, అంకెలను మార్చడమని, ఇది దగాకోరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. దేశ చరిత్రలో ప్రజలను దగాపూరితంగా మోసంచేసే బడ్జెట్ ఉందీ అంటే ఒక్క తెలంగాణ బడ్జెటే అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే కష్టాలు, కన్నీళ్లు, కూల్చివేతలు, పేల్చివేతల పాలనగా మారిందని, ఈ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేయడమే తప్ప మరొకటి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మాజీ కార్పొరేటర్లు బొర్ర దేవి చందు ముదిరాజ్, బాలాజీ నాయక్, సుజాత, బిఆర్ఎస్ నాయకులు సాంబశివ రెడ్డి, మేకల మధుసూదన్, రవీందర్ రెడ్డి, కురుమూర్తి పాల్గొన్నారు.

# విద్యాశాఖకు బడ్జెట్‌లో అన్యాయం

### నిరసనగా బడ్జెట్ ప్రతులు దహనం

### ఎఐఎస్ఎఫ్ కార్యదర్శి ఎండి అన్వర్



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించి విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారని ఎఐఎస్ఎఫ్ కార్యదర్శి ఎండి అన్వర్ అన్నారు. మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉప్పల్ డిపో ధర్నా చౌక్ వద్ద బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. సిఎం రేవంత్ వద్ద విద్యాశాఖ ఉన్న బడ్జెట్‌లో ఎన్నికల హామీ ప్రకారం నిధులు కేటాయించకుండా ప్రణాళిక ప్రకారం ప్రభుత్వ విద్య వ్యవస్థని నిర్వీర్యం చేస్తున్నారని, 3,24,234 లక్షల కోట్లతో మొత్తం బడ్జెట్ ప్రవేశపెట్టగా విద్యారంగానికి కేవలం 26,674 కోట్లు మాత్రమే కేటాయించారు. 8.22 % నిధులు మాత్రమే. ఈ నిధులు విద్యారంగ అభివృద్ధికి ఏమేరకు సరిపోవు. గత బడ్జెట్ కంటే కేవలం 1.18 శాతం నిధులు 3,566 కోట్లు మాత్రమే పెంచారని, పెంచిన నిధులు విద్యారంగ అభివృద్ధికి సరిపోవని, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో విద్యకు 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మూడవ బడ్జెట్ కేటాయింపులో కూడా ఇచ్చిన హామీ మేరకు అయిన నిధులు కేటాయించకుండా విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేశారని, బడ్జెట్ ప్రసంగంలో ప్రాథమిక, ఉన్నత విద్య బలోపేతం, ప్రభుత్వ యూనివర్సిటీల అభివృద్ధి ఊసే లేదని, ఇచ్చిన మాట మేరకు ఉస్మానియా యూనివర్సిటీ కి 1000 కోట్లు ఇచ్చారు. తప్ప బడ్జెట్‌లో అన్ని యూనివర్సిటీలకు అరకొర నిధులు కేటాయించారని, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ యూనివర్సిటీల ఏర్పాటు ప్రకటన లేదని, ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు ప్రతిష్టాత్మకంగా చేస్తున్నామని రాష్ట్రవ్యాప్తంగా 105 నిర్మిస్తున్నామని ప్రకటించారు. అదే విధంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కానీ ఒక్కో పాఠశాల నిర్మాణానికి ఎన్ని కోట్లు అవసరమో తెలుపలేదు. ఇప్పటికే ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవి, గురుకులాలు మోడల్ స్కూల్, మైనార్టీ స్కూళ్ళ ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ డిగ్రీ కళాశాలల్లో మౌలిక వసతులకు ప్రత్యేక నిధులు ఊసే ఎత్తకుండా, సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీల పెంపు,అద్దె భవనాల్లో నిర్వహణలో ఉన్న వాటికి కొత్త భవనాల నిర్మాణానికి నిధులు కేటాయింపుపై నిధుల చేయకపోవడం సరికాదని, బ్రేక్ ఫాస్ట్ స్కీం ఏర్పాటు, జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభం మంచిదే అయిన హామీ అమలు ఆచరణ సాధ్యం కావాలని, పెండింగ్ లో ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలే 9300కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని మరి బడ్జెట్ లో స్కాలర్షిప్‌లకు 4,343 కోట్లు మాత్రమే కేటాయించారని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయి ఊసే లేదని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యార్థులకు ల్యాప్ టాప్ లు, విద్యార్థినులకు ఎలక్ట్రిక్ స్కూటీలు, విద్యార్థులకు 5లక్షల విద్య భరోసా కార్డు, విద్యార్థులకు ఇంటింటికి ఉచిత ఇంటర్నెట్, విశ్వవిద్యాలయంలో ప్రతి రీసెర్చ్ స్కాలర్ విద్యార్థికి 10వేల రూపాయల ఫెలోషిప్ ఇస్తామని చెప్పారని వాటి గురించి బడ్జెట్‌లో ప్రస్తావన లేదని, మండలానికి ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటుపై ప్రకటన దానికి నిధుల కేటాయింపు పై బడ్జెట్ లో మాట కూడా లేదని, బిఆర్ఎస్ పాలనలో విద్యారంగం నిర్వీర్యం అయిందని నిధుల కేటాయింపు లేదని కాంగ్రెస్ ప్రజా పాలనలో విద్యాశాఖ రేవంత్ రెడ్డి వద్ద ఉంది కాబట్టి నిధులు అధికం గా విద్య శాఖకు వస్తాయని ఆశిస్తే విద్యను నిర్వీర్యం చేసే విధంగా నిధుల కేటాయింపు చేసిందని వెంటనే బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించిన నిధులను సవరించి విద్యారంగానికి అధిక శాతం నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు హరీష్, అరవింద్, ఆకాష్, సాయి కిషోర్, సురేష్ వంశీ,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి సమష్టిగా ముందుకు వెళ్లాలి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** తెలంగాణా రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ స్టోర్స్ ఆఫీసర్స్, అసిస్టెంట్ స్టోర్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉద్యోగుల సమస్యల పరిష్కార దిశగా సభ్యులందరూ సమష్టిగా ముందుకు వెళ్లాలని అసోసియేషన్ తీర్మానించింది. ఆదివారం బోడుప్పల్‌లోని హైవా హోటల్‌లో అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనం,జనరల్ బాడి సమావేశం జరిగింది. సమస్యల పరిష్కారానికి తీసుకోవాలసిన ప్రణాళిక విషయమై సమావేశంలో చర్చించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్‌ను కలిసి సమస్యల సాధనకు కృషి చేయాలని ఇప్పటికే కోరామని అసోసియన్ ప్రతినిధులు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ, వైస్ ప్రసిడెంట్ గంగా, ధీరజ్, లక్ష్మ ణ్, జనరల్ సెక్రటరి యాకూబ్ నాయక్, కోశాధికారి శివకుమార్, కోఆర్డినేటర్ ఆనంద్ కుమార్, విఠల్, ఝాన్సి,బాలచందర్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో బిసిలకు తీవ్ర అన్యాయం

### రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు, బాల్‌రాజ్ గౌడ్



**ప్రజాపక్షం / సోమాజిగూడ :** బడ్జెట్‌లో బిసిలకు తీవ్ర అన్యాయం జరిగిందని బిసి ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ టి.చిరంజీవులు, బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్ గౌడ్ పేర్కొన్నారు. తక్షణమే ప్రభుత్వం బిసి సమాజ అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.50వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి ఇంటెలెక్చువల్ ఫోరం, బిసి పొలిటికల్ ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో ‘బడ్జెట్‌లో బిసిలకు అన్యాయం’పై ఎస్.దుర్గయ్య గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. అన్ని రకాల పన్నులు చెల్లిస్తున్నప్పటికీ అభివృద్ధిలో బిసిలకు ప్రభుత్వం మొండిచేయి చూపడం సరికాదన్నారు. ప్రభుత్వం బిసి వ్యతిరేక విధానం అవలంబిస్తున్నదని మండిపడ్డారు. ఎస్‌సి, ఎస్‌టిల తరహాలోనే బిసిలకు బిసి సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని కోరారు. బిసి పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్లు బాలగోని బాలరాజ్‌గౌడ్, యెలికట్టె విజయ్‌కుమార్ గౌడ్, అయిలి వెంకన్న గౌడ్ మాట్లాడుతూ ప్రతి బడ్జెట్‌లో 90శాతం వార్షిక బడ్జెట్‌ను ఖర్చు చేస్తున్నామని చెప్తున్న ప్రభుత్వం ఆ దిశగా ఖర్చు చేయడం లేదని విమర్శించారు. బిసిల బడ్జెట్‌లోనే కల్యాణలక్ష్మి, ఇందిరమ్మ చీరలు, ఉద్యోగులకు జీతాలిస్తే ఎక్కడి నుంచి బిసిలు బాగుపడతారని ప్రశ్నించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక బిసిలకు తక్కువ నిధులు కేటాయించిన బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆ నిధులు కూడా పూర్తిస్థాయిలో ఖర్చు పెట్టకుండా బిసిలకు ద్రోహం చేశాయని విమర్శించారు. సమావేశంలో ఫ్రంట్ కన్వీనర్లు బైరు శేఖర్ గంగపుత్ర, అంబాల నారాయణగౌడ్, ఎర్రమాదు వెంకన్న నేత, గోలి యాదగిరి రజక, చెన్న శ్రీకాంత్, కైలాష్ యాదవ్, నరేశ్ తదితరులున్నారు.

## వృత్తి కులాలను విస్మరించారు

### మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బడ్జెట్‌లో వృత్తి కులాలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని బిఆర్ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసమని, బిసి వర్గాలను ఓటు బ్యాంకుగా ఉపయోగించుకోవడం తప్ప వారికి చేసింది ఏమీ లేదని మండిపడ్డారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీల ఓట్లతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు ఆ వర్గాలనే విస్మరిస్తోందన్నారు. ప్రతి ఏటా బిసిలకు బడ్జెట్‌లో రూ. 20వేల కోట్ల నిధులను కేటాయిస్తామన్న కాంగ్రెస్, రెండున్నరేళ్ల కాలంలో కేవలం రూ. 5వేల కోట్లను మాత్రమే ఖర్చు చేసిందని ఆరోపించారు. ముదిరాజ్ లను బిసి (ఏ) లో చేరుస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఫీజు రియంబర్స్‌మెంట్‌కు రూ. 12వేల కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. బిసిలకు కనీసం నామినేటెడ్ పదవులు కూడా ఇవ్వడం లేదని, బిసి సబ్ ప్లాన్ ఎక్కడికి పోయిందని, ఫ్యూచర్ సిటీతో బిసిల ఫ్యూచర్ మారుతుందా అని శ్రీనివాస్‌గౌడ్ ఎద్దేవా చేశారు. జైపాల్ యాదవ్ మాట్లాడుతూ బిసిల్లో ఉన్న అన్ని వర్గాలనూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ఆరు గ్యారంటీల విషయంలో ప్రజలను మోసం చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్లు ఇవ్వాలని, మహిళా రిజర్వేషన్లలో ఒబిసి మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## మూసీకి నిధులు ఎక్కడివి?

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఎన్నికల హామీ ల అమలుకే నిధులు లేవంటున్న కాం గ్రెస్ ప్రభుత్వం, మూసీ ప్రక్షాళనకు లక్షల కోట్లు ఎక్కడి నుండి తెస్తుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ప్రశ్నించారు. హైదరాబాద్ సోమాజిగూడలో ఆదివారం జరిగిన ‘మూసీ పునరుజ్జీవం—వాస్తవాలు’ చర్చా వేదికలో మహారాష్ట్ర ప్రభుత్వ నీటి సలహాదారు వెదిరె శ్రీరామ్ ప్రజంటేషన్ ద్వారా వివరించా రు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ మూసీ ప్రక్షాళనకు బిజెపి వ్యతిరేకం కాదని, కానీ ప్రక్షాళన పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తే సహించబోమని హెచ్చరించారు. వికారాబాద్‌లో మొదలై కృష్ణా నదిలో కలిసే మూసీవల్ల హైదరాబాద్, నల్లగొండ జిల్లాల్లో పంట లు కలుషితమై ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. 60 ఏళ్ల పాలనలో మూసీని ఎందుకు పట్టించుకోలేదని, ఇప్పుడు అకస్మాత్తుగా సుందరీకరణ జపం చేయ డం వెనుక ఆంతర్యమేమిటని రాంచందర్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు.

**మూసీకి కావాల్సింది పునరుజ్జీవం.. సుందరీకరణ కాదు : వెదిరె శ్రీరామ్**

మూసీ నది విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు అశాస్త్రీయం గా ఉన్నాయని మహారాష్ట్ర ప్రభు త్వ నీటి సలహాదారు వెదిరె శ్రీరామ్ విమర్శించారు. రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ (సుందరీకరణ) కంటే రివర్ రిజువినేషన్ (పునరుజ్జీవం) ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. అనంతగిరి కొండల నుండి కృష్ణానది వరకు మూసీని మూడు భాగాలుగా విభజించి, ప్రక్షాళన చేయాలన్నారు. ఎగువన చెక్ డ్యామ్‌లు, నగరంలో సీవరేజ్ ట్రీట్‌మెంట్, దిగువన వెట్ ల్యాండ్స్ అభివృద్ధి చేయాలన్నారు. సియోల్ (దక్షిణ కొరియా)వంటి నగరాల్లో వేల సంఖ్య లో సమావేశాలు నిర్వహించి ప్రాజెక్టులు చేపట్టారని, ఇక్కడ మాత్రం స్టేక్ హోల్డర్‌ల అభిప్రాయాలు తీసుకోవడం లేదని ఆరోపించారు. బిజె పి వద్ద ఉన్న పాత డిపిఆర్‌ను అవసరమైతే ఉచితంగా ఇస్తామని ఆయన ప్రకటించారు.

## నిరుపేదలకు వరం... ప్రగతి ప్రోగ్రెసివ్ ట్రస్ట్

### మున్సిపల్ వైస్‌చైర్మన్ సుధాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/వికారాబాద్:** ప్రగతి ప్రోగ్రెసివ్ ట్రస్ట్ అనాథ ,నిరుపేదలకు వరం అని మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామీణ ప్రభుత్వ పాఠశాలలో, చదువుతున్న, తల్లి దండ్రులులేని, నిరుపేద ప్రతిభ గల విద్యార్థులకు, ఐఐటి చుక్కరామయ్య, ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రగతి ప్రోగ్రెసివ్ ట్రస్ట్ ప్రవేశ పరీక్షలను టియస్ యుటిఎఫ్, వికారాబాద్ జిల్లా ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలో యన్‌టిఆర్ చౌరస్తాలోని యూనిక్ హైస్కూల్‌లో ప్రవేశ పరీక్ష పేపర్‌ను విడుదల చేసిశారు. నేటి సమాజం కోసం తపిస్తూ సమసమాజం కోసం పనిచేస్తున్న పిపిటి వారిని అభినందిస్తూ తల్లి దండ్రులు తమ పిల్లలను సమాజంలో బాధ్యతగా, విలువలతో కూడిన పౌరులుగా పెంచాలని కోరారు. నిరుపేద విద్యార్థుల కొరకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని జిల్లా నుండి 50మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఎంపికైన వారికి పిపిటి ద్వారా అన్ని స్థాయిల్లో విద్యపూర్తి అయ్యేవరకు పూర్తి ఖర్చులు భరిస్తుందని అన్నారు. 36 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్‌జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటరత్నం, బాబు రావు, రామచంద్రరావు, రాములు, తిరుమలయ్య, బుచ్చి బాబు తదితరులు పాల్గొన్నారు.



## రైతు ఉత్సవాలకు సిద్దిపేట బయల్దేరిన రైతులు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సిద్దిపేట జిల్లా నర్మెట్లలో నిర్వహించిన రైతు ఉత్సవాల కార్యక్రమానికి శామీర్‌పేట, మూడుచింతలపల్లి, మేడ్చల్ మండలాల నుంచి రైతు వేదిక ఆధ్వర్యంలో సుమారు 50మంది రైతులు ఆదివారం బయల్దేరారు. సిద్దిపేట జిల్లాలో రైతు ఉత్సవాలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్న నేపధ్యంలో పెద్ద ఎత్తున రైతులు తరలివెళ్లారు. అలాగే అలియాబాద్, లాల్‌గడిమలక్‌పేట రైతు వేదికల్లో సిఎం ప్రోగ్రామ్ ప్రత్యక్ష ప్రసారాన్ని రైతులు తిలకించారు. వ్యవసాయానికి సంబంధించిన నూతన పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం తెలుసుకోవాలనే ఉత్సాహంతో రైతులు ఈ ఉత్సవాలకు బయల్దేరారని వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు.

ఈ ఉత్సవాలు రైతులకు ఉపయోగకరంగా ఉంటాయని, కొత్త ఆలోచనలు తమ సాగులో దోహదపడతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి శ్రీధర్, కాంగ్రెస్ ఎ బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, అలియాబాద్ మాజీ సర్పంచ్ కమతం కృష్ణారెడ్డి, శామీర్‌పేట మండల వ్యవసాయాధికారి రమేష్, ఎఇఒ సురేష్‌కుమార్, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



## మీ సమస్య మా పరిష్కారానికి భారీ స్పందన

### మహిళా శక్తి మై వాయిస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్ హైమారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మహిళా శక్తి మై వాయిస్ ఆధ్వర్యంలో చేపట్టిన ‘మీ సమస్య మా పరిష్కారం’ కార్యక్రమానికి భారీ స్పందన లభించిందని మహిళా శక్తి మై వాయిస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్. హైమారెడ్డి అన్నారు. ఆదివారం శామీర్‌పేట డివిజన్‌లోని వార్డు కార్యాలయం వద్ద నిర్వహించిన మీ సమస్య మా పరిష్కారం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించడం జరిగింది. అనంతరం హైమారెడ్డి మాట్లాడుతూ హనుమాన్ కాలనీలో నీటి సరఫరా కావడం లేదని కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వార్డు కార్యాలయం వెనకాల కాలనీలో చెత్త సేకరణకు మున్సిపాలిటి చెత్త సేకరణ వాహనాలు రావడం లేదని అన్నారు. అలాగే శామీర్‌పేటలోని వార్డు కార్యాలయం ప్రధాన రోడ్డులో స్పీడు బ్రేకర్లు ఇష్టానుసారంగా వేయడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని, నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు. రెవెన్యూ సమస్యలను స్థానిక తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పెద్దమ్మ కాలనీలో పెన్షన్‌లు రావడం లేదని వృద్ధులు మా దృష్టికి తీసువచ్చారు. ఇట్టి విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ రమేష్, బిజెపి జిల్లా కార్యదర్శి సుదర్శన్, సాయికుమారి, పావని, విజయలక్ష్మి , జైబూన్, ప్రజలు పాల్గొన్నారు.



## అంబేద్కర్ విగ్రహానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మూడుచింతలపల్లి మున్సిపాలిటి అనంతారంలో అంబేద్కర్ విగ్రహం పెట్టడానికి మూడుచింతలపల్లి లక్ష్మాపూర్ గ్రామాల మాజీ ఎంపిటిసి పారుపల్లి నాగరాజు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజే శారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 5న ఆవిష్కరించబోయే అంబేద్కర్ విగ్రహానికి ఆర్థిక సహాయం అందజేశానని చెప్పారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని అన్నారు. మహోన్నత వ్యక్తిగా దేశానికి చేసిన సేవలను గుర్తు చేశారు. అంబేద్కర్ చూపించిన మార్గంలో యువత నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంతో నవీన్, మాజీ వార్డు సభ్యుడు దప్పు సురేష్, కొత్త కుమార్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## బీజాపూర్ హైవేపై రోడ్డు ప్రమాదం

### ఒకరు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు

**ప్రజాపక్షం/పరిగి:** పూడుర్ మండల పరిధిలోని రాకంచర్ల సమీపంలోని బీజాపూర్ హైవేపై శనివారం ఘెర రోడ్డు ప్రమాదం జరిగింది. కారు ఆటోను ఢీ కొనడంతో ఒకే కుటుంబానికి చెందిన కిషన్, భార్య కవిత, పిల్లలు పూజిత, అక్షిత, శ్రీనివాస్ ఈ ప్రమాదంలో పెద్ద అమ్మయి మృతిచెందడం జరిగింది. మిగతవారు, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉందని తెలుస్తుంది. హైదరాబాద్ నుండి కొడంగల్ నియోజకవర్గంలోని బొమ్మరాస్ పేట్ మండలంలోని బొట్ల నీ తండకు గ్రామనికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీలీసులు తెలిపారు. ఈ ప్రమాదంపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులుతెలిపారు. పోలీసులు గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

## ఘనంగా ఎల్లమ్మ కల్యాణం



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** తూంకుంట మున్సిపల్ కార్పొరేషన్‌లో కత్తి నాగేష్ నివాసంలో ఎల్లమ్మ కల్యాణం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఈ కల్యాణానికి జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి విచ్చేశారు. కల్యాణం తిలకించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కత్తి నాగేష్ జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

## మత సమరస్యానికి ప్రతీక రంజాన్

తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం అధ్యక్షుడు చిన్నారెడ్డి




**ప్రజాపక్షం/కొందుర్గు:** మత సమరస్యానికి ప్రతీకగా రంజాన్ పర్వదిన వేడుకలు ముస్లింలు నిర్వహించడం జరుగుతుందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం అధ్యక్షుడు జి.చిన్నారెడ్డి తెలిపారు. శనివారం రాత్రి కొందుర్గ మండలం శ్రీరంగాపూర్ గ్రామంలో షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ వైస్‌చైర్మెన్, లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సాధిక్ స్వగృహానికి జి.చిన్నారెడ్డి విచ్చేసి రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు. దాంతో సయ్యద్ సాదిక్‌తో పాటు ముస్లిం మత పెద్దలు చిన్నారెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకొని శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జి.చిన్నారెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేసి భగవంతుడిని ఎంతో పవిత్రంగా కొలుస్తారని వివరించారు. పుణ్యఫలం రంజాన్ మాసంలోనే ముస్లింలకు ఎక్కువగా లభిస్తుందని చరిత్ర పురాణాలు తెలుపుతుంటాయని పేర్కొన్నారు. సర్వ మతాల సారం ఒక్కటే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాలని, ప్రతి ఏడాది సయ్యద్ సాధిక్ రంజాన్ మాసంలో తనను ఆహ్వానిస్తుంటారని, వారి ఆహ్వానం మేరకు విచ్చేస్తుంటానని తెలిపారు. ముస్లింల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని వివరించారు.ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ సాధిక్ కుమారుడు సయ్యద్ అబ్దుల్లాతోపాటు గ్రామ ముస్లింలు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఇండ్ల స్థలాలివ్వాలి



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని నానక్‌నగర్ గ్రామంలోని సర్వేనంబర్ 30లో ఉన్న 3 ఎకరాల 20 గుంటల భూమిలో గ్రామంలో అర్హులైన నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని గ్రామ మాజీ సర్పంచ్ దంతుక పెద్దయ్యతో పాటు నాయకులు డిమాండ్ చేశారు. అదివారం అగ్రామంలోని భూములను వారు పరిశీలించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం భూమిని నమ్ముకోని దాదాపు 50 మంది నిరుపేదలు ఇండ్లు లేనివారు ఉన్నారని తెలిపారు. ఇటీవల గ్రామ పంచాయతీ పాలక వర్గం ఆ భూమిలో డ్వాక్రా భవనం, బిసి కమ్యూనిటీ హాల్ కుల సంఘాలకు చెందిన భవనాలు నిర్మిస్తామని తిర్మాణం చేయడం సరైంది కాదన్నారు. గ్రామంలో ఇంకా గ్రామ కంఠం భూమి ఉంది అక్కడ నిర్మిచాలని కోరారు. సిపిఐ(ఎం) అధ్వర్యంలో పోరాటం చేసి ఈ భూమిని సాధించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, బుక్క చేన్నయ్య, రాములు, మహెంధర్, కొప్పు రాములు,యాదయ్య, తదితరులు పాల్గోన్నారు.

## నేటి పాదయాత్ర విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/యాచారం :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం నేడు నిర్వహిస్తున్న పాదయాత్రను విజయవంతం చేయాలని సిపిఐ(ఎం) పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటి సభ్యులు పి.అంజయ్య తెలిపారు. అదివారం మండల పరిధిలోని నజ్జిక్ సింగారం గ్రామంలో ఒంకారేశ్వర దేవాలయ భూములను సాగు చేసుకుంటున్న రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అంజయ్య మాట్లాడుతూ దేవాలయ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం పట్టా దారు పాసుపుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలుదారు యాక్ట్ ప్రకారం సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలన్నారు. రైతుల సాగు చేసుకుంటున్న భూములకు కౌలు కూడా చేలిస్తున్నారని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం రైతులు పెద్దెతున హజరై విజయవంతం చేయాలని కొరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతులు పాల్గోన్నారు.

## సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతో ముఖ్యం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** పోటీ ప్రపంచంలో మానసిక ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతో ముఖ్యమని మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్ అప్ప అన్నారు. ఆదివారం ఉదయం పట్టణంలోని మినీ స్టేడియంలో 99రోజుల ప్రణాళికలో భాగంగా యోగా, కరాటే, నృత్య కళాకారుల బృందం, మిమిక్రీ ఆర్టిస్టులు, అధికారులు పాల్గొని కార్యక్రమాలను నిర్వహించారు. యోగా గురువుల చేత యోగాసనాలు చేయడంతోపాటు కరాటే మాస్టర్ల ద్వారా కరాటే విన్యాసాలు చేశారు. కళాకారులు వివిధ కళా రూపాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా చైర్మన్ బసవేశ్వర్ అప్ప మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం 99రోజుల ప్రణాళికలో అన్ని అంశాలను తీసుకొని ప్రజల చేత చేయించడం ఎంతో అభినందనీయమన్నారు. ఆత్మ రక్షణకు కరాటే విద్య ఎంతో ముఖ్యమని, బాల బాలికలు విధిగా నేర్చుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 99రోజుల ప్రణాళికతో వార్డులు పరిశుభ్రంగా ఉంటున్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సునీతా రెడ్డి, కౌన్సిలర్లు బచ్చలి నరేష్‌తో పాటు ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

## శ్రీరామ నవమి కల్యాణంలో అన్నదాన వితరణకు రూ.2.50లక్షలు

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** శ్రీ రామ నవమి రోజున నిర్వహించే శ్రీ సీతారాముల కళ్యాణోత్సవంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాలను చేపట్టేందుకు దాతలు రూ.2.50లక్షలను విరాళంగా అందించారు. ఆదివారం పట్టణంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు, ఆలయ పూజారి శ్రీనివాస్ చార్యులకు దాతలు ఇస్నాతి జలందర్, గిరిమోని భరత్, శ్రీశైలం గౌడ్ (లడ్డు), కుందన్ (రెమైండ్ షో రూమ్), కొట్టె ప్రవీణ్‌లు విరాళం నగదును అందించారు. దాంతో శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దాతలకు శాలువాలతో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు సన్మానించారు.



# చెరువులు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది

● సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన ● సైబరాబాద్‌లో చెరువుల 'క్లీనప్ డ్రైవ్'



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజాపాలన 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) 17వ రోజున నగర వ్యాప్తంగా భారీ స్థాయిలో 'చెరువుల క్లీనప్ డ్రైవ్'ను నిర్వహించింది. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా సాగిన ఈ కార్యక్రమంలో అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విప్రో లేక్, కుడికుంట చెరువుల వద్ద జరిగిన ఈ క్లీనింగ్ డ్రైవ్‌లో సిఎంసి కమిషనర్ సృజన పాల్గొని, వాలంటీర్లను ఉత్సాహాన్ని నింపారు. మొత్తం 57 చెరువుల్లో ఒకేసారి శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ డ్రైవ్ ద్వారా సుమారు 20.5 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను తొలగించారు. సుమారు 1,271 మంది పౌరులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ పారిశుద్ధ్య కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా సిఎంసి కమిషనర్ సృజన స్పందిస్తూ ఈ భారీ కార్యక్రమంలో పాల్గొన్న నివాసితులు, వాలంటీర్లు, బృందాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. చెరువుల పరిరక్షణ అనేది అందరి ఉమ్మడి బాధ్యత అని, పౌరుల నుంచి వచ్చిన ఈ స్పందన ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. కొనసాగనున్న కార్యక్రమం నీటి వనరులను శుభ్రంగా, సురక్షితంగా ఉంచేందుకు ఈ క్లీనప్ డ్రైవ్ రాబోయే రోజుల్లో కూడా కొనసాగుతుందన్నారు. మన జలవనరుల భవిష్యత్తు కోసం పౌరుల సహకారం ఎంతో అవసరమని చెప్పారు. చిన్న చిన్న ప్రయత్నాలు కలిసికట్టుగా సాగితే, ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన ప్రదేశాలు నిర్మించడం సాధ్యమవుతుందన్నారు. నగరవాసులంతా ఇదే స్ఫూర్తితో తమ ప్రాంతాల్లోని చెరువులను కాపాడుకోవాలని కమిషనర్ పిలుపునిచ్చారు.

## ప్రమాదానికి గురైన కార్మికులను పట్టించుకోకపోవడం దుర్మార్గం



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రాజేంద్రనగర్ జోన్ అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని వట్టిపల్లి ప్రాంతానికి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు ఎస్. శంకరమ్మ (55) మార్చి 8న శాస్త్రపురం ప్రాంతంలో ముఖ్యమంత్రి కార్యక్రమం విధులకు వస్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలకు గురైనా అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి వి. జైపాల్ రెడ్డి అన్నారు. సిఎం పర్యటన ఉండటంతో కార్మికులను తెల్లవారు జామునే విధులకు రావాలని ఒత్తిడి చేయడంతో, శంకరమ్మ ఉదయం 4 గంటలకు బస్టాండ్‌కు చేరుకుని విధులకు వెళ్తున్న సమయంలో శంషాబాద్ వైపు నుంచి అతివేగంగా వచ్చి న కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆమెను తోటి కార్మికులు వెంటనే సన్‌రైజ్ హాస్పిటల్‌కు తరలించారు.ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్నప్పటికీ ఒక్క అధికారి కూడా పరామర్శించకపోవడం దారుణమని జైపాల్ రెడ్డి మండిపడ్డారు. ఈ విషయంపై శానిటేషన్ అదనపు కమిషనర్ ఎన్.రవి కిరణ్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య ఆదేశాల తో అధికారులు కార్మికురాలి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఏ.రాజు,టి.ఆనంద్,శ్రీకాంత్,అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఔటర్ రింగ్‌రోడ్‌పై లారీని ఢీ కొట్టిన కారు

ఘటనలో ఒకరు మృతి





**ప్రజాపక్షం/రంగారెడ్డి/తుర్కయంజాల్ :** ఔటర్ రింగ్ రోడ్డు (ఒఆర్ఆర్ ) ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుపై వెళుతున్న కారు అదుపు తప్పి ముందు వెళుతున్న లారీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో అబ్దుల్లాపూర్మెట్ మండలం తుర్కయంజాల్‌లో నివాస ఉంటున్న వెంకట సాయి రామ్ (35)అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాగా మరో యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించారు. గాయపడిన వ్యక్తిని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### తుర్కయంజాల్ లో విషాదం

అబ్దుల్లాపూర్మెట్ మండలం తుర్కయంజాల్ పరిధిలోని ఖమ్మంగూడలో బీటెక్ విద్యను పూర్తి చేసుకుని ఉద్యోగం వైపు వెళ్లకుండా చిన్నపాటి రియల్ ఎస్టేట్ వ్యాపారి(బిల్డర్)గా పేరు తెచ్చుకున్న అ వివాహాయతుడైన ధీరజ్ రోడ్డు ప్రమాదం లో మృతి చెందడంతో తన సన్నిహితులు, అతనితో వ్యాపారం లో మమేకమైన వ్యక్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. స్థానికుల సందర్శనార్థం, తుర్కయంజాలకు తీసుకువచ్చి, అం త్యక్రియలు నిమిత్తం అతని స్వగ్రామమైన ఖమ్మం జిల్లా మణుగూరుకి తరలించారు.

## రైతుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

5 వ రోజుకు చేరిన గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ భాదితుల నిరాహార దీక్ష

**ప్రజాపక్షం/యాచారం :** ప్రభుత్వం రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గ్రీన్‌ఫీల్డ్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులు డిమాండ్ చేశారు. అదివారం కుర్మిద్ద తండా వద్ద రైతులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 5వ రోజుకు చేరాయి. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ ఫార్మా సిటీ పెరుతో ఇప్పటికే రైతులు భూములు తీసుకోని రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని , ప్రభుత్వం తక్షణమే బలవంతపు భూసెకరణ అపాలని డిమాండ్ చేశారు. ఫార్మసిటీకి భూములు ఇవ్వని మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న భూములను ప్రభుత్వం తక్షణమే అన్‌లైన్‌లో నమోదు చేయాల ని డిమాండ్ చేశారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ వి ధంగానే కాంగ్రేస్ ప్రభుత్వం వ్యహరిస్తుందని అగ్ర హం వ్యక్తం చేశారు. గత ఎన్నికల ముందు ఇప్పుడు మంత్రులుగా చేలామణి అవుతున్న భట్టి విక్రమార్క, సీతక్క, కోమటిరెడ్డి వేంకట్‌రెడ్డి, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫార్మాసిటిని రద్దుచేస్తామని గోప్పలు చప్పారు అహమిలు ఎమాయ్యాయని రైతులు ప్రశ్నించారు. రైతుల సమస్యలను పరిష్కార మయ్యే వరకు గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణంకు భూములు ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు తెల్చి చేప్పారు.ఈకార్యక్రమంలో కుర్మిద్ద, కుర్మిద్ద తండా, మర్లకుంట తండా రైతులు పాల్గోన్నారు.



# ఫాం హౌస్‌ల్లో డ్రగ్స్ కల్చర్ తీసుకువచ్చిందే బిఆర్‌ఎస్ నేతలు

తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్ మాఫీయాకు బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కింగ్‌గా వ్యవహరిస్తున్నారని, ఫాం హౌజుల్లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడుగున్నారని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ తెలంగాణ శాసన సభలో బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్న తీరుతో తాము సిగ్గుపడాల్సి వస్తుందని మండిపడ్డారు. ఫాం హౌజుల్లో డ్రగ్స్ కల్చర్‌ను తీసుకువచ్చిన ఘనత బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకే దక్కుతుందని వివరించారు. తెలంగాణ రాష్ట్రం రాకముందుకు డ్రగ్స్ అంటే ఎవరికి తెలిసేది కాదని.. ప్రత్యేక రాష్ట్రం వచ్చాకానే డ్రగ్స్ ములాలు రాష్ట్రంలో ఎరులై పారుతున్నాయని గుర్తు చేశారు. ఫాంహౌజ్‌ల్లో డ్రగ్స్ కల్చర్ తీసుకువచ్చింది మీరు కాదా అని ప్రశ్నించారు. బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన ప్రతిపక్ష హోదాలో ఉన్న బిఆర్‌ఎస్ ప్రభుత్వంతో కలిసి వచ్చి అభివృద్ధి, సంక్షేమానికి తొడ్పాటును అందించాల్సింది పోయి అచ్చోచ్చిన అంబోతుల్లా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన రెవిన్యూ, చెల్లించాల్సిన అప్పులకు ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. అధికారం కొల్పోయామనే అక్కసుతోనే నోటికి వచ్చినట్లు అర్థం పర్థం లేని ఆరోపణలు చేయడం సరైన పద్ధతి కాదని, ప్రజలు అన్ని గమనిస్తున్నారని వివరించారు.

### పారదర్శకంగా ప్రజాపాలన అందిస్తున్నాం

అభివృద్ధి.. సంక్షేమ పథకాలను సమపాలనలో తీసుకువెళ్తు పారదర్శకంగా ప్రజాపాలన అందించడం జరుగుతుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. 2026–27బడ్జెట్‌లో బడుగు బలహీన వర్గాల శ్రేయస్సు కోసం అచరణలో సాధ్యమయ్యే పథకాలకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. ప్రజాపాలన ప్రభుత్వం రాజ్యాంగానికి లోబడి పని చేస్తుందని, విద్య, వైద్య రంగాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచడంతోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. సొంత ఖర్చులతో తాను షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేశానని, దాన్ని చూసిన ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో మధ్యాహ్న భోజనం అంధించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడిల్లో చిన్నారులకు పాలు, రాగీ సంకటి, పౌష్టిక ఆహారం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగించేందుకు మళ్లీ బిఆర్‌ఎస్ యత్నిస్తుందని, కుంభకోణాలు, దుర్మార్గాలు, రాజకీయ హత్యలు, దౌర్జన్యాలను కాం గ్రెస్ ప్రభుత్వం సాగనిస్తలేదని అన్నారు. రాజ్యాంగ ప ర్యంగానే వారిపై చర్యలు తీసుకుంటున్నామని, తెలంగాణ వనరులను పదేళ్లల్లో పీల్చిపిప్పి చేశారని మండిపడ్డారు.

### నేడే గాంధీభవన్‌లో ఒబిసి సెల్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం

తెలంగాణ గాంధీ భవన్‌లో ఒబిసి సెల్ చైర్మన్‌గా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు హాజరవుతున్నట్లు వివరించారు. మీడియా సమావేశంలో మండల పార్టీల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, చలివేంద్రంపల్లి రాజు, వీరేశ్, హరినాథ్‌రెడ్డి, నేతలు బాల్‌రాజ్ గౌడ్, రఘునాయక్‌లు పాల్గొన్నారు.

## చేవెళ్ల మాజీ ఎంపి రంజిత్ రెడ్డికి మాతృ వియోగం

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ గడ్డం రంజిత్ రెడ్డి మాతృమూర్తి జి.చంద్రకళమ్మ ఆదివారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. రంజిత్ రెడ్డి అభిమానులు, పార్టీ శ్రేణులు,కార్యకర్తలు,బంధుమిత్రుల సందర్శనార్థం ఆమె పార్థివ దేహాన్ని వారి జూబ్లీహిల్స్ నివాసంలో ఉంచడం జరిగింది.

**అంతిమ సంస్కారాలు:** నేడు (సోమవారం) మధ్యాహ్నం 12:00 గంటలకు, మహాప్రస్థానం (ఫిలింనగర్) లో నిర్వహించబడతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

## నిత్య వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం



**ప్రజాపక్షం/కొత్తూరు:** ఆరోగ్యమే మహాభాగ్యం.. నిత్య వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ అన్నారు. ఆదివారం కొత్తూరు మున్సిపాలిటిలో ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యచరణ ప్రణాళికలో 2కెరన్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ ఎంతో ఉత్సాహంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఆరోగ్యంపై శ్రద్ధ వహించడం అనివార్యమైందని అన్నారు. ప్రతిరోజు ఉదయం వ్యాయామం, యోగా, రన్నింగ్ వంట అలవాట్లను ప్రతి ఒక్కరు విధిగా అలవర్చుకోవాలని సూచించారు.ప్రభుత్వం చేపట్టిన 99కోజుల ప్రణాళికలో భాగంగా అభివృద్ధి పనులే కాకుండా ప్రజల ఆరోగ్యం, సామాజిక చైతన్యంపై దృష్టి కేంద్రీకరించడం అభినందనీయమన్నారు. కరాటే మాస్టర్లు నరసింహా, శివల ఆధ్వర్యంలో విద్యార్థులు, యువకులు నేర్చుకున్న కుంగ్‌ఫూ, కరాటే శిక్షణలో నేర్చుకున్న మెలుకువలు, విన్యాసాలు చేసి చూపించారు. 2కె రన్, కుంగ్‌ఫూ, కరాటేలో పాల్గొన్న విద్యార్థులు, యువకులకు ప్రజాప్రతినిధులు బహుమతులు అంధించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ బాలాజీ, కౌన్సిలర్లు జె.సుదర్శన్ గౌడ్, హేమా దేవేందర్, కోస్గిశ్రీను, సోమ్లానాయక్, మాధవి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సైకిల్ ఇప్పిస్తానంటూ మహిళను పిలిచి పొలంలో హత్య

ఘటనా స్థలాన్ని పరిశీలించిన డిసిపి శిరీష

రాత్రంతా తల్లి శవం వద్దనే రోదిస్తున్న చిన్నారి మమత




**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** బాలుడికి సైకిల్ ఇపిస్తానంటూ మహిళను పిలిచి వ్యవసాయ పోలంలో దారుణంగా హత్య చేసిన సంఘటన రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. షాద్‌నగర్ డిసిపి శిరీష కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా ఉమ్మడి బాలానగర్ మండలం రంగారెడ్డిగూడ గ్రామానికి చెందిన శోభ అనే మహిళ కోయిల్‌కొండకు చెందిన నర్సింలు తో నాలుగేళ్ల క్రితం రెండవ వివాహం జరిగిందని వివరించారు. వారికి రెండున్నర ఏళ్ల కుమార్తె మమత జన్మించిందని తెలిపారు. ఇటీవల కాలంలో శోభ, నర్సింలు మధ్య తరుచుగా వివాదాలు చోటు చేసుకొవడం తో శోభ పుట్టింటికి వచ్చేసిందని, దాంతో నిత్యం మద్యం సేవించి నర్సిం లు శోభ ఇంటికి వచ్చి ఘర్షణకు పాల్పడేవాడని మృతురాలి తల్లి పోతుల కరుణమ్మ తెలిపారు. ఈనెల 21న ఉదయం శోభకు నర్సింలు ఫోన్ చేసి మొదటి భర్త కుమారుడికి సైకిల్ ఇప్పిస్తానని చెప్పగా శోభ తన రెండున్నర ఏళ్ల మమతతో కలిసి మహబూబ్‌నగర్‌కు వెళ్ళిందని వివరించారు. ఈనెల 22వ తేదిన ఉదయం ఫరూఖ్‌నగర్ మండలం దేవునిపల్లి గ్రామానికి చెం దిన ఎరుకలి గోవింద్ అనే వ్యక్తి పోలంలో శోభ శవమై కనిపించిందని, గ్రామస్తులు ఆదివారం ఉదయం ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలానికి డిసిపి శిరీష, సిఐ సీతారాంతోపాటు పోలీస్ సిబ్బంది హుటాహుటిన చేరుకొని పరిశీలించారు. తల్లి శోభ మృతదేహం వద్ద రాత్రంత చిన్నారి మమత రోధించడం చూపరులను కంటతడి పెట్టించింది. మానవ మృగాన్ని పట్టుకొని కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. మృతదేహన్ని షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్ట నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సీతారం వెల్లడించారు.

## ప్రకృతి పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత : సిఐ




**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** ఈ నెల 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవంను పురష్కరించుకుని జాగృతి అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో చైర్మన్ భావన శ్రీనివాస్ సభాధ్యక్షతన ఆదివారం శ్రీవెంకటేశ్వర వీకర్ సెక్షన్ కాలనీలో కృత్రిమ పిచ్చుకల గూళ్లు, విత్తనాలు, నీటి మూకుడులు, వస్త్ర సంచులు, తులసి మొక్కల ఉచిత పంపిణీ కార్యక్రమంలో వ నస్థలిపురం సిఐ రవిబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రకృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని ఆయన సూచించారు. అభ్యుదయ సంఘం అధ్యక్షులు భవన శ్రీని వాస్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జటావత్ రవి నాయక్, కాలనీ అధ్యక్షులు పా టి రాంబాబు, లక్ష్మ ణాచారి, గోపాల్ దాస్ రాము, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములుకు ఘన నివాళి



**ప్రజాపక్షం/ ఇబ్రహీం-పట్నం :** మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు నిజమైన కమ్యూనిస్టువాదని బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి కొనియాడారు.ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీం పట్నం మండల కేంద్రంలో వైష్ణవి గార్డెన్‌లో సిపిఐ నాయకులు,మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు దశదిన కర్మ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కొండిగారి రాములు కుటుంబా సభ్యులను పరామర్శించి అనంతరం కొండిగారి రాములు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్ళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కొండిగారి రాములు నీతి,నిజాయితీతో సాధరణ జీవితం గడుపుతూ నిరంతరం నియోజక వర్గంలో తాడిత,పీడిత ప్రజల అభివృద్ధికి పాటుబడే గొప్ప కమ్యూనిస్టు నాయకులని పేర్కోన్నారు.ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు.కొండిగారి రాము లు కుటుంబానికి బిఆర్‌ఎస్ అండగా ఉంటుందని హామి ఇచ్చారు.కార్యక్రమంలో నాయకులు సిఎచ్ రమేష్,సుల్తాన్,నిట్టు జగదీష్,కిరణ్ కుమార్,త్రిలోక్ కుమార్,కె భరత్ కుమార్,మడుపు శివా తదితరులు పాల్గోన్నారు.

## నిర్ధవెల్లిలో రంజాన్ వేడుకలు



**ప్రజాపక్షం/కేశంపేట:** పవిత్ర రంజాన్ పర్వదానాన్ని పురస్కరించుకొని ఈద్ మిలాబ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం కేశంపేట మండలం నిర్ధవెల్లి గ్రామంలో ఎండి సిరాజుద్దీన్ స్వగృహంలో ఈద్ మిలాబ్ కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నిర్ధవెల్లి సర్పంచ్ భాస్కర్ గౌడ్, ఉప సర్పంచ్ సపూరా ఆమేర్, వార్డు సభ్యులు నాగరాజు, రమేష్, చంద్రయ్య, చెన్నయ్య, మల్లయ్య, మోహిజ్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.10 వేలు అర్థిక సాయం

**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని మాల్ గ్రామంలో డయాలసిస్‌తో భాదపడుతూ చనిపోయిన మంద లింగం అంత్య క్రీయలకు రూ.10 వేలు అర్థిక సహాయం అంద జేసినట్లు కాంగ్రేస్ పార్టీ యాచారం మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ తెలిపారు. అదివారం అయన మృత దేహంపై పూల మాలలు వేసి నివాళ్ళు అర్పించారు. కాంగ్రేస్ పారల్ట సినియర్ నాయకులు కప్పాటి యాదయ్య తదితరులు పాల్గోన్నారు.



# పంత్‌కు ప్రమోషన్..

## మిడిలార్డర్ బ్యాటర్‌గా విధ్వంసక హిట్టర్..!

ఐపిఎల్ పంతొమ్మిదో సీజన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ రిషభ్ పంత్ బ్యాటింగ్ ఆర్డర్ మారనుంది. నాలుగు, ఐదో స్థానాల్లో ఆడిన పంత్ ఈ ఎడిషన్‌లో మూడో స్థానంలో క్రీజులోకి రానున్నాడు. పవర్ ప్లేలో వికెట్ పడితే.. వేగంగా పరుగులు రాబట్టే బాధ్యతను కెప్టెన్‌కు అప్పగించింది లక్నో యాజమాన్యం. నిరుడు నికోలస్ పూరన్ మూడులో ఆడగా.. ఈసారి పంత్ చెలరేగిపోనున్నాడు. పంతొమ్మిదో సీజన్‌లో కొత్త జెర్సీ, కొత్త లోగోతో లక్నో సూపర్ జెయింట్స్ బరిలోకి దిగుతోంది. ఈసారైనా ఐపిఎల్ ట్రోఫీ గెలవాలనే కసితో ఉన్న లక్నో జట్టు అయోధ్య రాముడిని దర్శించుకుంది కూడా. మెగా టోర్నీకి ఆరు రోజులు ఉన్నందున అన్ని విభాగాలను సరి చూసుకుంటున్న రిషభ్ పంత్ సేన బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పు చేయాలనుకుంటోంది. గత సీజన్‌లో మూడో స్థానంలో ఆడిన నికోలస్ పూరన్‌ను మిడిలార్డర్‌లో ఆడించి.. సారథికి ప్రమోషన్ ఇవ్వాలనుకుంటోంది. మెగా వేలంలో రికార్డు ధర(రూ.27 కోట్లు) పలికిన పంత్‌ను జట్టు అవసరం రీత్యా మూడో స్థానంలో ఆడించాలని లక్నో సూపర్ జెయింట్స్ భావిస్తోంది. 'దూకుడుగా ఆడే పంత్ మూడో స్థానానికి పక్కాగా సరిపోతాడని మేనేజ్‌మెంట్ సహా అతడు భావిస్తున్నాడు. అందుకని ఈ సీజన్‌లో టాపార్డర్‌లో ఎడెన్ మర్క్‌రమ్, మిచెల్ మార్ష్, రిషభ్ పంత్ ఆడుతారు. మిడిలార్డర్‌లో మాత్రం ఈ షరతులేమీ లేవు. ఆ రోజు ఆటను బట్టి ఎవరిని ముందు పంపాలి? అనేది అప్పటికప్పుడు నిర్ణయిస్తాం' అని లక్నో వర్గాలు తెలిపాయి. గత సీజన్‌లో పంత్‌పై భారీ ఆశలు పెట్టుకున్న లక్నోకు తీవ్ర నిరాశే మిగిలింది. 13 మ్యాచుల్లో మోస్తరుగా ఆడిన అతడు ఆఖరి మ్యాచ్‌లో ఆర్‌సిబిపై సెంచరీ(118 నాటౌట్)తో 269 పరుగులు సాధించాడు. ఐపిఎల్ తొలి మ్యాచ్‌లో ఏప్రిల్ 1న ఢిల్లీ క్యాపిటల్స్‌తో లక్నో తలపడనుంది.

తొలిసారి ఐపిఎల్‌లో అందరూ

# భారత కెప్టెన్లే

## 19 ఏళ్లలో ఇదే తొలిసారి!

ఐపిఎల్ 2026 సీజన్‌కు రంగం సిద్ధమైంది. మరో 6 రోజుల్లో ఈ మెగా టోర్నీకి తెరలేవనుంది. మార్చి 28(శనివారం)న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వేదికగా డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సిబి), సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే 10 ఫ్రాంచైజీలు సన్నాహకాలు మొదలుపెట్టాయి. టైటిలే లక్ష్యంగా వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. అయితే ఈసారి ఎన్నడూ లేని విధంగా 10 ఫ్రాంచైజీలు భారత కెప్టెన్లతోనే బరిలోకి దిగుతున్నాయి. ఇలా భారత సారథులతో ఒక సీజన్ ప్రారంభం కావడం 19 ఏళ్ల ఐపిఎల్ చరిత్రలో ఇదే తొలిసారి. పేరుకు ఇండియన్ ప్రిమియర్ లీగ్ అయినా.. విదేశీ ఆటగాళ్ల ఆధిపత్యం ఎంతగా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తుది జట్టులో ఆడేది నలుగురే అయినా.. విదేశీ ఆటగాళ్ల ప్రభావం ఈ లీగ్‌పై ఎక్కువగానే ఉంటుంది. పలువురు విదేశీ ఆటగాళ్లు కెప్టెన్లుగా కూడా వ్యవహరించారు. కానీ గత 18 సీజన్ నుంచి ఉన్న ఒరవడికి ఈసారి మాత్రం తెరపడింది. తొలిసారి భారత ఆటగాళ్ల సారథ్యంలో 10 ఫ్రాంచైజీలు బరిలోకి దిగుతున్నాయి. పలువురు విదేశీ కెప్టెన్లు గాయపడటంతో ఇది సాధ్యమైంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ మోకాలి గాయంతో ఐపిఎల్ ఆరంభ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. దాంతో ఇషాన్ కిషన్‌ను తాత్కలిక సారథిగా సన్‌రైజర్స్ హైదరాబాద్ నియమించింది. మిగతా 9 జట్లకు భారత ఆటగాళ్లే సారథులుగా ఉండటంతో.. ఈ సీజన్‌లో విదేశీ ఆటగాడు కెప్టెన్‌గా లేకుండా పోయాడు.



## ఐపిఎల్‌కు ఆకాశ్‌దీప్ పూర్తిగా దూరం

**కోల్‌కతా:** ఐపిఎల్ మాజీ చాంపియన్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు దెబ్బ మీద దెబ్బ పడుతూనే ఉన్నది. ఇప్పటికే గాయం కారణంగా హర్షిత్ రానా లీగ్‌కు పూర్తిగా దూరం కాగా, తాజా ఈ జాబితాలో యువ పేసర్ ఆకాశ్‌దీప్ చేరాడు. వెన్నెముక గాయంతో ఆకాశ్‌దీప్ ఎనిమిది వారాల పాటు ఆటకు దూరం కానున్నాడు. దీంతో ఈనెల 28 నుంచి మొదలయ్యే ఐపిఎల్‌తో పాటు స్వదేశం వేదికగా ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగే ఏకైక టెస్టుకు ఆకాశ్‌దీప్ అందుబాటులో లేకుండా పోయాడు. 'ఆకాశ్‌దీప్ వెన్నెముక కింది భాగంలో గాయమైంది. పూర్తి స్థాయిలో కోలుకునేందుకు ఎనిమిది నుంచి 12 వారాల సమయం పడుతుంది. ఈ కారణంగా ఐపిఎల్‌తో పాటు ఆఫ్ఘనిస్థాన్‌తో టెస్టుకు అతను ఎం పికయ్యే అవకాశాలు లేవు'అని శనివారం బిసిసిఐ వర్గాలు పేర్కొన్నా యి. చివరిసారి రంజీ ట్రోఫీలో జమ్మూ కశ్మీర్‌తో సెమీఫైనల్ మ్యాచ్ ఆడిన ఈ 29 ఏండ్ల యువ పేసర్ అప్పటి నుంచి ఆటకు దూరమయ్యాడు.

ఆరోగ్యం




# ఊడే పళ్లు... బోసి నవ్వు..

వయసుతోపాటు పళ్లు ఊడడం సహజం. ఈ సమస్య లేని వారు చాలా అరుదు. ఊడే పళ్లు.. బోసి నవ్వే వయసు మీరిన వారి ప్రత్యేకతలు. ఇప్పటికీ మన సమాజంలో చాలామంది నమ్మే విషయం ఒక వయసు రాగానే అందరికీ దంతాలు వూడిపోతాయనీ, నోరు బోసిపోవటం తథ్యమనీ! ఇది చాలా తప్పు. చిన్న వయసు నుంచీ చక్కటి నోటి ఆరోగ్య పద్ధతులు పాటిస్తూ ఉన్న వారికి వృద్ధాప్యంలో పళ్లు వూడిపోవు. నోటిని ఆరోగ్యంగా ఉంచుకోవటం, చక్కటి ఆహారం తీసుకోవటం ఈ రెండూ పాటిస్తే జీవితాంతం మన దంతాలు మనతోనే ఉంటాయని వైద్యరంగం ఎప్పటి నుంచో చెబుతోంది. రోజూ రెండు పూట్లా బ్రషింగ్ చేసుకోవటం, చక్కగా నములుతూ ఆహారం తీసుకోవటం, ఆహారం తీసుకోగానే నోటిని శుభ్రపరచుకోవటం, అప్పుడప్పుడు దంత వైద్యులకు చూపించుకుని దంతాల మీద గార పేరుకుంటే దాన్ని తొగించేందుకు స్కేలింగ్ చేయించుకోవటం.. ఈ జాగ్రత్తలు తీసుకుంటే చాలు! చిగుళ్ల వాపు, చిగుళ్ల నుంచి రక్తం చిమురుస్తుండటం వంటి సమస్యలు తలెత్తితే వెంటనే దంతవైద్యులకు చూపించుకుని చికిత్స తీసుకోవటం చాలా అవసరం. చిగుళ్ల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే దంత మూలం బలహీనపడి, దంతాలు వూడిపోయే అవకాశాలు పెరుగుతాయి. దంతాలు వూడితే ఆహారం తీసుకోవటం కష్టంగా తయారై, పోషకాహారం తినలేని పరిస్థితులూ తలెత్తుతాయి. దీనివల్ల మొత్తం ఆరోగ్యమే దెబ్బతింటుంది. అలాగే వయసు పెరిగిన కొద్దీ నోరు పొడిబారటం ఎక్కువ అవుతుంది, దీని వల్ల దంతాల మీద రంధ్రాలు పడటం, చిగుళ్ల బాధల వంటివీ పెరుగుతాయి. కాబట్టి చిగుళ్ల సమస్యలు, దంతాలు పుచ్చిపోవటం, జివ్వుమనటం వంటి సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్యులను చూపించుకుని, వాటిని చక్కదిద్దుకోవాలి. ఒకవేళ దంతాలు వూడినా ఇప్పుడు సమర్థమైన, శాశ్వతమైన కృత్రిమ దంతాలు (ఇంప్లాంట్స్) అమర్చే అవకాశం ఉంది కాబట్టి వృద్ధాప్యంలో దంత సమస్యలతో ఇబ్బందులు పడాల్సిన అవసరమే లేదని గుర్తించాలి. సాధారణ ఆరోగ్యం బాగుండేందుకు కూడా ఇది కీలకం!

# అరుదైన కేన్సర్‌కు.. విజయవంతమైన చికిత్స

ఒక అరుదైన, తీవ్రమైన కేన్సర్ కారణంగా ఆహారం మింగలేని పరిస్థితికి చేరుకున్న 14 ఏళ్ల బాలికకు వైద్యులు కొత్త జీవితం ఇచ్చారు. ఈ బాలికకు వచ్చిన వ్యాధి సాధారణ కేన్సర్ కాదు. ఇది 'సిగ్నెట్ రింగ్ సెల్ కార్సినోమా' అనే అత్యంత దూకుడుగా వ్యాపించే రకం. ఈ కేన్సర్ ఆమె శరీరంలో ఆహార నాళం (ఈసోఫేగస్), కడుపు కలిసే ప్రాంతమైన గాస్ట్రోఈసోఫేజియల్ జంక్షన్ వద్ద ఏర్పడింది. ఈ భాగం శరీరంలో చాలా కీలకమైనది కాబట్టి, ఇక్కడ కేన్సర్ రావడం చికిత్సను మరింత సంక్లిష్టంగా మారుస్తుంది. ఈ వ్యాధి కారణంగా బాలికకు ఆహారం మింగడం చాలా కష్టమైంది. దీని వల్ల ఆమె దైనందిన జీవితం పూర్తిగా దెబ్బ తింది, శరీరానికి అవసరమైన పోషకాలు అందక బలహీనత పెరిగింది. ఈ పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఢిల్లీలోని మణి పాల్ హాస్పిటల్ ద్వారక శాఖకు తీసుకువెళ్లారు. అక్కడ వైద్యులు పూర్తి స్థాయి పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా బయాప్సీ పరీక్ష ద్వారా కేన్సర్ ఉన్నట్టు నిర్ధారించారు. సాధారణంగా కడుపు, ఆహారనాళ కేన్సర్లు ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా కనిపిస్తాయి. కానీ చిన్నపిల్లల్లో ఇవి చాలా అరుదు. ముఖ్యంగా పెద్దవారిలో కనిపించే జీవనశైలి కారణాలు (ఉదాహరణకు ఆహారపు అలవాట్లు, పొగ తాగడం) చిన్నవారిలో ఉండవు. అందువల్ల ఈ వయస్సులో ఇలాంటి కేన్సర్ రావడం వైద్యపరంగా చాలా సవాలుగా భావించబడుతుంది. చికిత్సలో భాగంగా మొదట బాలికకు శస్త్రచికిత్సకు ముందు ఐదు దఫాల కెమోథెరపీ ఇచ్చారు. ఇది ట్యూమర్ పరిమాణాన్ని తగ్గించడానికి, శస్త్రచికిత్సను సులభతరం చేయడానికి ఉపయోగపడుతుంది. ఈ దశలో ఆమె శరీరం చికిత్సకు బాగా స్పందించింది. తర్వాత ఆంకాలజీ నిపుణుల బృందం రోబోటిక్ సర్జరీ నిర్వహించింది. ఈ రోబోటిక్ శస్త్రచికిత్స అత్యంత ఖచ్చితత్వంతో జరుగుతుంది. ఫలితంగా వైద్యులు కేన్సర్ ఉన్న భాగాన్ని, సమీప లింఫ్ నోడ్స్‌ను తొలగిస్తూ, చుట్టూ ఉన్న ముఖ్య అవయవాలను కాపాడగలిగారు. గాస్ట్రోఈసోఫేజియల్ జంక్షన్ వంటి సున్నితమైన ప్రాంతాల్లో ఇది చాలా ముఖ్యమైన అంశం. డాక్టర్లు చెప్పిన ప్రకారం, ఈ ప్రాంతంలో కేన్సర్‌ను పూర్తిగా తొలగించడం కష్టం. ఎందుకంటే అది త్వరగా ఇతర అవయవాలకు వ్యాపించే ప్రమాదం ఉంటుంది. సిగ్నెట్ రింగ్ సెల్ కార్సినోమా చాలా వేగంగా పెరిగే కేన్సర్ రకం. అందువల్ల దీనిని నియంత్రించడం, సరైన విధంగా చికిత్స చేయడం పెద్ద సవాలు. అయినప్పటికీ, ఆధునిక వైద్య సాంకేతికతల వల్ల ఇలాంటి క్లిష్ట కేసుల్లో కూడా మంచి ఫలితాలు సాధ్యమవుతున్నాయి. చికిత్స అనంతరం బాలిక ఆరోగ్యం మెరుగుపడింది. ముఖ్యంగా ఆమె మళ్లీ ఆహారం తినగలగడం ప్రారంభించింది. ఇది ఆమె శారీరక బలాన్ని తిరిగి పొందడానికి సహాయపడింది. వైద్యుల పర్యవేక్షణలో ఆమె కోలుకుంటోంది. ఆమె ధైర్యం కూడా ఈ విజయానికి ఒక ముఖ్య కారణమని వైద్యులు పేర్కొన్నారు. ఈ సంఘటన మనకు రెండు ముఖ్యమైన విషయాలు గుర్తుచేస్తుంది. మొదట, అరుదైన వ్యాధులు అయినప్పటికీ, వాటిని సమయానికి గుర్తిస్తే చికిత్స సాధ్యమే. రెండవది, ఆధునిక వైద్య సాంకేతికతలు, ప్రత్యేకించి రోబోటిక్ సర్జరీలు కష్టమైన పరిస్థితుల్లో కూడా ప్రాణాలను కాపాడగలుకుతాయి. భారత దేశం వైద్య రంగంలో మెరుగైన అభివృద్ధి సాధిస్తున్నదనడాకి ఇది తాజా ఉదాహరణ.



# ఏప్రిల్ 1 నుండి ఇంటింటికీ సిపిఐ

## సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణ శంకర్ పిలుపు

**ప్రజాపక్షం / మంచిర్యాల :** వచ్చే నెల 1 నుండి 10వ తేదీ వరకు నిర్వహించే 'ఇంటింటికీ సిపిఐ' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల దాసు అధ్యక్షతన జరిగిన సిపిఐ మంచిర్యాల జిల్లా సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కలవేన శంకర్ మాట్లాడుతూ పది రోజుల పాటు నిర్వహించే ఇంటింటి ప్రచారంలో పార్టీ నిధి సేకరణను ముమ్మరం చేయాలని కార్యకర్తలకు సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతామని, ప్రతి నియోజక వర్గంలోనూ అభ్యర్థులను బరిలోకి దించుతామని ధీమా వ్యక్తం చేశా రు. అంతర్జాతీయ పరిణామాలపై స్పందిస్తూ.. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న దురాక్రమణ యుద్ధాన్ని తక్షణమే విరమించాలని, ఇతర దేశాలపై ఆంక్షలు విధించే వైఖరిని మానుకోవాలని హితవు పలికారు. సింగరేణి సంస్థ మను గడను కాపాడుకునేందుకు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆధ్వర్యంలో నూతన భూగర్భ గనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. 'సేవ్ సింగరేణి' నినాదంతో ఈ నెల 18న శ్రీరాంపూర్‌లో ప్రారంభమైన జాతా ఈ నెల 30 వరకు గనుల వ్యాప్తంగా కొనసాగుతుందని వివరించారు. ఈ నెల 30న కొత్తగూడెం ప్రధాన కార్యాలయం ముట్టడితో ఉద్యమం పతాక స్థాయికి చేరుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, రేగుంట చంద్రశేఖర్, దాగం మల్లేష్, ఇప్పకాయల లింగయ్య, ముస్కె సమ్మయ్య, చిప్ప నర్సయ్య, అడేపు రాజ మొగిలి, కామెర దుర్గా రాజు, మిట్టపల్లి పౌల్, మిర్యాల రాజేశ్వర్ రావు, బొంతల లక్ష్మి నారాయణ, కొండు బానేష్ పాల్గొన్నారు.



# రాజ్యాంగం కల్పించిన హక్కుల సాధనకు పోరాడాలి

## సిపిఐ మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య

**ప్రజాపక్షం/హనుమకొండ :** భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, అవకాశాలు కల్పించినప్పటికీ, వాటి అమలులో ఇంకా అనేక లోపాలు ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య అన్నారు. దళితులు, బలహీన వర్గాలు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులను సాధించుకోవాలంటే ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం డిహెచ్‌పిఎస్ జిల్లా మహాసభల ప్రారంభం సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ జెండాను ఆవిష్కరించారు. దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్ ) హనుమకొండ జిల్లా 2వ మహాసభలు నిమ్మల మనోహర్ అధ్యక్షతన ఆదివారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే పోతరాజు సారయ్య హాజరై మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ వంటి విలువలు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా, ప్రతి వ్యక్తి జీవితంలో అమలవ్వాలని ఆయన పేర్కొన్నారు. కానీ వాస్తవ పరిస్థితుల్లో దళితులపై వివక్ష, దాడులు, భూసంబంధ సమస్యలు ఇంకా కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వాలు దళిత సంక్షేమానికి కేటాయించిన నిధులను పూర్తిగా వినియోగించి, విద్య, ఉపాధి, భూహక్కులు వంటి రంగాల్లో దళితుల అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీస్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, బాధితులకు తక్షణ న్యాయం కల్పించాలని కోరారు. దళిత యువత విద్యలో ముందుకు రావడం, చైతన్యంతో హక్కుల కోసం పోరాడడం అవసరమని సారయ్య సూచించారు. సమాజంలో సమానత్వం సాధించాలంటే ప్రతి ఒక్కరూ రాజ్యాంగ విలువలను గౌరవించాలని పిలుపునిచ్చారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరుపాక అనిల్ కుమార్ మాట్లాడుతూ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర రెండవ మహాసభలు ఏప్రిల్ 17,18 వరంగల్ నగరంలో జరగనున్నాయని ఆయన అన్నారు. ఈ మహాసభలకు 33 జిల్లాల నుండి 500 ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ మహాసభల్లో రాష్ట్రవ్యాప్తంగా దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల చర్చించి భవిష్యత్తు కార్యచరణ రూపొందించుకుంటామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టేపాక రవి, నాయకులు రెంటాల దేవా, రాజారపు రత్నం, సందీప, భరత్ తదితరులు పాల్గొన్నారు.అనంతరం డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులుగా రాజారపు రత్నం,జిల్లా ప్రధాన కార్యదర్శిగా నిమ్మల మనోహర్ ను ఎన్నుకున్నారు.



## బిజెపి ప్రభుత్వ అండతో పేట్రేగిపోతున్న

# మతోన్మాద శక్తులు

## సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** భారతదేశంలో రోజురోజుకు మతోన్మాద శక్తులు బిజెపి ప్రభుత్వ అండతో పెట్రాకి పోతున్నాయని, ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం హెచ్చరించారు.ఆదివారం దళిత హక్కుల పోరాట సమితి డిహెచ్‌పిఎస్ పెద్దపల్లి జిల్లా రెండవ మహాసభ జిల్లా కేంద్రంలో కందుకూరి రాజారత్నం అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, కవ్వంపల్లి స్వామి, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ నాయకులు స్వామి పతాక ఆవిష్కరణ చేసిన అనంతరం ముఖ్య అతిధులు సదానందం,లక్ష్మణ్‌లు దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) జిల్లా మహాసభలను ఉద్దేశించి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు కల్పించవలసిన ప్రభుత్వాలు ప్రైవేటు రంగాలలో రిజర్వేషన్లు కల్పించుటకు తగిన చర్యలు తీసుకోవడం లేదని, రిజర్వేషన్‌లో ఉనికికే ప్రమాదం పొంచి ఉందనీ, రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలు దళితుల అభివృద్ధికి చట్టబద్ధంగా కేటాయించవలసిన 20 శాతం నిధులను ఏనాడు కేటాయించలేదనీ, కేటాయించిన కొద్దిపాటి నిధులను కూడా దళితుల అభివృద్ధికి ఉపయోగించకుండా ఇతర పథకాలకు దారి మళ్లించుతున్నారన్నారు. స్వాతంత్రం వచ్చి దాదాపు 76 సంవత్సరాల స్వతంత్ర పరిపాలనలో దళితులకు ఒరిగిందేమీ లేదని, నేటికీ దళితులపై జరుగుతున్నటువంటి దాడులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్ట లేక పోతున్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులపై స్టేషన్ బేలు ఇవ్వకుండా ఈ కేసులను చట్ట పరంగా కఠినంగా శిక్షలు విధిస్తే గాని, దళితులపై జరుగుతున్న దాడులు పునరావృతం కాకుండా పోతాయని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్నా అప్పటికి మేనిఫెస్టోలో పెట్టినటువంటి అంబేద్కర్ హస్తం కింద దళితులకు రూ.12 లక్షలు నేటికీ ఇవ్వలేదనీ ,అలాగే ఇందిరమ్మ ఇళ్లలో ఇండ్లు లేని పేదలు దళితులే దాదాపు నూటికి 80 శాతం ఉన్నారనీ, ఇందిరమ్మ ఇండ్లలో మొదటి ప్రాధాన్యత దళితులకు ఇవ్వాలన్నారు. వరంగల్‌లో ఏప్రిల్ 17,18, తేదీలలో జరిగే దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర రెండవ మ హాసభలను దళితులు మేధావులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆరెపల్లి మానస్ కుమా ర్, కల్లేపల్లి నవీన్, తాళ్లపల్లి సురేందర్, సతీష్, తదితరులు భారీగా హాజరయ్యారు.



# గుడిసె వాసులకు ఇండ్ల పట్టాల సాధనకు 'చలో హైదరాబాద్'

## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి

**ప్రజాపక్షం/హసన్ పర్తి :** దేశానికి స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు గడిచినప్పటికీ పేదలు మరింత పేదలుగా, ధనవంతులు మరింత ధనవంతులుగా మారినారు తప్ప నేటికీ స్వరాజ్య ఫలాలు దళితులకు, బహుజనులకు, కష్టజీవులైన కార్మిక వర్గానికి స్వతంత్ర ఫలాలు దక్కలేదని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం హసన్ పర్తి మండలం వంగపాడు గ్రామంలో దోమ మధున అధ్యక్షతన జరిగిన సమావేశమునకు ముఖ్య అతిథులుగా హాజరైన నేదునూరి జ్యోతి మాట్లాడుతూ బహుజను లు దళితులు సెంటు భూమిలేని నిరుపేదలకు గుడిసెలు వేసుకున్న స్థలంలోనే ఇండ్ల పట్టాలు ఇచ్చి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేయ డం జరిగింది. 6 గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి అవి వారంటీలు మాత్రమే వాటి గడువు తీరిపోయిందనే విధానంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో నేటికీ కోటి యాభై లక్షల మందికి ఇంటి స్థలం లేక నివాసాలు లేక ఇంటి కిరాయిలు కట్టలేక కుటుంబాలను పోషించుకోలేక అనేక కష్టనష్టాలు పడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. హైదరాబాదులోని ఇందిరా పార్కు వద్ద మేడ్చల్, రంగారెడ్డి, వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, ఖమ్మం తదితర జిల్లాలలో గుడిసెలు వేసుకొని సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇంటి పట్టా నివాస స్థలం కేటాయించాలని ధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ జిల్లాలలో పేదలు, దళితులు, మురికి కుంటల్లో అనారోగ్యానికి గురవుతూ 15 సంవత్సరాలుగా నివాస స్థలాలకై నిరంతరం ఎర్రజెండా సిపిఐ ఆధ్వర్యంలో పోరాడుతున్నారని, వీరందరికీ పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ చలో ఇందిరా పార్క్ మహాధర్నా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ బహిరంగ యుద్ధానికి గుడిసె వాసులు, దళితులు, బహుజనులు నిరుపేద కష్టజీవులు హాజరై జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ మహా ధర్నాకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి తదితరులు పాల్గొననున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మోతె లింగారెడ్డి దొమ్మాట ప్రవీణ్ కుమార్, నేదునూరి రాజమౌళి, మాలోతు శంకర్, ఎల్లయ్య, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



# యువత భగత్ సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి : యానాల

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** నేటి యువత భగత్ సింగ్ ఆశయాలను ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యతను భుజానికెత్తుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. యాదగిరిగుట్ట పట్టణంలోని న్యూ గుండ్లపల్లి గ్రామంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 95వ వర్ధంతిని పురస్కరించుకొని రెండు రోజుల పాటు నిర్వహించిన వాలిబాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని బహుమతులు ప్రధానం చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కేవలం 23 ఏళ్ల ప్రాయంలోనే దేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ సామ్రాజ్యవాదులను ఎదిరించి, చిరునవ్వుతో ఉరికొయ్యను ముద్దాడిన వీరుల త్యాగాలు వెలకట్టలేనివని కొనియాడారు. నేటి యువత గంజాయి, మాదక ద్రవ్యాల వంటి చెడు అలవాట్లకు బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని దామోదర్ రెడ్డి హితవు పలికారు. భగత్ సింగ్ వంటి పోరాట యోధుల స్ఫూర్తితో ప్రజాసేవకు అంకితం కావాలని కోరారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు మాట్లాడుతూ స్టాప్ డ్రగ్స్ స్టార్ట్ స్పోర్ట్స్ అనే నినాదంతో అఖిల భారత యువజన సమైక్య (ఎఐవైఎఫ్) యువతను క్రీడల వైపు మళ్లించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. యువత ఉన్నత చదువులు చదివి, క్రీడల్లో రాణించి దేశ భవిష్యత్తులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి మల్లాపురం టీం(దాత: యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు చుక్కల సత్యం), న్యూ గుండ్లపల్లి టీం (దాత: బైరగాని జంగయ్య). శెట్టి నరసింహా యాదవ్ రాయగిరి పాండు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరు రాజయ్య, బండి జంగమ్మ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పెరబోయిన మహేందర్, పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, మాజీ కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## అక్రమంగా ఇసుక తరలింపు..

కేసు నమోదు



**ప్రజాపక్షం/మాగనూరు :** మాగనూరు మండల పరిధిలోని నేరడగం గ్రామ శివారులో గల బూర్గం వాగు దగ్గర నుండి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ట్రాక్టర్‌కు ఇసుకను నింపుతుండడంతో మాగనూరు పోలీసులు పట్టుకొని స్టేషన్‌కి తరలించారు. ఇసుక తరలిస్తున్న లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్సై అశోక్ బాబు తెలిపారు. మాగనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## వైద్య విద్యార్థికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మారేపల్లి సురేందర్ రెడ్డి ఫౌండేషన్ ద్వారా పేద వైద్య విద్యార్థికి రూ.2.10 లక్షల ఆర్థిక సాయం అందించారు. ఆదివారం మహబూబ్‌నగర్ 38వ డివిజన్‌కి చెందిన బి.వెంకటేశ్వర్లు, లావణ్య దంపతుల కుమార్తె భాగ్య లక్ష్మి వైద్య విద్య అభ్యస్తున్నారు. ప్రస్తుతం 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థినికి కళాశాల, హాస్టర్ వసతి నిమిత్తం ఈ అమౌంట్ ను మహబూబ్ నగర్ వసతి నిమిత్తం ఈ అమౌంట్ ను మహబూబ్ నగర్ మున్సిపల్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి కూతురు, ఎంఎస్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ మారేపల్లి మహతి రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో విద్యార్థినికి అందించారు. ఈ సందర్భంగా మహతి రెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి విద్యానిధి కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకుని పేద విద్యార్థులను ఈ ఫౌండేషన్ ద్వారా ఆదుకుంటున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు ఈ ఫౌండేషన్ ద్వారా చేపడతామనని ఆమె తెలిపారు. మా నాన్న సురేందర్ రెడ్డి సహకారంతో జిల్లాలోని పేద విద్యార్థులకు ఏ కష్టం వచ్చినా ఈ ఫౌండేషన్ వారికి అండగా ఉంటుందన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/వెల్దండ :** మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఎన్ఆర్ ఈజీఎస్ నుంచి మంజూరైన సీసీ రోడ్డు పనులను సర్పంచ్ కేశమల్ల అనూష కృష్ణ, స్థానిక నాయకులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహం నుంచి భయ్యా బంగారు ఇంటి వరకు రూ. 3.లక్షల 50 వేల రూపాయల వ్యయంతో సీసీ రోడ్డును నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అదేవిధంగా నగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిల సహకారంతో మండలంలోని పెద్దాపూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అని సర్పంచ్ అనూష కృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ ప్రసాద్ చారి వార్డు సభ్యులు గంగాపురం రమేష్, నిరంజన్, మమత అనిల్ కుమార్, తిరుపతి నాయక్, తక్కెళ్ళపల్లి లలిత మల్లయ్య, రజినీ జానీ నాయక్,కాటిక ఆంజయ్య, పల్సం శ్రీధర్ గౌడ్, జక్కుల మల్లేష్ యాదవ్, వార్డులో ప్రజలు పాల్గొన్నారు.

## వైష్ణవి మృతికి కారకులను శిక్షించాలి

బేడ బుడగ జంగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూపం ఈశ్వర్

**ప్రజాపక్షం/కొత్తకోట :** బేడ బుడగ జంగం కులంలో పుట్టి యూట్యూబ్ రీల్స్ చేస్తూ చాలా ఫేమస్ అయిన గంధం వైష్ణవి మృతికి కారకులైన భర్త, అత్త ను కఠినంగా శిక్షించాలని, బేడ బుడగ జంగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ధూపం ఈశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూట్యూబ్ రీల్స్ చేస్తూ చాలా ఫేమస్ అయిన వైష్ణవి మృతికి కారకులైన భర్త, అత్తను జగిత్యాల జిల్లా చుట్టుపక్కల ప్రాంతాల సంఘ నాయకులు వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు.

## పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ వర్క్‌షాప్




**ప్రజాపక్షం/నారాయణపేట్ :** భారతీయ జనతా పార్టీ నారాయణపేట జిల్లాలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ 2026 జిల్లా కార్యశాల జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలు విద్యాసాగర్ రెడ్డి, సోల్కర్, సీనియర్ నాయకులు బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ రాష్ట్ర నాయకులు రతంగ్ పాడు రెడ్డి, బీజేపీ జిల్లా ఇంచార్జీ బొకర్క బలరెడ్డి, బీజేపీ కొడంగల్ నాయకులు పూనమ్ చంద్ లాహోటి, బంటు రమేష్ బీజేపీ నారాయణపేట మున్సిపల్ చైర్మన్ కొండ శ్వేతా, వైస్ చైర్మన్ మంజుల రెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, సర్పంచులు, వార్డు మెంబర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

## నేడు రైతుల ఖాతాల్లోకి నిధులు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా నిధులను తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసినట్లు మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ అధికారి బి.వెంకటేష్ తెలిపారు. రాజాపూర్ మండలంలోని రంగారెడ్డి గూడ గ్రామంలో ఆదివారం రైతు వేదిక వద్ద జిల్లా వ్యవసాయ అధికారి బొవోల్ల వెంకటేష్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 2 లక్షల 15 వేల 923 మంది రైతులకు ఎకరానికి రూ.6 వేల చొప్పున మొదటి విడతగా వారి ఖాతాల్లో సోమవారం జమ కానున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి దీపిక, రంగారెడ్డి గూడెం సర్పంచ్ కాటేపగ రేవతి ఆనంద్, గుండ్ల పొట్లపల్లి సర్పంచ్ మడమోని మాసయ్య, అగ్రహారం పొట్లపల్లి సర్పంచ్ ఆలోనిపల్లి అనిత సత్యనారాయణ, ఖానాపూర్ సర్పంచ్ పూజారి శేఖర్, వివిధ గ్రామాల వార్డు సభ్యులు రైతులు వెంకటయ్య, యాదయ్య, అంతయ్య, ఆంజనేయులు, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

# చెరువు అలుగుల పునరుద్ధరణ వేగవంతంగా పూర్తి

అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి



**ప్రజాపక్షం/వనపర్తి న్యూ టౌన్ :** వనపర్తి పట్టణం 12వ వార్డు రాజునగరంలోని చెరువు అలుగుల పునరుద్ధరణ వేగవంతంగా పూర్తవాలని, అదేవిధంగా చెరువులోని మురికి నీరును గ్రామం వెలుపల వదిలివేషణ ఏర్పాటు చేయాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అధికారులను ఆదేశించారు. ఎన్నో సంవత్సరాలుగా సమస్యను విన్నవించిన ఎవరు పట్టించుకోలేదని నేడు మీరు పట్టించుకుని పునరుద్ధరించడం హర్షించదగ్గ విషయమని గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రామంలో నిర్మించిన పల్లె దావాఖన నిరుపయోగంగా ఉండడాన్ని గమనించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే దవాఖానను ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. వడ్డేవాడలో ఉన్న ఆంజనేయ స్వామి గుడి నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన ఆయ గుడి నిర్మాణ స్వీకారం తనవంతు సహాయ సహకారాలు అందిస్తారని హామీ ఇచ్చారు. ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో ఉన్న పెద్ద మురికి కాలువ ప్రమాదకరంగా ఉందని అధికారులు వెంటనే పరిశీలించి తగిన చర్యలు చేపట్టగానే ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నక్క రాణి రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, న్యాయవాది బుచ్చన్న, మాజీ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నక్కరాజు, వార్డు అధ్యక్షులు గౌడుగు రామకృష్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాగిరెడ్డి, కొత్తగొల్ల శ్రీనివాసులు, నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కందూరు గోపాల్, సింగిల్ విండో డైరెక్టర్ సంజీవ్ సాగర్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, వడ్డే శ్రీనివాసులు, ముద్దంగుల రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇవి వాహనాలపై భారీగా సబ్సిడీ

రూ.1 లక్ష బండిపై 90 శాతం సబ్సిడీ

**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లాలోని నిరుద్యోగ ఎస్సీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు అవకాశం కలిపించిందని షెడ్యూలు కులాల సంక్షేమ శాఖ ఈడి అబ్దుల్ ఖలీల్ ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఎలక్ట్రిక్ వాహనాల (ఈవి) కొనుగోలుపై భారీ సబ్సిడీని ఈ పథకం ద్వారా స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సబ్సిడీలను అందజేస్తోంది. 2 వీలర్ వాహనాల కొనుగోలుపై వాహనాలపై 70 శాతం వరకు సబ్సిడీ వర్తిస్తుంది. అర్హులైన అభ్యర్థులు దరఖస్తు చేసుకునేటప్పుడు కుల ధృవీకరణ పత్రం ఎస్సీ వర్గానికి చెందినవారై ఉండాలి. ఉదాయ ధృవీకరణ పత్రం, ప్రభుత్వ నిబంధనల మేరకు ఉండాలి, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. ఆసక్తిగల అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ 1ఎక్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు ప్రక్రియ మార్చి 17 నుంచి మార్చి 24వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అర్హులైన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



## నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల కేంద్రంలో స్థానిక వీరభద్ర దేవాలయం దగ్గర ఆదివారం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీలో గౌరవ అధ్యక్షులుగా ఆవుటి సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా జాజిమి వీరప్ప, కోశాధికారిగా ఉల్లి బాలరాజ్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. సెంట్రల్ కమిటీ మెంబర్‌గా గాజుల శివకుమార్‌ను ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీకి ముఖ్య సలహాదారులుగా వీరభద్రప్ప , ఏ.శ్రీశైలం, సుంకరి రాచప్ప, గాజుల నారాయణ స్వామిని ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

## మున్సిపల్ చైర్మన్‌కు బాల్య మిత్రుల ఘన సన్మానం



**ప్రజాపక్షం/పెబ్బేరు :** అధికార హోదా తాత్కాలికమని, చిన్ననాటి స్నేహం శాశ్వతమని మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వల్లపు రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఎస్ఎస్‌సి 1986–87 బ్యాచ్ చిన్ననాటి మిత్రుల ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస గౌడ్‌కి ఘనంగా అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మిత్రులంతా కలిసి చైర్మన్ దంపతులకు గజమాల శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం జరిగిన సభలో మిత్రులు మాట్లాడుతూ తమలో ఒకరు మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతాయుతమైన పదవిని చేపట్టడం గర్వకారణమని ఆనందం వ్యక్తం చేశారు. స్కూల్ రోజుల్లోనే అక్కి శ్రీనివాస్ రెడ్డి నాయకత్వ లక్షణాలను ప్రదర్శించేవాడని, ఈ రోజు అదే పట్టుదలతో ప్రజలకు సేవ చేసే స్థాయికి ఎదగడం అభినందనీయమని కొనియాడారు. సన్మాన గ్రహీత మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తన ఎదుగుదలకు వెన్నంటి నిలిచిన స్నేహితులను ఎప్పటికీ మరువలేనవి భావోద్వేగానికి లోనయ్యారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంతో బిజీగా ఉన్నప్పటికీ, మిత్రుల పిలుపు మేరకు ఇక్కడికి రావడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మిత్రులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ సరదాగా గడిపారు.

# చేనేత రుణమాఫీ అందరికీ వర్తింపచేయాలి



మంత్రి వాకిటి శ్రీహరికి నేతన్నల వినతి

**ప్రజాపక్షం/అమరచింత :** చేనేత రుణమాఫీ ప్రభుత్వం ప్రకటించి కొందరికి మాత్రమే అమరచింత మున్సిపాలిటీలోని నేతన్నలకు రుణమాఫీ జరిగిందని, మిగతా కార్మికులందరికీ రుణమాఫీ అయ్యేటట్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరికి ఆదివారం మక్తల్ నియోజకవర్గం కేంద్రంలోని మినిస్టర్ క్యాంపు కార్యాలయంలో చేనేత కార్మికులు వినతిపత్రాన్ని సమర్పించారు. అమరచింతలోని 250 మంది చేనేత కార్మికులు బ్యాంకులో క్యాష్ క్రెడిట్ కింద 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు చేనేత రుణాలను తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత రుణమాఫీ ప్రకటించి రెండు సంవత్సరాల గడిచిపోయిన నేటికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ జరగడం లేదని కార్మికులు రాష్ట్ర మంత్రికి విన్నవించారు. అమరచింత పట్టణంలో ఇప్పటివరకు రెండు దఫాలుగా రుణమాఫీ జరిగిందని, కానీ అర్హులైన చేనేత కార్మికులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరగలేదని విచారం వ్యక్తం చేశారు. ఇంకా 100 కు పైగా చేనేత కార్మికులకు రుణమాఫీ జరగాల్సిన అవసరం ఉందని తప్పకుండా రాష్ట్రమంత్రి వాకిటి శ్రీహరి స్పందించి చేనేత కార్మికులకు రుణమాఫీ జరిపి న్యాయం చేయగలరని, కార్మికులు విన్నవించారు. పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, యువజన, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పందించి తక్షణమే కార్మికులందరికీ రుణమాఫీ అయ్యేటట్లు ఏర్పాట్లు చేస్తానని కార్మికులకు హామీ ఇచ్చినట్లు కార్మికులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ చేనేత విభాగం నాయకులు పోతు శ్రీధర్, చేనేత కార్మికులు తిరుమల శ్రీనివాసులు, కౌడి శాంతన్న, జలగరి అంజి, వీరన్న గౌడ్, తదితరులు ఉన్నారు.

## చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** సమాజంలో నేటి యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి, ఉన్నతమైన శిఖరాలకు చేరాలని మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ అన్నారు. మండలంలోని వెన్నచర్ల గ్రామంలో మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ ఆధ్వర్యంలో ఉగాది పండుగ సందర్భంగా సూర్యం బాలా గౌడ్, మాజీ ఉపసర్పంచ్ గడ్డి గోపుల పర్వతాలు జ్ఞాపకార్థంగా జిల్లా స్థాయి కబడ్డీ గవర్నమెంట్ నిర్వహించారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతి రూ.20,000, రెండవ బహుమతి రూ.15,000, మూడోవ బహుమతి రూ.10,000, నాలుగోవ బహుమతి రూ.5000 నగదుతో పాటు మెమోటోను మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగపూర్ విష్ణు, సింగర్ విండో మాజీ చైర్మన్ గోపాలరావు, గ్రామ ఉపసర్పంచ్ బై.రాముడు, మాజీ సర్పంచులు వి.సత్యం, పగడాల చిన్నయ్య, మాజీ ఎంపిటిసి రవికుమార్, గ్రామ నాయకులు ముచ్చిపోతు శంకర్, బాలింగాచారి, జంగం పెద్ద నాగరాజు, కోళ్ల సుదర్శన్, వంగూరు రాంప్రసాద్, వార్డు మెంబర్లు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ విధేయులకే అధిష్ఠానం పట్టం కట్టింది


బాధ్యతలు చేపట్టిన జిల్లా కమిటీ కార్యవర్గం

నియామక పత్రాలు అందజేస్తున్న డిసిసి అధ్యక్షుడు శివసేన రెడ్డి




**ప్రజాపక్షం/ వనపర్తి :** ప్రజలకు ఏ కష్టం వచ్చినా ప్రజలకు, కార్యకర్తలకు వెన్నంటూ ఉంటూ పట్టు వీడని విక్రమార్కుల్లాగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి సూచించారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా పూర్తిస్థాయి కమిటీతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి హాజరై పాల్గొన్నారు. నూతనంగా నియమించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గాన్ని నియామక పత్రాలు ఇచ్చి, శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధిష్టానం మేరకు వనపర్తి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గాన్ని పూర్తిస్థాయిలో నియమించిందని అన్నారు. జిల్లా కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో పర్యటించి, గ్రామ కమిటీలను మండల కమిటీలను నియమించాలని సూచించడం జరిగిందని అన్నారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ ఆరు అంశాలపై సమీక్షించడం జరిగిందన్నారు. మొదటగా జిల్లా పార్టీ కార్యాలయాన్ని త్వరలోనే నిర్మాణం చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రతిపాదించగా కమిటీ సభ్యులందరూ ఆమోదించడం జరిగిందని అన్నారు. కొత్తగా నియమించిన జిల్లా కమిటీ సభ్యులు ప్రజల కోసం, కార్యకర్తల కోసం క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. లేనియెడల వారి పనితీరును బట్టి సమలోచన చేసి మార్పులు జరిగే అవకాశాలు కూడా ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ కార్యమంలో టిపిసిసి సెక్రెటరీ నందిమల్ల యాదయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వైస్ చైర్మన్ మధసూదన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ డెలికేట్ శంకర్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, బ్రహ్మచారి, సాయి చరణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులు కోళ్ల వెంకటేష్, చిర్ల జనార్దన్ సాగర్, కాంగ్రెస్ యువజన జిల్లా అధ్యక్షులు ఆధిత్య, పాండు సాగర్ , కౌన్సిలర్లు, కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు యాదగిరి, పర్వతాలు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

## అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



రచయిత డాక్టర్ కిరణ్ కుమార్

**ప్రజాపక్షం/పానుగల్ :** ఉపాధ్యాయుడు వృత్తిని అంకితభావంతో భావించి చిత్తశుద్ధితో పనిచేస్తే సమాజం తప్పక గుర్తిస్తుందని బహుజన రచయిత డాక్టర్ చింతకుంట కిరణ్ కుమార్, పాలమూరు అసిస్టెంట్ ప్రొఫెసర్ సురేందర్‌లు అన్నారు. తాండ ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన చుక్క శేఖర్ సన్మాన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. 2001 నుండి 2009 వరకు అన్నారం ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన సుక్క శేఖర్ ఉపాధ్యాయుని సేవలను గుర్తు చేసుకుని, ఆ కాలంలో చదివిన పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన ఈ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రస్తుత సోషల్ మీడియా కాలంలో అలాంటి వాతావరణం తగ్గిపోయిందన్నారు. పరిస్థితులు ఎట్లున్నా ఉపాధ్యాయుడి స్థానం ఎప్పటికీ చెరిగిపోదు అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చెన్నమ్మ, పాఠశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బి.అరవింద్ స్వామి




**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా బి.అరవింద్ స్వామి నియామకమయ్యారు. బిసి భవన్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణ్‌కుమార్ సంయుక్తంగా ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. యువ నాయకత్వానికి పెద్దపీట బిసి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసే దిశగా, యువ శక్తికి ప్రాధాన్యతనిస్తూ అరవింద్ స్వామిని ఈ కీలక బాధ్యతలకు ఎంపిక చేసినట్లు కమిటీ వెల్లడించింది. అతి చిన్న వయసులోనే రాష్ట్ర స్థాయి పదవిని చేపట్టడం ద్వారా ఆయన యువ నాయకత్వానికి ప్రతీకగా నిలిచారు. వనపర్తి జిల్లాకు చెందిన అరవింద్ స్వామి, విద్యార్థి దశ నుంచే సామాజిక ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటూ, బిసి వర్గాల హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. ఉద్యమ చరిత్రలో నూతన అధ్యాయం ఆర్.కృష్ణయ్య మార్గదర్శకత్వంలో ఎంతోమంది నాయకులు ఈ సంఘం ద్వారా ఎదిగి, నేడు ఎమ్మెల్యేలుగా, ఎమ్మెల్సీలుగా ప్రజా సేవలో ఉన్నారని అదే స్ఫూర్తితో అరవింద్ స్వామి కూడా పనిచేస్తారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నియామక ప్రక్రియలో జాతీయ ప్రధాన కార్యదర్శి ర్యాగ అరుణ్ కీలక పాత్ర పోషించి యువతకు బాధ్యతలు అప్పగించడంలో తన వంతు సహకారాన్ని అందించారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ఆర్.కృష్ణయ్యకి, అరుణ్‌కుమార్‌కి, రాష్ట్ర కమిటీకి అరవింద్ స్వామి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బిసిల విద్యా, ఉద్యోగ, రాజకీయ హక్కుల సాధన కోసం అంకితభావంతో పనిచేస్తానని, నిరంతరం క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అరవింద్ స్వామి నియామకం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బిసి సంఘాల నేతలు, యువజన విభాగాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## బడ్జెట్‌లో బిసిలకు తీవ్ర అన్యాయం

**ప్రజాపక్షం/కొత్తకోట :** కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు ప్రతి సంవత్సరం బడ్జెట్లో రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి ప్రస్తుత బడ్జెట్లో బిసిలకు తీవ్ర అన్యాయం చేసి నయవంచనకు పాల్పడిందని మాజీ జడ్పీవైస్ చైర్మన్ వామన్ గౌడ్, మాజీ జెడ్పిటిసి పొగాకు విశ్వేశ్వర్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షులు ఆకుల శ్రీనివాసులు అన్నారు. కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మొన్న ప్రవేశపెట్టిన బడ్జెట్ రూ.3 లక్షల 24 వేల 234 కోట్లు ఉండ గా అందులో బిసిలకు రూ.12 వేల 511 కోట్లు కేటాయించి మోసం చేసిందని విమర్శించారు. తెలంగాణలో బిసిలు 56 శాతం ఉండగా కేవలం 4 శాతం కూడా నిధులు ఖర్చు పెట్టడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. మొదటి ఏడాది బిసిలకు రూ.9 వేల కోట్లు కేటాయించి రూ.3 వేల కోట్లు కూడా ఖర్చు పెట్టలేదని, రెండవ సంవత్సరం రూ.11 వేల 400 కోట్లు కేటాయించి కేవలం రూ.2500 కోట్లు కూడా ఖర్చు పెట్టలేదని మొన్న ప్రవేశపెట్టిన ప్రస్తుత మూడవ బడ్జెట్లో రూ.12 వేల 511 కోట్లు కేటాయించి తీవ్ర అన్యాయం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. మూడు సంవత్సరాలలో 60 వేల కోట్ల బడ్జెట్ బిసిలకు రావాల్సి ఉండగా కేవలం 30 వేల కోట్లకే పరిమితమైందని అందులో ఖర్చు పెట్టింది. ఈ కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ బీసం చెన్నకేశవరెడ్డి, బిఆర్ఎస్ అధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ అడ్వకేట్ యాదగిరి, వినోద్ సాగర్, కిరణ్ మాదిగ, పట్టణ మైనార్టీ అధ్యక్షులు డా.సాజిద్ అలీ, పామాపురం మాజీ ఎంపిటిసి గులాబీ గోవింద్, మాజీ కో ఆప్షన్ సభ్యులు వసీం ఖాన్, వహీద్ అలీ, అద్వాని శ్రీనివాసులు, లక్ష్మన్న, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఉత్సవాలకు జిల్లా రైతులు




**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సిద్దపేట జిల్లా, నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా నిర్వహిస్తున్న రైతు ఉత్సవాలు కార్యక్రమానికి జిల్లా నుంచి రైతులు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీకి ప్రారంభోత్సవం, రైతు భరోసా మొదటి విడత నిధుల విడుదల కార్యక్రమాలను వీక్షించేందుకు జోగులాంబ గద్వాల జిల్లా నుంచి 150 మంది రైతులను మూడు బస్సులలో తరలి వెళ్లారు. బస్సులను జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి కార్యక్రమాలను వీక్షించేందుకు వ్యవసాయశాఖ తరపున జిల్లాలోని వివిధ మండలాల 38 రైతు వేదికల వద్ద వీసీ ద్వారా వీక్షించేందుకు ఏర్పాట్లు చేయగా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని వీక్షించారు. గద్వాల మండల చెనుగోనుపల్లి గ్రామ రైతు వేదిక వద్ద జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఆయయా మండలాల ఎంపీడీవోలు తసిల్దారులు, మండల స్పెషల్ ఆఫీసర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, డిప్యూటీ తహసిల్దార్లు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.



## పేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** రాష్ట్రాభివృద్ధి కొరకు అనేక సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి నేతృత్వంలో అమలు అవుతున్నాయని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు.ఆదివారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో 48 మంది లబ్ధిదారులకు సీఎం ఆర్ ఎఫ్ పథకం ద్వారా మంజూరు అయిన 19,00,000 వేల చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కొరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని సిఎంఆర్ఎఫ్ పథకం చాలా ఉపయోగకరమైన పథకమని ఆయన తెలిపారు.ఈ పథకం ద్వారా పేదప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని అన్నారు.అర్హులైన వారందరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్,ఇంద్రసేనారెడ్డి, నాయకులు,కార్యకర్తలు,లబ్ధిదారులు పాల్గొన్నారు.

## సర్పంచ్‌లు అభినందనీయులు

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మండలంలోని గానుగబండ, రంగాపురం గ్రామాల్లో సిపిఐ పార్టీ తరుపున ఎన్నికైన కడియాల పద్మ అప్పయ్య, కట్టా కళ్యాణి అశోక్ లు వారి గ్రామాల్లో వున్న ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఆయనమండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ఎప్పటికప్పుడు డ్రైనేజీ శుభ్రపరుస్తూ, అంధకారం లేకుండా వీధిలైట్లను వేయిస్తూ, రహదారి వెంట ఉన్న కంపచెట్లను తొలగిస్తూ, వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా బోర్లను రిఫేర్ చేయించి వాడకంలోకి తీసుకవచ్చారని అన్నారు. గ్రామంలో ఏ వీధిలై సిసిరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు అవసరం ఉన్నాయో వాటిని ఎస్టిమేట్ తయారు చేసి అధికారులకు పంపించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్న వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అవంతీపురం గ్రామాభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని అవంతీపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం అనునిత్యం పల్లెల ప్రగతికి కృషి చేస్తూ గ్రామాల్లో కావాల్సిన మౌలిక వసతులు సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను, నూతన గ్రామపంచాయతీ భవనాలను నిర్మిస్తున్నామని అన్నారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు వార్డు సభ్యులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరగా ఆయన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో అనేక మంది చేరుతుండడం శుభపరిణామమని అన్నారు.



## అమెరికా అడుగులకు మడుగులొత్తుతున్న మోదీ

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సామ్రాజ్యవాది అయిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నేడు ఇరాన్ దేశంపై యుద్ధాన్ని ఆపాలంటూ భారత ప్రధాని మోడి పార్లమెంట్‌లో తీర్మాణం కూడా ప్రవేశపెట్టకుండా ఆయన అడుగులకు మడుగులొత్తుతున్నారని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. జిల్లా సీపీఎం కమిటీ సహావేశం పట్టణంలో డబ్బికార్ మల్లేష్ అధ్యక్షతన జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న యుద్ధం కారణంగా ఆయిల్ సంక్షోభం, గ్యాస్ ధరలు పెరిగి ప్రజలు కోలుకోలేని స్థితి ఏర్పడిందన్నారు. యుద్ధాన్ని ఐక్యరాజ్యసమితి వ్యతిరేకించినా ట్రంప్ తన ఆధిపత్య ధోరణి మానుకోవడం లేదన్నారు. దేశంలో ఉపాది హామి పథకాన్ని నిర్వీర్యం చేసి 120 రోజుల పని దినాలకు తగ్గించిందన్నారు. కార్మికుల హక్కులను కాలరాసేందుకు కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌లుగా మార్చిందన్నారు. గిరిజనులకు అండగా ఉంటున్న మావోయిస్టులను అంతమొందించే విధంగా వారిని ఏరవేత కార్యక్రమం చేపట్టారన్నారు. అదేవిధంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రంగారెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, ప్రజా ఉద్యమాల ద్వారా ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమాలు జరిగినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, నారి ఐలయ్య, చినపాక లక్ష్మీనారాయణ, పాలడుగు నాగార్జున, వీరేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల ఎస్‌సి డిక్లరేషన్ మాటేమిటి?

**ప్రజాపక్షం/నకిరేకల్:** చేవెళ్ల ఎస్‌సి డిక్లరేషన్ పేరుతో దళితుల అభివృద్ధికి హామీలు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం, బడ్జెట్‌లో మాత్రం దళిత సంక్షేమానికి భారీగా కోతలు విధించడం అన్యాయమని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వంటపాక కృష్ణ విమర్శించారు. ఆదివారం నకిరేకల్‌లో కెవిపిఎస్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బడ్జెట్‌లో ఎస్సీ సంక్షేమానికి రూ.40,232 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో కేవలం రూ.11,784 కోట్లు మాత్రమే కేటాయించడం సుమారు 70 శాతం కోతగా నిలిచిందన్నారు.అంబేద్కర్ ఓవర్సీస్ పథకానికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం దళితులపై నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. వెంటనే బడ్జెట్‌ను సవరించి కనీసం రూ.50,000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాచకొండ వెంకన్న, సకుంట్ల నరసింహ, ఏర్పుల తాజేశ్వర్, జమదగ్ని నాగార్జున, సైదులు, బక్కయ్య పాల్గొన్నారు.




# కాంగ్రెస్‌కి కార్యకర్తలే బలం

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాక్షేత్రంలోనే పార్టీ బలోపేతం కావాలి : టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్

భువనగిరి వేదికగా డిసిసి నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



**ప్రజాపక్షం/యాదాద్రి:** కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని, పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా శాశ్వతంగా నిలిచేది కార్యకర్తల కృషితోనే అని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన డీసీసీ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహేష్ కుమార్ గౌడ్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడి స్థాయి నుంచి తాను నేడు రాష్ట్ర అధ్యక్ష పదవికి చేరుకున్నానంటే అది కేవలం కాంగ్రెస్‌లోనే సాధ్యమని, క్రమశిక్షణతో పనిచేసే ప్రతి సామాన్య కార్యకర్తకు పార్టీలో సముచిత గౌరవం, గుర్తింపు లభిస్తాయని ఆయన భరోసా ఇచ్చారు. కార్యకర్తల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఇన్సూరెన్స్ స్కీమ్ దేశంలోనే ఒక చారిత్రాత్మక నిర్ణయమని ఆయన కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా, ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అప్పులమయంగా మారిందని, కేవలం కేసీఆర్ కుటుంబానికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని విమర్శించారు. ఆనాడు జరిగిన లక్షల కోట్ల దోపిడీని తుడి చేస్తూ, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి న కొద్ది కాలంలోనే 65 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగుల కలలను సాకారం చేసిందన్నారు. జిల్లాల పర్యటనను భువనగిరి నుంచే ప్రారంభించానని, బుధవారం మెదక్ జిల్లాలో పర్యటించనున్నట్లు ఆయన వెల్లడించారు.

**పనితనమే నాయకుడికి గీటురాయి : ఎంపి చామల**

రాజకీయాల్లో నాయకుడి పనితనమే అతనికి అసలైన గీటురాయి అని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎన్నికల్లో మొదటిసారి గెలవడం పార్టీకున్న బలంతో సాధ్యం కావొచ్చు కానీ, రెండోసారి గెలవాలంటే మాత్రం చేసిన అభివృద్ధి, ప్రజలతో ఉండే మమేకం, నిరంతర సాన్నిహిత్యం మాత్రమే తోడ్పడతాయని ఆయన స్పష్టం చేశారు.

**పదవులు అలంకారప్రాయం కాదు.. బాధ్యతగా చేపట్టాలి : ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య**

పదవులు కేవలం అలంకారప్రాయం కాదని, వాటిని ఒక బాధ్యతగా గుర్తించి ప్రజలకు సేవ చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే , డీసీసీ అధ్యక్షులు బీర్ల ఐలయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన బాధ్యత డీసీసీ నాయకులపైనే ఉందన్నారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు తక్షణమే వార్డుల వారీగా కమిటీలను వేయాలని ఆదేశించారు. మిమ్మల్ని నమ్ముకున్న ప్రజలకు అండగా ఉండి సేవ చేయడానికే ఈ పదవులని, కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, మందుల సామేల్, కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తి, మున్సిపల్ చైర్మన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, కాంగ్రెస్ నాయకులు బీర్ల శంకర్, కానుగు బాలరాజు, ఎండి నజీర్, ఎలిమినేటి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## 'డ్రగ్స్'ను అరికట్టడంలో విద్యార్థులదే కీలకపాత్ర

**ప్రజాపక్షం/హాలియా:** డ్రగ్స్‌ని అరికట్టడంలో విద్యార్థులే కీలక పాత్ర పోషించాలని హాలియా సిఐ దేశిడి సతీష్ రెడ్డి అన్నారు. ఆదివారం ఎస్ఎఫ్ఐడివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ విద్యార్థి యువజన ఉత్సవాల సందర్భంగా సే నో టు డ్రగ్స్ నినాదంతో నిర్వహించిన ఈ 2కే రన్‌తో యువత డ్రగ్స్‌పై పోరాడాలన్నారు. సమాజంలో పెరిగిపోతున్న డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టడంలో విద్యార్థులదే కీలకపాత్ర అని చెప్పారు. గంజాయి, మత్తు పదార్థాలు సేవించడం ద్వారా అనారోగ్యంతో పాటు కుటుంబం కూడా తీవ్రంగా నష్టపోతుందని సూచించారు. డ్రగ్స్‌పై పోలీస్ శాఖ ఉక్కు పాదం మోపి మత్తు పదార్థాలను అరికట్టేందుకు పూర్తిస్థాయిలో కఠినంగా వ్యవహరిస్తుందని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా యువతలో చైతన్యం తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్దవూర ఎంఈఓ తరి రాము, నరేష్, మల్లం మహేష్, కొండేటి శ్రీను, కోరే రమేష్, అవుతా సైదయ్య, నల్లవెల్లి జగదీష్, మంద నరేందర్ రెడ్డి, రాజు,కత్తి శ్రీనివాస్ రెడ్డి, వెంకన్న,ధనమ్మ, కోటిరెడ్డి పాల్గొన్నారు.

## సాగర్‌ను సందర్శించిన మహారాష్ట్ర ఎన్నికల కమిషనర్



**ప్రజాపక్షం/నందికొండ:** అంతర్జాతీయ పర్యాటక కేంద్రం నాగార్జునసాగర్‌ను మహారాష్ట్ర రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దినేష్ వాఘరే కుటుంబ సమేతంగా సందర్శించారు. హైదరాబాద్‌లోని ఇవిఎంల తయారీ సంస్థ ఈసీఐఎల్ ఉన్నతాధికారులతో మహారాష్ట్ర ఎన్నికల కమిషనర్ కార్యదర్శి సురేష్ కాకాని కలిసి సమావేశమైన అనంతరం,సాగర్ సందర్శనలో భాగంగా విజయ విహార్ అతిథి గృహానికి చేరుకున్నారు.వారికి తిరుమలగిరి సాగర్ తహసీల్దార్ అనిల్ కుమార్,ప్రోటోకాల్ ఆర్ఐ దండ శ్రీనివాస్ రెడ్డి,విజయ విహార్ మేనేజర్ కిరణ్ ఘన స్వాగతం పలికారు.అనంతరం టూరిజం లాంచీలో నాగార్జునకొండ మ్యూజియంను సందర్శించారు. నాగార్జునకొండలో పునర్నిర్మించిన సింహాల విహారం, అశ్వమేధ యజ్ఞశాల, మహాస్తూపాన్ని వీక్షించారు.తదనంతరం బుద్ధవనం చేరుకుని బుద్ధ పాదాల వద్ద పుష్పాంజలి ఘటించి వందనం సమర్పించారు. బుద్ధవనం సందర్శనలో భాగంగా బుద్ధ చరితవనం,జాతకవనం,ధ్యానవనం, స్తూపవనాలను సందర్శించి,మహాస్తూపంలోని సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలను తెలియజేసే లఘు చిత్రాన్ని వీక్షించారు.అనంతరం మహాస్తూపంలోని ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతులను వెలిగించారు.ఈ సందర్భంగా బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎస్టేట్ మేనేజర్ రవిచంద్రులు వారిని బుద్ధవనం కండువాలు, బ్రోచర్లతో సత్కరించారు. స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జునకొండ, బుద్ధవనం చారిత్రక విశేషాలను వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఇసిఐఎల్ సంస్థ ప్రతినిధి సౌరబ్, లైజనింగ్ అధికారులు సుధీర్ రెడ్డి, పాండు, అభిషేక్, స్థానిక ఎస్సై ముత్తయ్య పాల్గొన్నారు.



## ప్రతీ చెరువునూ నింపి రైతులకు సాగునీరు అందిస్తాం

రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** 'నియోజకవర్గంలోని ప్రతి చెరువునూ నింపి, రైతులకు సాగునీరు అందించడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం. ఎన్నో ఏళ్లుగా నీటి కోసం ఎదురుచూస్తున్న ఆలేరు రైతాంగానికి అండగా ఉండి, వారి జీవితాల్లో వెలుగులు నింపుతాం' అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు. యాదగిరిగుట్ట మండలం మల్లాపూర్ గ్రామంలో మల్లన్న సాగర్ జలాలతో నిండి అలుగు పోస్తున్న చెరువుకు ఆయన ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి సంతోషాన్ని పంచుకుంటూ ఆయన మాట్లాడారు. సాగునీటి కల సాకారం గతంలో నీటి ఎద్దడితో ఇబ్బంది పడిన మల్లాపూర్ ప్రాంతం, నేడు మల్లన్న సాగర్ జలాలతో కళకళలాడుతుండటం శుభసూచకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చెరువులు నిండితేనే భూగర్భ జలాలు పెరుగుతాయని, తద్వారా పచ్చని పంటలతో గ్రామాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఆలేరు నియోజకవర్గాన్ని పూర్తిగా అభివృద్ధి చేసి, రైతుల జీవితాల్లో వెలుగులు నింపడమే తమ సంకల్పమని, రైతు ఆనందంగా ఉండటమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక సాధికారతకు మహిళా సంఘాలు కీలకం

దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**ప్రజాపక్షం/డిండి:** కోటి మంది మహిళా సంఘాల్లోని మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని ఆ దిశగా ప్రభుత్వం ముందుకెళ్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు.ఆదివారం డిండి మండలంలోని సోమ్లా తండా,కామేపల్లి గ్రామాలలో ఎన్ఆర్‌జిఎస్ నిధుల నుండి మంజూరైన 10.00లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న స్త్రీశక్తి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మండలంలోని ఎర్రారం,టీ.గౌరారం,ఖానాపూర్,పెద్ద తండా, చెరుకు పల్లి గ్రామాలలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు.అనంతరంటీ.గౌరారం,ఖానాపూర్ గ్రామాలలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని,ఇంటి యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.టీ.గౌరారం గ్రామంలో హై స్కూల్ ప్రహరీ గోడ,ఆహార ధాన్య నిల్వ గోదాం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహిళా సంఘాల బలోపేతానికి స్త్రీశక్తి భవనాలు ఎంతో దోహదపడతాయనీ,నిర్ణీత కాలపరిమితిలోగా నాణ్యతతో ఈ భవన నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి,యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జర్పుల లక్ష్మీ,సర్పంచ్‌లు బొడ్డుపల్లి వరసాల లక్ష్మయ్య,ఇస్లావత్ రుక్కి,రాములు, లింగయ్య పాల్గొన్నారు.


## అంతరిస్తున్నా... కన్నెత్తి చూడని అధికారులు





**ప్రజాపక్షం/మోతె:** అటవీ సంరక్షణ ఎవరి బాధ్యత అటు వైపు కన్నెత్తి చూడని అధికారుల తీరుకు రోజు రోజుకు అంతరిస్తున్న అటవి సంపద ప్రతి సంవత్సరం కోట్లు ఖర్చు చేసి ప్రతి గ్రామానికి ఒక నర్సరీని ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి ప్రతి ఒక్కరికి పండ్లు, పూల మొక్కలతో పాటు నీడనిచ్చే మొక్కలు పెంచాలని ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న వన సంపద పెంచడంతో పాటు పెరిగి పెద్దైన కొన్ని యేండ్ల నాటి వృక్ష సంపద నెలరాలిపోతున్న ఎవరికి పట్టనట్లు కన్పించడం లేదు. రాజకీయ పలుకుబడితో పాటు ఆర్థిక అవసరాలు తీర్చే స్థోమత కలిగిన నాయకులు వ్యాపారులు యదేశ్చగా ఆటవిఆ సంపదను కొల్లగొట్టి లక్షలు పొగేస్తున్న అక్రమ వ్యాపారులకు ముడుపులు పుచ్చుకుని నిద్ర నటిస్తున్న అధికారులకు రోజు రోజుకు కాసుల వర్షం కురుస్తున్నాయి. మండలంలోని కొందరు కలప వ్యాపారులకు అడ్డు అదుపు లేకుండా పర్మిషన్ పేరుతో అటవిని ధ్వంసం చేస్తున్నారని పలు గ్రామాల ప్రజలు చర్చించుకుంటున్నారు. బొగ్గు బట్టీలతో కాలుష్యం పెరుగుతున్న అడిగే వారు లేక నెలలో బొగ్గుబట్టీల వ్యాపారం లక్షలు పొగు చేసుకుంటూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఇది చాలక మాకు ఎవరు అడ్డు అన్న చందంగా మండలంలోని పలు గ్రామాల్లో బొగ్గు బట్టీల దర్శనం ఊరులోకి వెళ్తుండగా కన్పిస్తుంటాయి. తక్షణమే ఈ కలప వ్యాపారులకు అడ్డుకట్ట వేసి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని గ్రామాల ప్రజలు అధికారులను కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వృక్షాలను నరకకుండా, అటవీ శాఖ అధికారులు ముడుపులు తీసుకోకుండా ఉంటే వృక్షాలను రక్షించుకోవచ్చని రైతులు వేడుకుంటున్నారు.

## రియల్ ఎస్టేట్ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** రియల్ ఎస్టేట్ రంగంలో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర రియల్ ఎస్టేట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పతంగి వీరస్వామిగౌడ్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ గార్డెన్స్‌లో జరిగిన అసోసియేషన్ నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వివిధ జిల్లాల అధ్యక్షులకు నియామక పత్రాలు అందజేసిన అనంతరం మాట్లాడారు. 5 ఎకరాల లోపు వెంచర్లు చేసిన ప్రాంతాలలో ప్లాట్ నెంబర్లతోనే రిజిస్ట్రేషన్ చేసేలా ప్రత్యేక జీవో తీసుకరావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం నూతన రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పతంగి వీరస్వామిగౌడ్‌ను రాష్ట్ర 33 జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

**రాష్ట్ర కమిటీ ఎన్నిక :** రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా నిమ్మల శ్రీనివాసగౌడ్, రాష్ట్ర గౌరవ సలహాదారులుగా కుమ్మరికుంట్ల లింగయ్య, పందిరి మల్లేష్, రాష్ట్ర అధ్యక్షులుగా పతంగి వీరస్వామిగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మాదగాని శ్రీనివాసగౌడ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా బొమ్మగాని శ్రీనివాసగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నల్లమాన చంద్రశేఖర్, బండి నాగేశ్వరరావు, బెల్లంకొండ యాదగిరి, రాష్ట్ర కార్యదర్శులుగా ఖమ్మంపాటి అంజయ్య, పర్వతం వెంకటేశ్వరచారి, అమరవాది శ్రావణ్, రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా సాముల జగ్గారెడ్డి, ఏటా సతీష్, మొక్క రాములు ఎన్నుకున్నారు.

## ఇంట్లో చోరీ రూ.50 వేల నగదు అపహరణ

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండల పరిధిలోని శివన్నగూడ గ్రామంలో చోరీ ఘటన చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన మేకల నవిత తన కుమారుడితో కలిసి నివాసముంటోంది.శనివారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో ఆమె తన ఇంటికి తాళం వేసి, అదే గ్రామంలో ఉన్న తన తల్లి ఇంటికి నిద్రించడానికి వెళ్లింది. ఈ అవకాశాన్ని వినియోగించుకున్న గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. అనంతరం బీరువాలో ఉంచిన సుమారు రూ.50 వేల నగదును అపహరించారు. తరువాత ఉదయం ఇంటికి వచ్చిన నవిత తాళం పగిలి ఉండటాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని ఎస్సై మొనగాల కృష్ణారెడ్డి తెలిపారు. పోలీసులు ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు.



## ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తా

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం అవాలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తూ జిల్లా వ్యాప్తంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆమ్ ఆద్మీపార్టీ జిల్లా అధ్యక్షుడు యార శ్రీను పేర్కొన్నారు.ఆదివారం నల్లగొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తనపై నమ్మకంతో అమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించిన ఆ పార్టీ తెలంగాణ ఇంచార్జి ప్రియాంక కాక్కర్‌కి,రాష్ట్ర కన్వీనర్ హేమాజిల్లోకి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాముగౌడ్‌కి, జనరల్ సెక్రటరీ అన్సారీకి ధన్యవాదములు తెలియజేస్తున్నామన్నారు. తనకిచ్చిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజా సమస్యల పైన పోరాడుతానని పేర్కొన్నారు. అదేవిధంగా తమ ఎన్నికకు సహకరించిన నాయకులకు, కార్యకర్తలకు, ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.

‘నవీన్ చంద్ర హీరోగా, పలాస దర్శకుడు కరుణ కుమార్ రచన, దర్శకత్వంలో ఒవిఎ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిన సైకలాజికల్ హర్రర్ సినిమా హనీ. ప్రస్తుతం ఈ సినిమా ఒటిటిలో ట్రేండింగ్ లో ఉంది.’

## గ్రామీణ నేపథ్యంలో లవ్ వాలా



రవీంద్ర తేజ్ హీరోగా స్వాన్ ఎంటర్‌టైన్‌మెంట్ శుభకరి ఇన్‌ఫ్రా మీడియా బ్యానర్స్ నిర్మిస్తున్న చిత్రం ‘లవ్‌వాలా’. కొరటాల శివ, బుచ్చిబాబు సానా వద్ద అసోషియేట్ గా పని చేసిన రంజిత్ కుమార్ దేశెట్టి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రూరల్ బ్యాక్ డ్రాప్ లవ్ స్టోరీగా రూపొందుతున్న ఈ చిత్రంలో అరియా మోడీ హీరోయిన్‌గా నటిస్తోంది. పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ఘనంగా లాంచ్ చేశారు. డైరెక్టర్ కొరటాల శివ ముహుర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. డైరెక్టర్ బుచ్చిబాబు సానా కెమెరా స్విచ్ ఆన్ చేశారు. కొరటాల శివ, బుచ్చిబాబు సానా మేకర్స్‌కు స్క్రిప్ట్ అందజేశారు. ఈ చిత్రంలో రాజ్ అర్జున్, మణి చందన, కమల్, నవీన్ నేని, నాగ మహేష్, రశ్మీ గౌతమ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ మ్యూజిక్ అందిస్తున్నారు. జమ్మ శ్రీను డిఓపి, తూము రాము ఎడిటర్, ఆర్ట్ డైరెక్టర్‌గా బేబీ సురేశ్ భీమగాని పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్మాత సురేష్ వర్మ మాట్లాడుతూ రంజిత్ చెప్పిన కథ మాకు చాలా నచ్చింది. ఇది చాలా మంచి లవ్‌స్టోరి. రవి హీరోగా నటిస్తున్నారు. అరియ మోడీని హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నాం. ఫస్ట్ షెడ్యూల్ తర్వాత మరిన్ని వివరాలు తెలియజేస్తాం అని చెప్పారు. ఈ కథ రాసిన తర్వాత సురేష్ కి చెప్పాను. ఆయనకు చాలా నచ్చింది. . ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శివ నాగ కృష్ణ ఉప్పలపాటి.

## ‘జెన్ మేరీ ఖాన్’ ఫస్ట్‌లుక్ రిలీజ్



హీరో అడివి శేష్ ఇప్పుడు డెకాయిట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో తొలిసారిగా మాస్, రగడ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నారు. షానియల్ డియో ఈ సినిమాతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నారు. బాలీవుడ్ స్టార్ అమీర్ ఖాన్ కజిన్ బ్రదర్ కుమార్తె జెన్ మేరీ ఖాన్ తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేస్తోంది. ఈ సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఖాకీ యూనిఫామ్‌లోతుపాకీ పట్టుకుని ముందుకు గురిపెట్టిన ఆమె లుక్ పవర్‌ఫుల్‌గా కనిపిస్తోంది. ఈ పోస్టర్‌లో జెన్ పాత్ర ఇంటెన్సిటీ స్పష్టంగా కనిపిస్తోంది. వెనుక వైపు ఇతర పోలీస్ అధికారులు ఉండటం ఈ సన్నివేశానికి మరింత బలం చేకూర్చింది. ఈ పోస్టర్‌ను చూసిన ఆమిర్ ఖాన్ వెంటనే స్పందించి అభినందనలు తెలుపుతూ మొత్తం టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మెసేజ్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. హిందీ ప్రేక్షకుల్లో సినిమాకు మరింత హైప్‌ను తెచ్చింది. ఇప్పటికే ఈ సినిమా పోస్టర్లు, గ్లింప్స్, టీజర్, అలాగే మొదటి సాంగ్ ‘రుబారు’ ప్రేక్షకుల నుంచి అద్భుత మైన స్పందన పొందుతూ సినిమాపై భారీ అంచనాలు నెలకొల్పాయి. ఈ మూవీని తెలుగు, హిందీ భాషల్లో ఒకేసారి రూపొందిస్తున్నారు. సుప్రియా యార్లగడ్డ నిర్మాణంలో, సునీల్ నారంగ్ సహనిర్మాతగా అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ సినిమాకు సినిమాటోగ్రాఫర్ ధనుష్ భాస్కర్, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. గ్యాని అందించే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ఎమోషన్ మరింతగా పెంచనుంది. అన్ని పనులు పూర్తి చేసి ఏప్రిల్ 10న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

## ఆకట్టుకునేలా ‘డైమండ్ డెకాయిట్’ పాటలు

దర్శకుడు వి.ఎన్.ఆదిత్య



తెలుగు తెరపై సరికొత్త కాన్సెప్ట్‌తో రూపొందిన ఎమోషనల్ రివెంజ్ డ్రామా ‘డైమండ్ డెకాయిట్’. పార్ధ గోపాల్ నిర్మాణంలో, దర్శకుడు సూర్య జి యాదవ్ దర్శకత్వంలో, పార్ధగోపాల్ మేఘన జంటగా తెరకెక్కుతున్న ఈ సినిమా ఆడియో విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో ఘనంగా జరిగింది. ప్రముఖ మ్యూజిక్ సంస్థ మధుర ఆడియో ద్వారా ఈ పాటలను ముఖ్య అతిథిగా హాజరైన తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీఎన్ ఆదిత్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ఒ వినూత్న పోటీకి తెరలేపింది. ఈ చిత్రంలోని మరదలివే పాటకు హుక్ స్టెప్ ఛాలెంజ్‌ను ప్రకటించింది. ఆసక్తిగల వారు వారు ఆ పాటకు తమ హుక్ స్టెప్‌తో రీల్స్ రూపొందించి ఆరీల్స్ లింక్‌ను 8074 801661 వాట్సాప్ నంబర్‌కు పంపవచ్చు. మొదటి బహుమతి లక్ష రూపాయలు, రెండవ బహుమతి యాభై వేల రూపాయలు అందజేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా తెలుగు ఫిలిం డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య మాట్లాడుతూ సినిమా పాటలు ఎంతో ఆకట్టుకున్నాయి.

## అలరిస్తున్న ‘అరెరే..అరెరే’

**సంగీత దర్శకుడు రఘు కుంచె**



ప్రముఖ గాయని , నటి దియా అందించిన ‘అరెరే.. అరెరే.. మ్యూజిక్ వీడియో ఆల్బమ్ విడుదల కార్యక్రమం ఘనంగా హైదరాబాద్ లోని ప్రసాద్ ల్యాబ్ లో ఆదివారం జరిగింది. బటర్‌ఫ్లై మ్యూజిక్ బ్యానర్‌పై రూపొందిన ఈ మ్యూజిక్ వీడియో విడుదల వేడుకకు సినీ ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య, హీరో పూరి ఆకాష్, సినీ ప్రముఖులు సమీర్, సాగర్, ప్రముఖ సంగీత దర్శకుడు రఘు కుంచె, నటుడు, మిమిక్రి శివారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగీత దర్శకుడు రఘు కుంచె మాట్లాడుతూ ఇది డిజిటల్ యుగం. ప్రతిభ ఉన్న వారు అవకాశాల కోసం ఎదురు చూడాల్సిన అవసరం లేదు. తమ టాలెంట్‌తోనే ముందుకు రావచ్చు. దియా అలాంటి ప్రతిభావంతురాలు ఈ పాటలో ఆమె చూపించిన భావ వ్యక్తీకరణ, గాత్రం ప్రేక్షకులను తప్పకుండా ఆకట్టుకుంటాయి. ఈ సాంగ్ మంచి హిట్ అవుతుందని నమ్ముతున్నాను అని పేర్కొన్నారు. నటి, సింగర్ దియా మాట్లాడుతూ ఈ ఆల్బమ్ రూపుదిద్దుకోవడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ కార్యక్రమంలో దర్శకుల సంఘం అధ్యక్షుడు వి ఎన్ ఆదిత్య, నటుడు పూరి ఆకాష్ , నిర్మాత నూతన్ చెకురి, దర్శకుడు క్రాంతి వర్మ , మ్యూజిక్ డైరెక్టర్ శరవణ వాసుదేవన్ పాల్గొన్నారు. త్వరలోనే ఈ మ్యూజిక్ వీడియో యూట్యూబ్‌తో పాటు స్పాటిఫై, ఆపిల్ మ్యూజిక్, అమెజాన్ మ్యూజిక్ వంటి ప్రముఖ డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌లలో ప్రేక్షకులకు అందుబాటులోకి రానుంది.

## ’సఖియే’ లిరికల్ సాంగ్ రిలీజ్



కెన్ కరునాస్, కెఅనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్ని యాదవ్, మీనాక్షి ధినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ ‘యూత్‘. ఈ చిత్రాన్ని ఇదే పేరుతో ఈ2సీ బ్యానర్ పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు హౌస్ ఫుల్ సంస్థ అధినేతలు వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ ఆ౯డ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. ఈ నెల 26న ‘యూత్’ మూవీ తెలుగులో థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ’కమ్ విత్ యువర్ గ్యాంగ్, నోట్ నో ఏజ్ లిమిట్’ అనే స్లోగన్‌తో ఈ సినిమా ప్రమోషనల్ క్యాంపెయిన్ చేస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన ఈ మూవీ ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. తాజాగా యూత్ సినిమా నుంచి ’సఖియే’ లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. జివి ప్రకాష్ కుమార్ బ్యూటిఫుల్ కంపోజిషన్ చేసిన ‘సఖియే’ లిరికల్ సాంగ్‌కు కిట్టు విస్సాప్రగడ సాహిత్యాన్ని అందించగా, సింజిత్ యెర్రమల్లి, సింధుజ తణుకు ఆకట్టుకునేలా పాడారు. ‘పలికానే పెదాలతోనే పలుమార్లు ఇలా నీ పేరే, అలవాటే లేదాయే వెతికే మాయవి నీవేలే, ఒక మాటే మాటాడమంటే మదిదాటి రాలేను అందే, విన్నావా అంటూనే పిలిచాయే నా మౌనాలే, కలవా, కథవా నన తాకే అలవా, మనసే సంద్రంలా మారిందా..సఖియే..సఖియే..’ అంటూ యువ జంట పాడుకునే అందమైన ప్రేమ పాటగా సాగుతుంది.ఈ చిత్రానికి ప్రొడ్యూసర్ కరుపయ్య సి.రామ్, సులోచన కుమార్, సినిమాటోగ్రఫీ వికి, ఎడిటర్ నాష్, ఆర్ట్ డైరెక్టర్ రాము తంగరాజ్, క్రియేటివ్ ప్రొడ్యూసర్ విజయ్ ఎంపీ, స్టంట్ కలై కింగ్సన్, కొరియోగ్రఫీ శోబి పాల్ రాజ్.

## త్వరలోనే ‘ప్రేయసి రావే-2’ చేస్తా

**దర్శకుడు మహేష్ చంద్ర**



తన జీవితాన్ని మలుపు తిప్పిన ‘ప్రేయసి రావే’ చిత్రానికి త్వరలో సీక్వెల్ చేయబోతున్నానని దర్శకుడు మహేష్ చంద్ర వెల్లడించారు. కథ సిద్ధమైతోంది. పూర్తి వివరాలు త్వరలోనే చెబుతాను. హీరో శ్రీకాంత్ కి కూడా ఈ విషయం చెప్పాను. ఆయన కూడా చాలా ఆనంద పడ్డారు. ‘శ్రీకాంత్, రాశి, పృథ్వీ, శివాజీ రాజా, ఎంఎం శ్రీలేఖ మేమంతా కలిసి మళ్లీ పని చేస్తాం’ అని దర్శకుడు మహేష్ చంద్ర తెలిపారు. తాజాగా మహేష్ నూతన నటీనటులతో మహేష్ చంద్ర తెరకేకించిన ‘పిఠాపురంలో అలా మొదలైంది. సినిమా ట్రయిలర్ ను హీరో శ్రీకాంత్, నటుడు శివాజీ రాజా, సంగీత దర్శకురాలు శ్రీలేఖ కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన దర్శకుడు మహేష్ చంద్ర ప్రేయసి రావే సినిమాకు సీక్వెల్ చేస్తానని వెల్లడించారు. ‘ప్రేయసి రావే’ నాకు ఈ లైఫ్ ఇచ్చింది. ఆ టీంతో మా ‘పిఠాపురంలో అలా మొదలైంది’ ట్రైలర్ లాంచ్ అవ్వడం నాకు చాలా ఆనందంగా ఉంది. నాకు ఈ ప్రయాణంలో సహకరించిన శ్రీకాంత్ , శివాజీ రాజా , పృథ్వీ , శ్రీలేఖకి థాంక్స్. ‘ప్రేయసి రావే 2’ కథ కూడా రెడీ చేశాను. ‘ప్రేయసి రావే’ చిత్రీకరణ సమయంలో ఎలాంటి ఫీల్ అయితే వచ్చిందో.. ‘పిఠాపురంలో అలా మొదలైంది’ టైంలోనూ అదే ఫీలింగ్ వచ్చింది. ఇప్పటి వరకు మూవీని చూసిన ప్రతీ ఒక్కరూ క్లైమాక్స్‌కి ఎమోషనల్ అయ్యారు. ముగ్గురు హీరోలు, ముగ్గురు హీరోయిన్లు అద్భుతంగా నటించారు. శ్రీరామ్ గొప్ప డైలాగ్స్ రాశారు. ముగ్గురు నిర్మాతలు నాకెంతో సహకరించారు. ప్రతీ ఇంట్లో జరిగే సంఘటనలతోనే ఈ మూవీని చేశాం. సినిమాని చూస్తే “ఇది మా ఇంట్లోనే జరిగినట్టు ఉందే అని ఫీల్ అవుతారు. అందరినీ ఆకట్టుకునేలా ఈ చిత్రం ఉంటుంది”. అని అన్నారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్, పథ్వీరాజ్, కేదార్ శంకర్, మణి చందన, అన్నపూర్ణమ్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా ప్రధాన పాత్రల్లో నటించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో హీరో శ్రీకాంత్, నటుడు శివాజీ రాజా, నటుడు పృథ్వీ, మ్యూజిక్ డైరెక్టర్ ఎం.ఎం. శ్రీలేఖ, హీరో విరాట్ పాల్గొన్నారు.

## ఇది ఉద్యమ నామ సంవత్సరం

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తామని ఇటీవల బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారని అర్హులైన వారికి ఆ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వానికి ప్రజలకు మధ్య సిపిఐ పార్టీ కార్యకర్తలు వారదుల్లా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఇటీవల శాసనసభలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆశా నిరాశల మధ్య ఉన్నదని కొత్త పథకాలు ప్రవేశపెట్టడం హర్షించదగ్గ పరిణామమే అయినప్పటికీ అనేక పథకాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని ముఖ్యంగా జనాభాలో అధిక శాతం ఉన్న బిసిల సంక్షేమం కోసం కేవలం 12వేల కోట్లు మాత్రమే కేటాయించడం బాధకరమని అన్నారు. మే నెల మొత్తం కూడా క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నేతల వరకు జరిగే రాజకీయ శిక్షణ తరగతుల్లో పాల్గొని పోరాట పటిమను చాటి జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు కార్యకలాపాల నివేదికను భవిష్యత్ కార్యక్రమాలను ప్రవేశపెట్టారు. ఈ సమావేశానికి కంబాల శ్రీనివాస్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో యల్లావుల రాములు, దూళిపాల ధనుంజయనాయుడు, మేకల శ్రీనివాసరావు, యల్లంల యాదగిరి, మండవ వెంకటేశ్వర్లు, బద్దం కృష్ణారెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, బత్తినేని హనుమంతరావు, బూర వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, నంద్యాల రామిరెడ్డి పాల్గొన్నారు.

## బిసి సబ్ ప్లాన్ చట్టం చేయాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

జనాభాకు కేవలం 3.8 శాతం నిధులు కేటాయించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. వి.హనుమంతరావు మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఎవరి వాటా వారికి దక్కాలని సూత్రం రాష్ట్రంలో అమలు కావడం లేదని, జనాభా లెక్కల ప్రకారం బిసిలు 56శాతం ఉంటే బడ్జెట్‌లో నిధులు అతి స్వల్పంగా కేటాయించినందుకు తాను సిగ్గుపడుతున్నానని ఆయన అన్నారు. ఈ సమావేశంలో జాజుల లింగం గౌడ్, కోల జనార్దన్, బొల్లేపల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి

**జల దినోత్సవంలో పాల్గొన్న మంత్రి సీతక్క, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



ప్రజాపక్షం/ఆత్మకూరు : మానవ మనుగడకు నీరు అనేది ప్రాణాధారమని, నీటిని పొదుపుగా వి నియోగించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రా మీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. ఆదివారం అంతర్జాతీయ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం తిరుమలగిరి గ్రామంలో గ్రామ సర్పంచ్ దేవేంద్ర అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మంత్రి సీతక్కతో పాటు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పాల్గొన్నారు. ఈ సందర్భం గా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టు ఎంతో విలువైనదని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోకపోతే రానున్న రోజుల్లో మానవ మనుగడకే ముప్పు ఏర్పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాలలో పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, దీనిలో భాగంగా ప్రపంచ నీటి దినోత్సవాన్ని నేడు జరుపుకోవడం గొప్ప విషయమని అన్నారు. ప్రతి ఒక్కరు నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకున్నప్పుడే భావితరాలకు నీటి ఇబ్బందులు ఏర్పడవని పేర్కొన్నారు. భూగర్భ జలాలు పెరిగేందుకు ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో ఇం కుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విచ్చలవిడిగా నీటిని వృధాచేయడం వల్ల నీటిని కొనుక్కునే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. చెట్లు పెంచని పక్షంలో రానున్న రోజుల్లో గాలిని సైతం కొనాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామాలకు సమీపంలోని చెరువులను కాపాడుతూనే అడవులను కాపాడుకోవాలని, సూచించారు. గ్రామాలలో మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. వాటర్ ప్లాంట్లపై ఆధారపడకుండా గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న నీటిని వినియోగించుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న శుద్ధమైన నీరు వినియోగంపై ప్రజలకు విస్తృతమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. అదేవిధంగా పంటలకు అధిక రసాయనిక ఎరువులను వినియోగిస్తున్నారని, వాటి వినియోగాన్ని తగ్గించుకోవాలని రైతులకు సూచించారు. రసాయనిక ఎరువులు వినియోగం పెరగడంతో క్యాన్సర్, ఇతర అనారోగ్యసమస్యలకు కారణమవుతున్నాయన్నారు.

పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో మిషన్ భగీరథ నీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీవనానికి మూలాధారమైన పంచభూతాలైన గాలి, నీరు, నిప్పు, ఆకాశం, భూమిని పరిశుభ్రంగా ఉంచితే మనతోపాటు భవిష్యత్ తరాలకు అంతా మేలు కలుగుతుందన్నారు. రాబోయే తరాలకు పర్యావరణం పంచభూతాలను పరిరక్షించుకోవాల్సిన ఆలోచన ప్రతి ఒక్కరిలో రావాలన్నారు. విలువైన నీరును వృధా చేయవద్దని సూచించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయ న్నారు. నీటిని పొదుపుగా వాడుతూ భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత అందరిపై ఉందన్నారు.

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ జిల్లాలోని గ్రామాలకు ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నల్ల కనెక్షన్ ఇచ్చి శుద్ధమైన నీటిని సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లోనూ గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా పంపిణీ చేస్తున్న శుద్ధ నీరు, ప్రైవేట్ వాటర్ ప్లాంట్ల నుండి వినియోగించే నీరు గురించి అధికారులు డెమో ప్రదర్శించారు.

ఈ కార్యక్రమంలో పరకాల ఆర్డిఓ డాక్టర్ కన్నం నారాయణ, మిషన్ భగీరథ ఈఈ గాయత్రి, స్థానిక తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపిడిఓ శ్రీనివాస రెడ్డి, ఇతర అధికారులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

## 48 గంటలే గడువు

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరిక జారీ చేశారు. ఇరాన్ కూడా ఎంతమాత్రం వెనక్కు తగ్గకుండా అమెరికా స్థావరాలు సహా పశ్చిమాసియాలో ఉన్న ఇంధన కేంద్రాలు, మౌలిక వసతులన్నింటినీ ధ్వంసం చేస్తామని ప్రతి హెచ్చరిక జారీ చేసింది. ఇజ్రాయెల్ రాజధాని టెల్అవీవ్ ఇరాన్ క్షిపణులు,డ్రోన్ల దాడులు,పేలుళ్ళతో దద్దరిల్లింది. దక్షిణ ఇజ్రాయెల్ అరద్ నగరంలో ఇరాన్ క్షిపణులు తీవ్ర విధ్వంసం సృష్టించిన తర్వాత ప్రధానమంత్రి నెతన్యాహూ ఆ ప్రదేశం నుండి ఆదివారం తాజా ప్రకటన చేస్తూ, ప్రపంచదేశాలన్నీ ఇరాన్‌కు వ్యతిరేకంగా యుద్ధంలో చేరాలని పిలుపు ఇచ్చారు. మరికొన్ని దేశాలు ఇప్పటికే ఆ దిశగా ముందుకు కదులుతున్నాయన్నారు. ఇరాన్‌ను ఓడించి హోర్ముజ్ జలసంధిని తెరపించేందుకు, దాడులు ఆపేందుకు ఇరాన్ వ్యతిరేక యుద్ధంలో చేరాలని కోరారు. ఇజ్రాయెల్‌లో సామాన్య పౌరులను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ విధ్వంసానికి పాల్పడుతోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా చాలా సుదూరంలో ఉన్న లక్ష్యాలపై దాడులు చేయగల సామర్థ్యాన్ని ఇరాన్ సమకూర్చుకుందని పేర్కొన్నారు. కాగా ఈద్–అల్–ఫితర్ ప్రార్థనల సందర్భంగా ఇజ్రాయెల్ పవిత్ర పురాతన నగరం జెరూసలెంలో ముస్లిం,క్రిస్టియన్,యూదులకు చెందిన ప్రార్థనాలయాలున్న ప్రదేశాలకు కొన్ని వందల మీటర్ల సమీపంలో ఇరాన్ ఆదివారం క్షిపణి దాడులు చేసింది. దీంతో ఆ ప్రాంతంలో దట్టంగా పొగలు కమ్ముకున్నాయి. ప్రజలు ఆందోళనతో పరుగులు తీశారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన అల్–అక్సా మసీదుకు 400 మీటర్ల దూరంలో ఈ దాడి జరిగింది. బాగ్దాద్ విమానాశ్రయం సమీపంలో ఉన్న అమెరికా దౌత్యకార్యాలయం,సైనికస్థావరాలపై మూడు ఇరాన్ క్షిపణులు దాడి చేశాయి. యుద్ధం మూడువారాలు పూర్తిచేసుకుని నాలుగోవారంలోకి ప్రవేశించిన తర్వాత 23వ రోజు ఆదివారం మరిన్ని క్లస్టర్ బాంబులతో కసిదీరా దక్షిణ ఇజ్రాయెల్ పట్టణాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులతో భీకర దాడులు చేస్తోంది. సెంట్రల్ ఇజ్రాయెల్‌లో పలు ప్రాంతాలపై ఇరాన్ ఆయుధ వర్షం కురిపించడంతో అనేకమంది గాయపడుతున్నారు. ఇజ్రాయెల్ అణు విద్యుత్ కేంద్రం సమీపంలో క్షిపణి దాడులు జరిగాయి. ఇజ్రాయెల్ నగరం డిమోనా శివారు ప్రాంతంలో ఈ క్షిపణి దాడులు జరిగాయి. దీంతో ఇజ్రాయెల్ గగనతల రక్షణ కవచవ్యవస్థ విఫలమైందనే ఆందోళన చెలరేగింది. ఇరాన్ దాడులతో దక్షిణ ఇజ్రాయెల్ పట్టణాలలో తీవ్ర నష్టం వాటిల్లింది. ఇళ్ళ భవనాలు ధ్వంసమయ్యాయి. ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్ళాలని హెచ్చరిస్తూ పలు పట్టణాలలో సైరన్ల మోతలు మోగాయి. నతాంజ్‌పై దాడికి ప్రతిగా ఇజ్రాయెల్ అణు సంబంధ ప్రాంతాలపై ఎదురుదాడులు చేసినట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది. ఇరాన్ ప్రయోగిస్తున్న బాలిస్టిక్ క్షిపణులను సౌదీఅరేబియా కూల్చివేస్తోంది. రాజధాని రియాద్‌లో ఇరాన్ క్షిపణులను అడ్డుకుని కూల్చివేశారు. మరోవైపు సైప్రస్‌లోని బ్రిటన్ స్థావరాలపై హెజ్బొల్లా ఉగ్రవాదులు తమ దాడులు ఉధృతం చేశారు. దీంతో ఈ పరిస్థితిని సమీక్షించేందుకు బ్రిటన్ అధ్యక్షుడు స్టార్‌మర్ తక్షణ సమావేశం నిర్వహించారు. అరేబియా సముద్రంలోకి బ్రిటన్ అణు జలాంతర్గామి ప్రవేశించింది. పశ్చిమాసియాలో యుద్ధం మహోద్ధృతంగా ప్రమాదకర స్థాయిలో విస్తరిస్తుండగా, స్పెయిన్ మాత్రం గల్ఫ్ ప్రాంతం నుండి వెనక్కు వైదొలగడం ప్రారంభించింది. మరోవైపు అమెరికా,ఇజ్రాయెల్ మాత్రం శుద్ధిచేసిన యురేనియం జాడలు తెలుసుకునేందుకు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి.

పశ్చిమాసియాలో అమెరికా స్థావరాలున్న దేశాలపై ఇరాన్ దాడులు ఆగకుండా కనసాగుతున్నాయి. బాగ్దాద్‌లో సైనిక కేంద్రాలపై ఇరాన్ క్షిపణి దాడులతో బీభత్సం సృష్టించింది. దక్షిణ ఇజ్రాయెల్ పట్టణాలలో వరుస క్షిపణి ప్రయోగాలు,క్లస్టర్ బాంబులతో నెతన్యాహూ ప్రభుత్వాన్ని భయభ్రాంతులకు గురిచేసింది.నిషేధిత క్లస్టర్ బాంబుల ప్రభావం వల్ల 100మంది ఇజ్రాయెలీ పౌరులు గాయపడ్డారు. డిమోనా,అరద్ ప్రాంతాలలో ముందురోజు శనివారం ఇరాన్ దాడుల్లో కూడా 200 మంది ఇజ్రాయెలీ పౌరులు గాయపడ్డారు. ఈ ప్రాంతాలన్నీ పేలుళ్ళతో దద్దరిల్లాయి. డిమోనాలో 78మంది, అరద్‌లో 84 మంది తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. ఇజ్రాయెల్‌కు చెందిన ఎఫ్–16 యుద్ధ విమానాన్ని డ్రోన్ దాడుల్లో కూల్చివేసినట్లు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి)ప్రకటించింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌పై ఇరాన్ దాడులను ఆపకుండా అదేపనిగా కొనసాగిస్తుండగా, ఆ దేశం కూడా తీవ్రంగా ప్రతిఘటిస్తోంది. ఇరాన్ డ్రోన్లు, క్షిపణులను అడ్డుకుని కూల్చివేస్తోంది. యుద్ధం మొదలైనప్పటినుండీ ఈనాటి వరకూ వందలాది డ్రోన్లు, క్షిపణులను కూల్చివేసినట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రకటించింది. అదేవిధంగా ఇరాక్‌లో ఉన్న ఇరాన్ అనుబంధ ఉగ్రవాద సంస్థలు గడచిన 24 గంటల్లో 21 సార్లు అమెరికా స్థావరాలపై దాడులు చేశాయి. లెబనాన్ కేంద్రంగా పనిచేస్తున్న హెజ్బొల్లా ఉగ్రవాద సంస్థ కూడా ఇజ్రాయెల్‌పై గడచిన 24 గంటల్లో 55 దాడులు చేసినట్లు ప్రకటించింది. బీరూట్‌లో కూడా ఇజ్రాయెల్ సేనలు ఆదివారం కూడా తీవ్రస్థాయిలో దాడులు కొనసాగించాయి.

## సుస్థిర భవిష్యత్తు

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ఆదివారం గోవిందరావుపేట మండలం పస్రా అటవీ శాఖ కార్యాలయంలో ప్రపంచ అటవీ దినోత్సవ సందర్భంగా ఏర్పాటుచేసిన అడవుల సంరక్షణ..అవశ్యకత అవగాహన ర్యాలీ కార్యక్రమంలో మంత్రి సీతక్క , జిల్లా కలెక్టర్ దివాకర ఎస్, ఎస్‌పి సుధీర్ రామ్నాథ్ కేకన్, డిఎఫ్ఓ రాహుల్ కిసన్ జాదవ్‌లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ స్వచ్ఛమైన ప్రాణవాయువుకు అడవులే మూలాధారమని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మొక్కలను నాటాలని అడవుల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన జిల్లాగా ములుగు జిల్లా ప్రథమ స్థానంలో ఉందని స్పష్టం చేశారు. పంటలు సమృద్ధిగా పండాలన్న రైతులకు సరిపడా వర్షపాతం నమోదు కావాలన్నా అడవులే కీలక పాత్ర పోషిస్తాయని అడవులు అంతరించిపోతే మానవ మనుగడ సైతం అంతరించిపోతుందని తెలిపారు. ఛత్తీస్‌గడ్ ప్రాంతంలో ఇప్ప చెట్లను దైవంగా భావిస్తూ వాటిని అక్కడి ప్రజలు సంరక్షించుకుంటారని అన్నారు. అడవుల ద్వారా గిరిజనులకు గిరిజనేతరులకు అనేక లాభాలు ఉంటాయని స్థానిక గిరిజనులు సైతం అటవీ ఉపాధి పొందుతున్నారని అన్నారు. అడవిని సంరక్షించడంలో అటవీశాఖ అధికారులకు స్థానిక ప్రజలు యువకులు సహాయ సహకారాలు అందించినప్పుడు పూర్తి స్థాయిలో అడవుల రక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. కొంత మంది స్వలాభం కోసం వేసవి కాలంలో అడవులకు నిప్పు పెట్టడం వలన మొక్కలు, ఔషధ గుణాలున్న చెట్లు కాలిపోతున్నాయని, వన్యప్రాణులను వేటాడడం, చెట్లను నరకడం వంటి కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ములుగు జిల్లా ప్రకృతి రమణీయమైన జిల్లాగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకుందని ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతాలు దట్టమైన అటవీ ప్రాంతాలలో ఉండడంతో అనేక మంది పర్యాటకులు ములుగు జిల్లా అందాలను తిలకించడానికి వస్తున్నారని అన్నారు. అటవీ దినోత్సవం వేడుకలకే పరిమితం కాకూడదని, ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు, రోడ్డు పక్కన, చెరువు గట్ల వెంట మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మంత్రి కోరారు. ములుగు జిల్లాను అటవీ సంరక్షణలో దేశానికే ఆదర్శంగా నిలబెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం పస్రా గ్రామంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో రూ.35లక్షల నిధులతో రాజీవ్ కాలనీకి అంతర్గత సిసి రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, శిక్షణ ఐఎఫ్ఎస్ ప్రథమేష్ కేశవ్, తాడ్వాయి ఎఫ్‌డిఓ వజ్రారెడ్డి, ఏటూరునాగారం ఎఫ్‌డిఓ రమేష్, పస్రా సర్పంచ్ సుమలత, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు, అటవీ శాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com